ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం fb.com/vaartha

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 7 పేజీలు: 12 వెల: 6.50


కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఆదేశం
25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్‌బిఐ
5లో



## 11 నుండి 3 రోజులు ఫ్రాన్స్, అమెరికాలో ప్రధాని పర్యటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన తర్వాత భారతప్రధాని తన మొట్టమొదటి అధికార పర్యటనను నిర్వహిస్తున్నారు. ఈనెల 12,13 తేదీల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానంమేరకు ఆయన అమెరికాలో పర్యటించనున్నట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. అంతకు ముందు ప్రధాని ఫ్రాన్స్ పర్యటనకు కూడా వెళు తున్నారు. 11,12తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటించి ఆదేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో కలిసి భేటీ అవుతారు. కృత్రిమమేధపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారు. భారత సంతతి కుటుంబాలతో భేటీ అయ్యే మోడీ అక్కడి పెట్టుబడిదారులు, ప్రముఖ కంపెనీల సిఇఒలను కూడా కలుసు >>2



## వైఎస్సార్సీలో చేరిన శైలజానాథ్
2లో


# స్వర్ణాంధ్ర ప్రణాళికకు చేయూతనివ్వండి

## నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీని కోరిన సిఎం చంద్రబాబు

### రాష్ట్రంలో అవకాశాలు- ఆకాంక్షలపై నీతి ఆయోగ్ బృందానికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

### గత ఐదేళ్లలో రాష్ట్రంలోని పరిస్థితిని వివరించిన సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ ప్రొఫెషనల్ వన్ ఎంట్రప్రెన్యూర్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, దీనికి కేంద్రసాయం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ఏపీని అన్నిరంగాల్లో ముందంజన ఉండాలన్నదే తమ ప్రభుత్వం కీలక ఆశయమన్నారు.రాష్ట్ర లక్ష్యాలు,సంక్షేమ పథకాలు,అభివృద్ధికి సహకరించాలని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీతో అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయాలనికి సుమన్ బేరీ వచ్చారు.ఆయనకు ఏపీ సీఎం చన్ద్రబాబు నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఘనంగా స్వాగతం పలి కారు. అనంతరం ఆయనతో బేటీ అయ్యారు.ఈ సమావేశంలో గత అయిదేళ్ళ పాలనలో రాష్ట్రంలో చోటు చేసుకున్న ఆర్థిక అరా చకత్వం, అభివృద్ధిని తిరోగమనం పట్టించిన చర్యలు తదితరంశాల ప్రస్తావనకు వచ్చింది.ఉగాది నుంచి రాష్ట్రంలో చేపడుతున్న పీ-4 విధానం, 10 కీలక ప్రణాళికల అమలు ఇతర విషయాలను గురించి సీఎం చంద్రబాబు నీతి ఆయోగ్ బృందానికి తెలిపారు.గతంలో ఏం జరిగింది.ఇప్పుడు గత విధ్వంసకర పరిస్థితులనుంచి రాష్ట్రాన్ని శక్తివంతంగా చేసేందుకు అమలు చేస్తున్న విధానాలను వివరించారు.ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైకాంగ్రెస్ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై నీతి ఆయోగ్‌కు సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందన్నారు. రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2014- 19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలి పారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై >>2



శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్-2047ను సుమన్ బేరీకి అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్థిక మంత్రి కేశవ్




## 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

### 3 వారాలు సమావేశాలు

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరుగనున్నాయి. 24న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.దాదాపు మూడు వారాల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సెలవులతో కలుపుకుని 20 రోజుల పాటు సభ నిర్వహించే యోచనలో ఉన్నట్లుసమాచారం. మొదటిరోజు బీఏసీ తర్వాత సభ ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈనెల 28నశుక్రవారం 2025-26 >>2

## ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ ఉచితం

### సౌరఫలకాలు ఏర్పాటు

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 20.10 లక్షల విద్యుత్ కనెక్షన్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సౌర విద్యుత్ పలకలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల పలకలు ఏర్పాటుచేయనుంది. దీనికి సంబంధించిన సర్వేను రాష్ట్రప్రభుత్వం పూర్తిచేసింది. ప్రతినెలా కొన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రతిపాదనను కేంద్రం ఆమోదించింది. నిబంధన మేరకు కేంద్రం ఇచ్చే రాయితీ విడుదల చేసేందుకు అంగీకరించింది. వాటి నిర్వహణ బాధ్యతలను డిస్కంలకు అప్పగించాలని నిర్ణయించింది. వీటిద్వారా 2412 మెగావాట్ల సౌర విద్యుత్ అదనంగా అందుబాటులోకి వస్తుందని అంచనా. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సౌరవిద్యుత్ పలకలకు రూ.1.15 లక్షలు అవుతుందని ప్రభుత్వం అంచనా. అందులో కేంద్రం రూ.60 వేలరాయితీ అందిస్తుంది. మిగిలిన రూ.55వేలను రాష్ట్రప్రభుత్వం భరిస్తుంది. ప్రభుత్వం సుమారు రూ.వెయ్యి కోట్లు భరించాలి. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లు ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం అమలుకు ప్రతి నెలా రూ.200 కోట్లను సబ్సీడీగా డిస్కంలకు చెల్లిస్తోంది. ఎస్సీ ఎస్టీలకు ఇళ్లపై దశలవారీగా సౌర పలకల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. సబ్సిడీ కింద చెల్లిస్తున్న మొత్తాన్ని ప్రాజెక్టు అమలుకు >>2

## సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌కు గ్రీన్‌సిగ్నల్

### విశాఖ కేంద్రంగా ఏర్పాటు

### నైపుణ్యభారత్‌కు రూ.8,800కోట్లు: కేంద్ర కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దక్షిణకోస్తా రైల్వేజోన్‌లో కొత్తగా ఏర్పడతున్న విశాఖ పట్టణం డివిజన్‌ను వాల్తేర్ డివిజన్‌లోని కొంతభాగాన్ని వేరుచేసి ఏర్పాటుచేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వాల్తేరు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు పలాసా విశాఖ, దువ్వాడ, కూనేరు, విజయనగరం, నౌపడా జంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం నార్త్, దువ్వాడ బైపాస్, బదలపూడి దువ్వాడ విశాఖ స్టీల్‌ప్లాంట్, జగ్గయ్యపాలెం ప్రాంతాలు మొత్తం 410 కీలోమీటర్లను విశాఖపట్టణం డివిజన్‌పరిధిలోకి చేర్చారు. ఈ డివిజన్ ఇపుడు కొత్తగా ఏర్పాటవుతున్న దక్షిణకోస్తాజోన్‌లోకి వస్తుంది. అలాగే వాల్తేరు డివిజన్‌లో ఇతర ప్రాంతాలు కొత్తవలస, బచేలి, కూనేరు, తేరువాలిజంక్షన్; సింగాపూర్‌రోడ్డు, కోరాపుట్‌జంక్షన్; పర్లాకిమిడి, గున్‌పూర్ మొత్తం 680 కిలోమీటర్లను కొత్త డివిజన్‌కింద మార్చి రాయగడ డివిజన్‌గా మారుస్తున్నారు. ఈ డివిజన్ తూర్పుకోస్తా రైల్వేజోన్‌పరిధిలోకి వస్తుంది. బ్రిటిష్ వలసవాదుల కాలంనాటి పేరు కావడంతో వాల్తేరుపేరును మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే కేంద్ర ప్రభుత్వపరిధిలో కొనసాగుతున్న నైపుణ్యభారత్ పథకాన్ని 2026వరకూ కొనసాగించేందుకు ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ ఆమోదం తెలిపింది. 2022-23 నుంచి 2025-26 వరకూ కొనసాగే ఈ పథకానికి 8800 కోట్లు నిదులు కూడా కేటాయించింది. స్కిల్ ఇండియా కార్యాచరణతో నిపుణులైన, భావితరం పారిశ్రామికరంగానికి అవసరమైన వర్క్ ఫోర్స్‌ను సిద్ధంచేయడమేనని, డిమాండ్‌కు అనుగుణంగాను, >>2




# వైఎస్సార్సీలోకి శైలజానాథ్



శుక్రవారం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్సీలో చేరుతున్న డాక్టర్ శైలజానాథ్

## అదే బాటలో డిసిసి మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా శింగనమల రాజకీయాలు రసవత్తంగా మారాయి. రాజకీయాల్లో శత్రువులు, మిత్రులు ఎప్పుడు అవుతారు మిత్రులు శత్రువులు ఎప్పుడు అవతారో చెప్పలేని పరిస్థితి. ఇన్నాళ్లూ కాంగ్రెస్‌లో ఉంటూ వైఎస్.జగన్‌ను, వైసిపి నేతలపై విమర్శలు గుప్పించిన డాక్టర్ శ్రీశైలజానాథ్ శుక్రవారం వైసీపీ కండువా కప్పుకున్నారు. డా.శైలజానాథ్ వైసిపిలోకి రావడంతో ఆ పార్టీ బలం చేకూరినట్లు అయింది. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ శైలజానాథ్ మంచి వాగ్ధాటిగా, దూకుడుగా ముందుకెళ్లే వ్యక్తిగా గుర్తుంటుంది. శింగనమల స్థానంనుంచి 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో మంచి సంబంధాలు కొనసాగించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత వైఎస్.జగన్ కొత్తపార్టీ పెట్టినా ఇప్పటి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. కర్ణాటక తదితర రాష్ట్రాలోల్ల ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ పరిశీలకునిగా కూడా వెళ్లి విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షునిగా కూడా పని చేశారు. శింగనమల స్థానం నుంచి కాంగ్రెస్ తరపున ఐదు సార్లు పోటీ చేయగా రెండు సార్లు గెలుపొంది మూడు సార్లు ఓడిపోయారు. ఎన్నికలకు ముందే వైసిపిలో చేరాలని డాక్టర్ శైలజానాథ్ ప్రయత్నించినా అప్పట్లో ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా డాక్టర్ శైలజానాథ్, పిసిసి సభ్యుడైన మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం వైసిపి అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో కాంగ్రెస్ నుంచి వైసిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు అనంత వెంకటరామిరెడ్డి, వేంపల్లి సతీష్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి, తలారి రంగయ్య, మేరుగ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

**.ప్రజా సమస్యలపై పోరాడుతా: డాక్టర్ శైలజానాథ్:** వైఎస్ఆర్‌సిపిలో చేరిన అనంతరం సాకే శైలజానాథ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్ నాయకత్వంలో పని చేస్తూ, ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని ప్రజల పక్షాన పోరాడాలని నిర్ణయించుకున్నానన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలెజీలను నిర్వీర్యం చేయడం ద్వారా, పేదలకు వైద్య విద్య దూరంచేస్తున్నారన్నారు. గతంలో జగన్ విద్యారంగంలో చేసిన అమలు చేసిన అనేక సంస్కరణలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. రాయలసీమ జిల్లాల్లో రైతుల కష్టాలను కూడా చంద్రబాబు ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మొక్కవోని ధైర్యంతో పని చేసే నాయకత్వం జగన్‌ది అన్నారు. అందుకే ఆయన నేతృత్వంలో పని చేసేందుకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సాకే శైలజానాథ్ వెల్లడించారు. ఈ సందర్భంగా వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శైలజానాథ్ మా వైఎస్ఆర్‌సిపి కాంగ్రెస్ పార్టీలోకి చరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజల్లోపెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చంద్రబాబు నిజ స్వరూపం బయటపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ఆర్‌సిపి పని చేస్తుందని అనేకమంది మా పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. రాయలసీమ కృష్ణా జలాలు తీసుకొస్తానని చంద్రబాబు చెబుతన్నది శుద్ధ అబద్ధమన్నారు. చంద్రబాబు 1996లో ఆ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పట్టించుకో లేదన్నారు. కానీ వైఎస్ ఆర్ సీఎం అయిన తర్వాత కృష్ణ జలాలను రాయలసీమకు అందించారని, అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. చంద్రబాబు రాయలసీమకు ద్రోహం చేశారన్నారు. జగన్ సిఎంగా రాయలసీమ అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం మా రాయలసీమకు మళ్లీ అన్యాయం చేస్తోందన్నారు.

## 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

>> ఆర్థిక సంవత్సరానికి గాను సభలో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలకు మంత్రులు తమ శాఖల్లో అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయి సబ్జెక్టుతో హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. **ఎమ్మెల్యేలకు అవగాహన తరగతులు:** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఓరియంటేషన్ (అవగాహన) తరగతులు జరుగనున్నాయి. రెండు రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వర్క్ షాప్ జరుగనుంది. కొత్తగా వచ్చిన వారికి సభా నియమాలు, సభలో సభ్యుల పనితీరు, వ్యవహార శైలి, సభా మర్యాదలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించ నున్నారు. మొదటి రోజు ఎమ్మెల్యేల అవగా హనా తరగతుల కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యే అవకాశం ఉంది. అయితే అమరావతికి ఓం బిర్లా వస్తారా లేదా వర్చు వల్‌గా పాల్గొంటారా అనే అంశంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశంఉంది. ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యే అవకాశం ఉంది.

## విద్యుత్ ఉచితం

>> ఖర్చుచేయాలని భావిస్తోంది. ప్రాజెక్టు అమలు కోసం డిస్కంలు రుణాన్ని తీసుకుని అమలుచేయాలని నెల వాయిదా మొత్తాన్ని ప్రభుత్వమే ప్రతి నెల చెల్లించాలని నిర్ణయించింది. సౌర పలకలతో వచ్చే విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతోపాటు లీజు రూపేణా అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం సమకూర్చనుంది. ఒక్కొక్కరికి సుమారు 200 చదరపు అడుగుల స్థలం అవసరం ఉంటుందని అంచనా. లబ్దిదారుల ఇంటి పైకప్పును వినియోగించుకున్నందుకు చదరపు అడుగుకు రూపాయి చొప్పున లీజు రూపేణా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ ప్రకారం ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి నెలా రూ.200 చొప్పున అదనపు ఆదాయం లభిస్తుంది. ఇళ్ల పైకప్పు ఇందుకు అనువుగా లేనిచోట ప్రత్యామ్నాయంగా వాటి ఏర్పాటుకు అంగీకరించేవారితో ఒప్పందం చేసుకోవాలనిప్రభుత్వం నిర్ణయించింది. అలా వీలుకానిచోట ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో అవసరం మేరకు ప్రాజెక్టు ఏర్పాటుచేసి విద్యుత్‌ను అందించాలని నిర్ణయించింది. రెండు కిలోవాట్ల ప్రాజెక్టు ద్వారా నెలకు సుమారు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. లబ్దిదారుడు వినియోగించుకున్నది పోను మిగిలిన విద్యుత్ గ్రిడ్‌కు అందుతుంది. ఆ విద్యుత్‌ను డిస్కంలు వినియోగించుకోవచ్చు. ప్రతి లబ్దిదారుడు గరిష్ఠంగా 200 యూనిట్ల వరకు వినియోగించుకున్నా నెలకు 80.4 ఎంయూల విద్యుత్ డిస్కంలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. లబ్ధిదారులపై పైసా భారం పడకుండా చూడడంతో పాటు ప్రతి నెలా కొంత మొత్తాన్ని లీజు రూపేణా ప్రభుత్వమే చెల్లించనుంది.



శుక్రవారం న్యూఢిల్లీలో అక్కినేని జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన నప్రధాని మోడీ. చిత్రంలో నాగార్జున, అమల, లక్ష్మీప్రసాద్, నాగచైతన్య తదితరులు

## అక్కినేని జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి7:** అక్కినేని కుటుంబం ప్రధాని నరేంద్ర మోదీని కలిసింది. ఇటీవల జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో లెజెండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు, టాలీవుడ్ హిరో అక్కినేని నాగార్జున ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ప్రధాని మోడీని కలిసిన వారిలో అక్కినేని కుటుంబ సభ్యులు అమల, నాగచైతన్య, శోభిత ధూళిపాళ, నాగసుశీల, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. దివంగత అక్కినేని నాగేశ్వరరావుపై మాజీ ఎంపీ యార్లగడ్డ ప్రసాద్ రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్ అనే పుస్తకాన్ని ప్రధాని మోడీ ఆవిష్క రించారు.

కాగా, ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## స్వర్ణాంధ్ర ప్రణాళికకు చేయూతనివ్వండి

>> ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే.అన్ని అంశాల్లో నీతి ఆయోగ్ కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను, అభివృద్ధి ఆకాంక్షలను ముఖ్యమంత్రి వివరించారు. ఆవిష్కరణలు సాంకేతికత అందించడం, నూతన విధానాల అమలుకు తోడ్పడటంలో నీతి ఆయోగ్ సహకారాన్ని ఈ సందర్భంగా కోరారు. ఏపీ ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయానికి అందరూ చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. నీతి ఆయోగ్ మద్దతు ఉంటే రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని... వికసిత్ భారత్ 2047 సాధనలో ఏపీ మోడల్ స్టేట్‌గా ఉంటుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేయగా, కేంద్రానికి - రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధికి ఎంతో ఆస్కారముందని ఇందులో నీతి ఆయోగ్ భాగస్వామ్యం కూడా కచ్చితంగా ఉంటుందని సుమన్ బేరీ అన్నారు.

**సర్ణాంధ్ర2047పైనే దృష్టి పెట్టాం:** ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సుస్థిరత ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర2047పై ప్రధానంగా దృష్టిపెట్టామని ముఖ్యమంత్రి అన్నారు. మానవాభివృద్ధి ఉత్తమపాలన అంశాల్లో గ్లోబల్ లీడర్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. అయితే రాష్ట్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు.. అందులో ముఖ్యంగా రాష్ట్ర విభజన వల్ల రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం, రాష్ట్ర ఆదాయానికి గ్రోత్ ఇంజిన్ వంటి హైదరాబాద్‌ను కోల్పోవడం, ఏపీ పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మూలధన వ్యయంపై నిర్లక్ష్యం చూపడం, మౌలికవసతులను కల్పించకపోవడం వంటివి ఉన్నాయని చెప్పారు. ఏపీ దేశంలో 3వ అతిపెద్ద తీర ప్రాంతం కలిగి ఉండటం, పోర్టులురైల్వేహైవేలతో అతిపెద్ద కనెక్టవిటీ, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, తూర్పు ఆగ్నేయాసియాకు గేట్ వే కావడం, పునరుత్పాదకత విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులను ఆకర్షించడం ఏపీకి ప్రధాన సానుకూలాంశాలుగా తెలిపారు.

**రాష్ట్రంలో 3 గ్రోత్ హబ్‌లు ఏర్పాటు:** దేశంలోని 4 గ్రోత్ హబ్‌లో ఒకటిగా ఉన్న విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)తో పాటు తిరుపతి అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. బ్లూ ఎకానమీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ డెవలప్మెంట్... గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని అన్నారు. డేటా సేకరణ, బెస్ట్ ప్రాక్టీసెస్, స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్, ప్రైవేట్ పెట్టుబడులను ఆకట్టుకోవడం, ఎఫ్‌డీఐ, రిసోర్స్ మొబిలైజేషన్ తదితర విషయాల్లోనూ నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషించాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలకు సమీక్ష చేయాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, స్కిల్లింగ్ హబ్స్, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతుల బలోపేతంలో ఏపీ ప్రభుత్వం నీతి ఆయోగ్ కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. ఏపీ తీసుకున్న కీలక కార్యక్రమాలైన నదుల అనుసంధానం, పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మాలన, 2047 విజన్‌లోని పది ప్రధాన సూత్రాల అమలుకు నీతి ఆయోగ్ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 3 సీ పోర్టులు, 3 ఎయిర్ పోర్టులు ఉన్న తిరుపతిచెన్నయ్‌నెల్లూరును ట్రై సిటీగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకు వెళ్తుందని అన్నారు.


**కారు దగ్గరకు వెళ్లి మరీ వీడ్కోలు:** హైదరాబాద్‌లో తాను అభివృద్ధి చేసిన జినోమ్ వ్యాలీలో ఇప్పుడు 700 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అత్యుత్తమ పాలసీలను ఏపీలో అమలు చేయాలనేది తమ విధానమని ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 11 వేలకు పైగా ఈవీ బస్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్టు, అలాగే రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లపైనా రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. సచివాలయానికి తొలిసారి వచ్చిన సుమన్ బేరీకి ఘనంగా స్వాగతం పలకడమే కాకుండా సమావేశం అనంతరం ఆయన తిరిగి వెళ్లేటప్పుడు కారు దగ్గరకు వెళ్లి మరీ ముఖ్యమంత్రి వీడ్కోలు పలికారు.



## తెలుగింటి అమ్మాయి మిస్ గ్లోబల్ విన్నర్ 'భావన రెడ్డి చిన్నతంబు'కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

**చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** తెలుగింటి అమ్మాయి మిస్ గ్లోబల్ విన్నర్ భావన రెడ్డి చిన్నతంబు అంతర్జాతీయ స్థాయిలో అందాల పోటీలలో రాణించడం అభినందనీయమని అన్నారు. గురువారం భావన రెడ్డి తన తండ్రి గోపికృష్ణతో కలసి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వెళ్ళి అంతర్జాతీయ వేధికలపై ప్రతిభను కనబరిచి విజేతగా రాణించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్నారు.

భవిష్యత్తులో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు ఆమె సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాహిత కార్యక్రమాలు చేయడంలో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, పులికంటి మోహన్ రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రదీప్, చెరుకూరి శేఖర్, కోటేశ్వర్ రావు, భాషా, తదితరులు పాల్గొన్నారు.




ఇఓఎస్-06 ఉపగ్రహం సముద్రాన్ని దగ్గరగా తీసిన దృశ్యం

## నీలి సముద్రం సొగసు చూడతరమా..
### మన ఇఓఎస్-06 తీసిన చిత్రం ఇది

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శ్రీహరికోట నుంచి గతంలో ప్రయోగించిన ఇఓఎస్-06 ఉపగ్రహం మహాసముద్రాల రంగు పరిశీలనలు తెలుపుతూ విలువైన ఫోటోలు తీసింది. ఈ ఉపగ్రహంలోని ఓసిఎం సెన్సార్ ప్రపంచ స్థాయిలో అత్యంత మెరుగైనది. ఓషన్ కలర్ మానిటర్ (ఓసిఎం) సెన్సార్ ఇటీవల సముద్రానికి దగ్గరగా చిత్రాలు తీసి పంపించింది. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో ఒక కిలోమీటరు రిజల్యూషన్‌తో కూడిన శాటిలైట్‌లోని కెమెరాలు ఈ చిత్రీకరణ చేశాయి. ప్రపంచ స్థాయిలో మహాసముద్రాల బయో-జియో రసాయన వైవిధ్యంపై విలువైన సమాచారాన్ని సేకరించడంలో ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలు ఉపయోగపడుతున్నాయి.

## సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌కు గ్రీన్‌సిగ్నల్

>> టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక అనుసంధానంతో కూడి శిక్షణ దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన 4.0కింద పిఎం నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీమ్, జన్‌శిక్షన్ సంస్థాన్ స్కీమ్, ఈమూడు కూడా కీలకమైన అంశాలని కేబినెట్‌లో చర్చించారు. ఈ మూడు స్కీమ్‌లను ఇపుడు స్కిల్ ఇండియా పథకం కిందనే అమలుచేస్తున్నారు. ఉపాధి శిక్షణ, పట్టణ, గ్రామీణ జనాభాను కూడా పరిగణనలోనికి తీసుకుని ఈ స్కీం అమలవుతుంది. అంతేకాకుండా అణగారిన వర్గాలనుఅత్యంత సాంకేతిక విలువలున్న వృత్తి విద్యకు చేరువచేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకూ ఈ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కింద 2.27 కోట్లమందికి తర్ఫీదునిచ్చామని కేబినెట్‌లో అధికారులు ప్రధానికి వివరించారు. అలాగే కేబినెట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్‌ను మరో మూడేళ్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. మార్చి 2025నుంచి మరో మూడేళ్లపాటు ఈ కర్మచారి కమిషన్‌పనిచేస్తుంది. అంటే 31.03.2028వరకూ పనిచేస్తుంది. మూడేళ్ల పొడిగిపుంతో కమిషన్‌కు రూ.50.91 కోట్లుకేటాయింపులు కూడాచేస్తారు. పారిశుధ్య సిబ్బందికి సామాజిక ఆర్థిక సంక్షేమ అభ్యున్నతికి పాటు పడటంతోపాటు పారిశుధ్యరంగంలో కార్మికులకు ఉన్నమౌలిక వనరులపైనా కృషి చేస్తుంది.

## అమెరికాలో ప్రధాని పర్యటన

>> కుంటారు. అటునుంచి అమెరికాకు వెళ్లి ట్రంప్‌తో భేటీ అవుతారని విదేశాంగశాఖ ప్రకటించింది. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన మూడువారాలకే ఒక దేశ ప్రధానికి ఆహ్వానం రావడం అనేది అత్యంత అరుదైన అంశం అని విదేశాంగశాఖ చెపుతోంది. భారత్ అమెరికా దేశాలమధ్య కొనసాగుతున్న సంబంధాలకు ఈ ఆహ్వానం ఒక నిదర్శనమని ఆయన అన్నారు. ఇప్పటికే గతనెల 27వ తేదీ ప్రధానిమోడీ ట్రంప్‌లు తమ టెలిఫోన్ సంభాషణలో వాణిజ్యం, ఇంధన, రక్షణరంగంలో పరస్పర భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించుకునే దిశగా మన వ్యూ హాత్మక భాగస్వామ్యం కొనసాగాలని స్పష్టం చేసారు.

### వారం - వర్జ్యం

తేది : 8-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి రా.8.16
మృగశిర సా.6.06
వర్జ్యం : రా.2.25-4.00
దు.ఉ.6.46-8.20
శుభసమయం : ఉ.8.30-9.15,
సా.3.50-4.30
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**వృషభం :** ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. రుణాలు తప్పవు. వాహన యోగం.

**కర్కాటకం :** కుటుంబ సమస్యలు ఎదురైన నిదానంగా పరిష్కరించు కుంటారు. వాహన సౌఖ్యం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. ధనవ్యయం పెరుగుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య:** కొత్త వస్తువులు, గృహం, స్థలం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. రుణఒత్తిడులు ఉంటాయి.

**తుల :** గృహ నిర్మాణ ఆలోచనలు నిలకడగా వుండవు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. శుభవార్తలు వింటారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** సంఘంలో ఆదరణ పొందుతారు. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వాహనయోగం. సోదరుల నుండి సాయం పొందుతారు.

**కుంభం:** రుణాలు చేయాల్సి వస్తుంది. మిత్రుల నుండి వత్తిడులు ఎదురైతాయి, క్రయవిక్రయాలలో లాభాలు.

**మీనం:** ధనవ్యయం. పనులలో నిదానం అవసరం. చికాకులకు దూరంగా వుండండి. బంధువుల నుండి విలువైన సమాచారం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టీమ్ స్పిరిట్‌తో పనిచేయండి

### ఫైళ్ల క్లియరెన్స్‌లో ర్యాంకులు పని మెరుగుపడేందుకే..
### పాలనలో వేగం పెంచాలి
### ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు: సిఎం చంద్రబాబు

విజయవాడ.ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి: అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని తాను విశ్వసిస్తానని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే తమ ఆలోచనగా పేర్కొన్నారు. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్ లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చామని తెలిపారు."ఎక్స్" వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. దస్త్రాల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు, అలాగే ఎవరినీ తక్కువ చేయడానికి కాదని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పని చేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇదని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో తాను కూడా తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని అన్నారు. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని సీఎం అన్నారు. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని సీఎం సూచించారు. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పని చేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలమని అన్నారు. అమరావతితో పాటు ఇతర ప్రాంతాలు దేశాల్లో కూడా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌లు ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. దావోస్ వెళ్లి ఎన్ని డబ్బులు ఎన్ని ఒప్పందాలు చేసుకున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంలో మనం ప్రజలకు అన్ని వివరించాలన్నారు.2047 నాటికి 15 శాతం వృద్ధి రేటుతో 58 లక్షల తలసరి ఆదాయం నమోదు చేయించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. తమ లక్ష్యాల సాధనలో భాగస్వామి కావాలని బిల్ గేట్స్‌ను కోరానన్నారు. బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందించాలని కోరి నట్లు తెలిపారు. డీప్ టెక్ , అగ్రి టెక్ లాంటి సాంకేతికతను లక్ష్యాల సాధనకు వినియో గించుకుంటామని అన్నారు. దేశంలో సంస్క రణలు వచ్చి 30 ఏళ్లు అయ్యింది కానీ ఇంకా చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. అందుకే పీ4 విధానం తెచ్చామని పేర్కొన్నారు. తొలి నాళ్లలో పీసీఅంటే పోలీస్ కానిస్టేబులు అని ఎగతాళి చేశారన్నారు. ఇతర రాష్ట్రాలతో పెట్టు బడుల కోసం పోటీ పడినా, కోపరేటివ్ ఫెడరల్ స్పిరిట్‌తోనే ముందుకు వెళ్లాలని అన్నారు.

# ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యం

## డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసు కున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. 195 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపీ అటవీ శాఖ, రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని అన్నారు. అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న 8 మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ఆపరేషన్‌తో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు. అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో మీ



అంకితభావం, వేగవంతమైన చర్యలు తీసుకున్న అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు, అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# వాట్సప్‌లో ఇంటర్ హాల్‌టికెట్స్

**విజయవాడ ఫిబ్రవరి 07 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్‌లోఅందించేందుకు ప్రభుత్వ నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా శుక్రవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కళాశాలల హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు లేకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా వారంతా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. త్వరలో పదో తరగతి విద్యార్థులకు సైతం ఇలాంటి అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి,వాటిని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. ఈ నెల 10 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# జగన్ హయాంలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టులో విచారణ

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము చేస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలన్నీ నిలిపివేసినట్లు జయప్రకాశ్ వెంచర్స్ తరపు న్యాయవాధి కోర్టుకు తెలిపారు. మరోవైపు గత విచారణ తర్వాత తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక దాఖలు చేసింది. తదుపరి చర్యలు , తాజాగా తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక దాఖలు చేసింది. తదుపరి చర్యలు తాజాగా తీసుకున్న నిర్ణయాలతో తుది నివేదిక దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్ర పర్యావరణశాఖ గమనించిన విషయాలు తీసుకున్న చర్యలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశాల జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణకు ఏప్రిల్ 7 కు ధర్మాసనం వాయిదా వేసింది.

# అలాంటి వ్యక్తినైతే జగన్ అక్రమాస్తుల కేసులో ఇరుక్కునేవాడిని కాదు: మాజీ ఎంపి మోపిదేవి

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగే వ్యక్తినో, కాదో వైకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్ అంతరాత్మకే తెలుసని మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. మోపిదేవి ఎంపీ పదవికి రాజీనామా చేసి,ఇటీవల వైకాంగ్రెస్‌పార్టీ ను వీడారు. ఈ నేపథ్యంలో గురువారం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగే వ్యక్తినైతే జగన్ అక్రమాస్తుల కేసులో ఇరుక్కునేవాడిని కాదని మోపిదేవి వెంకటరమణ వ్యాఖ్యానించారు. జగన్‌ను నమ్మి మోసపోయినన్నారు.పదవులు ముఖ్య మను కుంటే వాటిని పట్టుకుని వెలాడే వాళ్ళమన్నారు. తమకు విలువలు,విశ్వసనీయత గురించి జగన్ చెప్పడం విడ్డూరమన్నారు. ఇటీవల వైకాపాను వీడి తెదేపాలో చేరిన మరో నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ జగన్ వ్యాఖ్యలపై స్పందించారు. విశ్వసనీయత, విలువల గురించిమాట్లాడే హక్కు ఆయనకు లేదన్నారు.

# విజయవాడలో కృష్ణాబోర్డు ఏర్పాటు చేయండి

## జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో కెఆర్‌ఎంబి సభ్యకార్యదర్శి రాయ్‌పురి చర్చలు

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు కృష్ణాబోర్డు ఏర్పాటు, కార్యకలపాల నిర్వహణకు కేఆర్‌ఎంబీ కార్యాలయం కోసం భవనం కేటాయించాలని ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేసింది.ఈ క్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తో కేఆర్‌ఎంబీ సభ్య కార్యదర్శి రాయ్ పురితో భేటీ అయ్యారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు నిర్వహణకు ఏపీ తరపున నిధుల కేటాయింపుపై చర్చించారు. కృష్ణా బోర్డును విజయవాడ తరలించే అంశంపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. విజయవాడలో కేఆర్‌ఎంబీ కార్యాలయం కోసం భవనం కేటాయించాలని రాయ్ పురి కోరారు. త్వరలోనే కేటాయిస్తాం: బోర్డు కార్యకలాపాలకు అనువుగా ఉండే కార్యాలయాన్ని త్వరలోనే కేటాయిస్తామని సాయిప్రసాద్ తెలిపారు. కార్యాలయానికి అవసరమైన వసతి ఏర్పాటు చేస్తామని సాయిప్రసాద్ పేర్కొన్నారు. అదే విధంగా బోర్డుకు సంబంధించిన పలు అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రతిపాదించిన మూడో దశ టెలీమీటరీ వ్యవస్థ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపింది. ఇప్పటికే రెండు దశల్లో టెలీమీటర్ల ఏర్పాటుకు అంగీకరించామని, నిధులు సైతం తామే భరిస్తున్నామని చెప్పారు. మూడో దశలో తెలంగాణ ప్రతిపాదించిన టెలీమీటర్లు తమ అంతర్గత అవుట్‌లెట్‌ల వద్దవి అని, ఇది ఏ మాత్రం తగదని తెలియజేశారు.కేవలం నాగార్జునసాగర్ కుడి వైపున మాత్రమే సీఆర్‌పీఎఫ్ భద్రతా ఏర్పాట్లు చేయడం సరికాదని చెప్పారు. రెండు ప్రభుత్వాలు కూడా సీఆర్‌పీఎఫ్ భద్రత అవసరం లేదని తెలియజేసినందున, భద్రతను తొలగించాలని కోరారు. అయితే తాము కేంద్ర జల్‌శక్తితో సంప్రదించిన తర్వాత మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోగలమని కేఆర్ ఎంబీ పేర్కొంటోంది. సీఆర్‌పీఎఫ్ కాకుండా సీఐఎస్ ఎఫ్ భద్రతా దళాలు ఏర్పాటు అంశం కూడా ఇరువుని మధ్య చర్చకు వచ్చింది. తాము పూర్తిస్థాయిలో చర్చించిన తరువాతే దీనిపై అధికారికంగా బోర్డుకు లేఖ రాస్తామని సాయిప్రసాద్ తెలిపారు. బోర్డులో ఆంధ్రప్రదేశ్ నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లే అధికారులు 3 సంవత్సరాలు పని చేసేందుకు, అవసరమైతే మరో రెండు సంవత్సరాలు పొడిగించేలా అవకాశం ఉండాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా బోర్డుకు ఎవరిని పంపినా, వారి పదవీకాలం మరో మూడు సంవత్సరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని రాయ్‌పురి తిరిగి కోరారు. ఎస్‌ఈల విషయంలో ఆ నిబంధన అనుసరించలేమని ఆంధ్రప్రదేశ్ అధికారులు చెప్పారు. కేఆర్ ఎంబీకి ఎస్‌ఈ స్థాయి అధికారిని డిప్యుటేషన్‌పై పంపేందుకు అంగీకరించారు. ఈ సమావేశంలో సాయిప్రసాద్, రాయ్ పురితో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసుడి చెంతనే దంపతులు ఆత్మహత్య

## - అనారోగ్యంకారణంతోనే బలవన్మరణం

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యంకారణంతో నాలుగేళ్ళక్రిందట స్వచ్ఛంద పదవీవిరణ చేసిన పోలీసు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు నాయుడు(60), భార్య అరుణ(55) ఏడుకొండల వేంకటేశ్వర స్వామి చెంత ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకోగా శుక్రవారం ఉదయం గది ఖాళీచేయాల్సి ఉండగా భక్తుల ఆచూకీ తెలియకపోవడంతో టిటిడి సిబ్బంది



గదిని తెరచి చూడగా లోపలే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని వుండటం కనుగొన్నారు. తిరుమల 2టౌన్ సిఐ రాముడు తెలిపిన వివరాలమేరకు.....తిరుపతి జిల్లాలో తిరుపతి క్రైమ్, ఈస్టు, అలిపిరి, సిఐడి,రేణిగుంట పోలీసుస్టేషన్‌లలో ఆయన కోర్టుకానిస్టేబుల్‌గా సమర్థవంతమైన విదులు నిర్వహించాడు. నాలుగేళ్ళక్రిందట అనారోగ్యంతో ఆయన స్వచ్ఛందపదవీవిరమణ చేశారు. వీరికి కుమార్తె,కుమారుడు ఉన్నారు. అల్లుడు కూడా పోలీసుశాఖలోనే పనిచేస్తున్నాడు. పదవీవిరమణ చేసినప్పటినుండి శ్రీనివాసులునాయుడు అరుణ దంపతులు తిరుపతిలోని అబ్బన్నకాలనీలో నివాసముంటున్నారు. ఆయన భార్యతో కలసి గురువారం ఉదయం తిరుమలకు వచ్చారు. నందకం విశ్రాంతి గృహంలో గదిని తీసుకున్నారు. గురువారమే దర్శనానికి వెళ్ళి దేవదేవుడిని దర్శించుకుని తమ మొర వినిపించారు. తిరిగి గదికి చేరుకున్నారు. దర్శనానంతరం వీరు తిరుపతికి దిగాల్సి ఉన్నా తిరుమలలోనే బసచేశారు. ఇద్దరూ బలమైన కారణాలతో ఒక నిర్ణయానికి వచ్చి దంపతులు ఒకేసారి లోకం విడిచిపెట్టి వెళ్ళారు. అయితే తరచూ తిరుమలలోనే ప్రాణాలు విడవాలని నమ్మకాన్ని ఆయన పలుమార్లు తన తోటి మిత్రులతో అనేవాడని, ఇప్పుడు ఈ విషాదానికి ఒడిగట్టడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం ఉదయం స్వామివారి దర్శనం బాగా జరిగిందని, మా చావుకు ఎవరూ కారణం కాదని, మాచావుకు మేమే కారణమని ఆత్మహత్యకు ముందు చీటిరాసి పెట్టారు. తమ దహనక్రియలకు బీరువాలో ఉన్న డబ్బును వాడాలని తమ్ముడికి సూచిస్తూ చీటిలో పేర్కొనడం కొంత పథకం ప్రకారమే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులుభావిస్తున్నారు. విషయం తెలియగానే తిరుమల 2టౌన్ సిఐ రాముడు నందకం చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. విశ్రాంత పోలీసుహెడ్‌కానిస్టేబుల్ దంపతులు ఒకేసారి ఈలోకాన్ని విడిచిపెట్టడం పోలీసుకుటుంబాలను కలచివేసింది. తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# జెసి కుటుంబీకులు శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

## - అమ్మవారికి బంగారు తాబేలు, బంగారు పళ్లెం బహూకరణ

**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం జెసి కుటుంబం ఆధ్వర్యంలో భ్రమరాంబిక అమ్మ వారికి బంగారు తాబేలు, బంగారు పళ్లెంని సమర్పించారు. ఈ సంద ర్భంగా జెసి కుటుంబీకులు అంద రూ పాల్గొని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధ లతో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి జేసి దివాకర్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, టిడిపి నేత జేసి పవన్‌రెడ్డి దంపతులు, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి దంపతులు, ఇతర మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నేత జెసి పవన్‌రెడ్డి, తాడిపత్రి

### బిసిల పక్షపాతి చంద్రబాబు:బిసి సంఘం అధ్యక్షుడు డా.మారేష్

**విజయవాడ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిసిల పక్షపాతి అని నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కలి ్పంచడం చారిత్రాత్మక నిర్ణయని ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం రాష్ట్రాధ్యక్షుడు డా మారేష్ అన్నారు. విజయవాడ లోని బిసి సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల చిరకాల కోరిక అయిన బిసి బిల్లు పార్లమెంట్లో పెట్టి ఆమోదించే నిర్ణయాత్మక శక్తి, చొరవ కలిగిన కూటమి ప్రభుత్వంకే సాధ్యమని చంద్రబాబు నాయుడు ఆమేరకు కృషి చేయాలన్నారు.

# ఆర్టీజిఎస్ పనితీరు ఆదర్శవంతం

## బోత్స్‌వానా దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుత

**సచివాలయం. ఫిబ్రవరి 7. ప్రభాతవార్త.** ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శనీయమని ఆఫ్రికా దేశాల్లో ఒకటైన బోత్సవానా దేశ ప్రతినిధులు ప్రశంసించారు. బోత్సా వాన దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుత శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.దినేష్ కుమార్ ఆయనకు స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. సీఎం చంద్రబాబు ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఈ సంస్థ ఒక వారధిగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య ఉన్న డేటా అనుసంధానం చేసి ఒక డేటా లేక్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను మరింత సరళతరం చేయడంలో ఈ సంస్థ దోహదపడుతుందని వివరించారు. డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్స్ తదితర సాంకేతిక సదుపాయలన్నీ ఉపయోగించుకోవడానికి ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఒకే చోట అన్ని సేవలు సులభంగా పొందేలా ప్రభుత్వం ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌ను అందిస్తుందన్నారు. ఇందులో ప్రస్తుతం 161 సేవలు అందిస్తున్నామని, తదుపరి అన్ని రకాల సేవలు ఇందులోనే పౌరులు పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. బోత్సా వాన దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుతా మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరు గురించి విని తాము ఈ కేంద్రిన్ని సందర్శించి స్వయంగా దీని పనితీరు తెలుసుకోవాలని వచ్చామన్నారు. ఈ సంస్థ పనితీరు అద్భుతంగా,

ఆదర్శనీయంగా ఉందన్నారు. తమ దేశంలో కూడా పౌరులకు మెరుగైన సేవలందించేలా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ మాధురి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జగన్‌కు ఓర్పు అవసరం: మాజీ ఎంపి విజయసాయిరెడ్డి హితవు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్రెడ్డికి ఓర్పు అవసరమని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సూచించారు. విజయ సాయిరెడ్డిని ఉద్దేశిస్తూ జగన్ మోహన్ రెడ్డి చేసిన కామెంట్స్ పై ఆయన స్పందించారు. జగన్కు ఇప్పటికే చాలా మంది శత్రువులున్నారు. రాజకీయాల్లో సహజంగా ప్రత్యర్థులుంటారు. రాజకీయాల్లో పరిస్థితులు ఎలాంటి వాళ్లనైనా ఒక్కోసారి వెనకడుగు వేసేలా చేస్తుంటాయి. తెలివిగా నడుచుకుంటేనే భవిష్యత్ వుంటుంది అని విజయ్ సాయి రెడ్డి హితో పలికారు. మొండిగా ముందుకుపోతే ఇబ్బందులు తప్పవు. ఈ విషయంలో జగన్ వైఖరి కొంత భిన్నంగా వుంటోంది అని సాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ట్విట్టర్ వేదికగా ఆయన జగన్ పై కామెంట్స్ చేశారు. ఇంకా మూడేళ్లకు పైగా రాజ్యసభ పదవీ కాలం వుండగానే, అది కూడా వైసీపీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో విజయసాయిరెడ్డి రాజీనామా నైతికంగా జగన్కు పెద్ద దెబ్బే. అయితే పార్టీ నడిపే నాయకుడికి కాస్త ఓర్పు వుండాలి అని ఆయన చెప్పారు. జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని కాబట్టే, ఎవరికి ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు అణువు లోను లేదు కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని మరి రాజకీయాలనే వదులుకున్నానని సాయి రెడ్డి స్పష్టం చేశారు.

# వివాహ వేడుకల్లో వైఎస్.విజయమ్మ

## - పలువురు వైఎస్సార్సీ నేతలు హాజరు

**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో** శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు ఒంటెద్దు మధుసూధన్‌రెడ్డి, శైలశ్రీల కుమారుడు హేమంత్‌రెడ్డి, సుస్మితల వివాహం ఆదివారం కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో కన్నుల పండువగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్.విజయమ్మ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ



మ ఆజీ అధ్యక్షులు సుగుమంచిపల్లి రంగన్న, రాప్తాడు మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు పామిడి వీరాంజినేయులు, అనంత చంద్రారెడ్డి, ఒంటెద్దు శ్రీకాంత్‌రెడ్డి, ఇతర ముఖ్య ప్రసన్నాయనపల్లి మహానందిరెడ్డి, బోయ నరేంద్ర పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## తెప్పపై వేడుకగా గోవిందరాజుని విహారం

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతి లోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం పుష్కరిణిలో శుక్రవారం సాయంత్రం స్వామిఅమ్మవార్లు పార్థసారధి స్వామి అలంకరణలో తెప్పపై విహరించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామివారి ఉత్సవమూర్తిని పార్థసారదిస్వామిఅలంకరణలోతెప్పపై వేంచేపుచేశారు.ఇక్కడ ఆలయ అర్చ కులు కర్పూర హారతులిచ్చి తెప్పను కది లించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య తెప్ప పుష్కరిణిలో మూడుప్రదక్షణలు తిరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, భక్తులు,అర్చకులు పాల్గొన్నారు.



## దాతల సహకారం అవసరం ! - అన్ని ట్రస్ట్‌లు, పథకాలకు విరాళాల సేకరణకు టిటిడి కార్యాచరణ !

**ప్రభాతవార్త ప్రతినిధి - తిరుమల:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దాతలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది. భక్తులకు సేవలందిం చడమేగాక ప్రజలకు అవసరమైన వైద్యం.విద్య పరంగా మెరుగైన సేవలం దించేందుకు టిటిడి ఇప్పటికే చొరవచూపుతోంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్న పలు రకాల ట్రస్ట్‌లు, పథకాలను దాతల విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. ఎస్వీ అన్నప్రసాదం, ఎస్వీప్రాణదానం, విద్యాదానం, గోసంరక్షణట్రస్ట్, వేదపరిరక్షణట్రస్ట్, ఎస్వీసర్వ శ్రేయట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్,కాటేజీ దాతల పథకం వంటి అనేక రకాల పథకాలు టిటిడి నిర్వహిస్తోంది.ఈ విభాగాలన్నిటికీ ఒక డిప్యూటీ ఇఒను నియమించి పర్యవేక్షిస్తోంది. వీటిల్లో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇప్పటికే దేశవిదేశాల్లోని కోటీశ్వరులైన, ధనవంతులైన భక్తులు దాతలుగా వేల కోట్లరూపాయలు విరాళాలుగా ఇచ్చారు. ప్రాణ దానం ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. ఇదివరకు టిటిడి దాతల నుంచి నగదు రూపంలో (డిడిలు, చెక్కుల రూపంలో)మాత్రమే విరాళాలు సేక రిస్తోంది. ఇలా పెద్దమొత్తంలో విరాళాలిచ్చిన దాతలకు టిటిడి పలు రకాల ప్రయోజనాలను కల్పి స్తోంది. తిరుమలకు వచ్చిన దాతలకు ఏడాదిలో వసతి, శ్రీవారి దర్శనంలో ప్రత్యేక సౌకర్యాలు కేటాయిస్తుంది. ఇప్పుడు టిటిడి అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్వీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని, ఎస్వీ సర్వశ్రేయ ట్రస్ట్‌కు కూడా విరాళాలు సేకరిస్తోంది. తిరుపతిలోని పద్మావతి మల్టీ సూపర్ స్పెషా లిటీ ఆస్పత్రి నిర్మాణంలో భాగంగా అవసర మైన వైద్యపరికరాలు విరాళంగా అందించినా ఆ దాతలకు ప్రయోజనాలు అందించేలా ప్రణాళికలు గత పాలకమండలినే రూపొం దించింది. వస్తు రూపంలో కూడా విరాళా లిచ్చిన దాతలకు అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపజేసేలా నిర్ణయించారు. ఇప్పటికే పలురకాల ట్రస్ట్‌లు, పథకాలకు లక్షలమంది దాతలు ఉన్నారు. ఈ దాతలను మరింతగా ప్రోత్సహించి గోసంరక్షణతో బాటు ప్రాణ దానట్రస్ట్‌ను, ఆరోగ్యవరప్రసాదినిని మరింత బలోపేతం చేసి పటిష్టంగా అమలుచేయడానికి చూస్తున్నారు. దాతలు తమ విరాళాలను ఈ హుండీ ద్వారా,కియోస్క్ పరికరాలతో, ఆన్‌లైన్‌లో, తమతమ బ్యాంకు అకౌంట్ల నుంచి కూడా పంపే సౌలభ్యం తీసుకువచ్చారు.

## ఉత్తరప్రదేశ్ నైమిశారణ్యంలో వైభవంగా శ్రీనివాస కల్యాణం

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆల యంలో నిర్వహించే రీతిలోనే ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో నైమి శారణ్యంలో శుక్రవారం ఉద యం శ్రీనివాసల్యాణం వేడుకగా నిర్వహించారు. నైమిశారణ్యం లోని బాలాజీ ఆలయంలో తిరుమల ఆలయ ప్రధాన



అర్చకుడు కృష్ణశేషాచలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీదేవిభూదేవిసమేల మలయప్ప స్వామి ఉత్సవర్లను కల్యాణవేదికవద్దకు వేంచేపుచేశారు.అక్కడ ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు వేదపండితులు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్రధారణ మొదలైన ఘట్టాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరగా స్వామిఅమ్మవార్లకు నక్షత్రహారతి ,మంగళహారతి సమర్పించడంతో కల్యాణం విజయవంతంగా ముగిసింది. అక్కడ తిలకించిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ శివప్రసాద్, హెచ్‌డిపిపి అదనపు కార్యదర్శి రామ్‌గోపాల్, ఎఇఒ రవి ,భక్తులు పాల్గొన్నారు.

**- గోమతినదీతీరంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం:** మహాకుంభమేళ సందర్భంగా నైమిశా రణ్యంలోని గోమతినదీతీరంలో శుక్రవారం వేడుకగా టిటిడి చక్రస్నానం నిర్వహించింది. ఉదయం 9గంటల నుండి 10గంటల మధ్య ఈ మహోత్సవం ఆగమోక్తంగా జరిపించారు. నదీతీరంలో చక్రత్తాళ్వారుకు పాలు,పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అభిషేక కైంకర్యాన్ని అందుకుని చక్రత్తాళ్వార్ పునీతుడయ్యారు. భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలాచరించారు.

## స్వామివారి ఆశీస్సులతో అంతా మంచి జరుగుతోంది

### - పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ రాజవేలు

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరుగుతుందని పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ పి.రాజవేలు ఆకాంక్షించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. శుక్రవారం దయం విఐపి బ్రేక్‌లో ఆయన స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## దేవదేవుని ఆశీస్సులతో అంతా శుభాలు జరగాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. శుక్రవారం వేకువజామున ఆయన శ్రీవారి అభిషేకంలో పాల్గొ న్నారు. ఆలయం మహాద్వారం వద్ద టిటిడి ఇఒ శ్యామల రావు స్వాగతం పలికారు.అభిషేకసేవలో పాల్గొన్న విజయానంద్‌కు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించారు. టిటిడి ఇఒ శ్యామలరావు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సిఎస్ వెంట తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ఉన్నారు.



ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యంకాదు.

-బార్కర్

# అక్రమ 'మార్కుల' ఆటకట్టించలేమా?

విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల తేదీలను ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో టెన్షన్ ప్రారంభమైంది. పరీక్షా విధానంలో మార్పులు, తప్పులు లేని ప్రశ్నపత్రాలు ఇవ్వడంలో విఫలం, లీకులు సర్వసాధారణమైపోయాయి. ఈ యేడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందడం సహజమే. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉండే ప్రధానంగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, కొన్నియూనివర్సిటీలు నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సులు, ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశఅర్హత పరీక్షలు, ఇతర కామన్ ఎంట్రన్స్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్‌కు సంబంధించి కీలకమైన ప్రశ్నపత్రాల్లో గత రెండు, మూడు దశాబ్దాలుగా ఒక్కసారి కూడా తప్పులు లేకుండా ఇవ్వలేకపోయారంటే అధికారగణం అసమర్థతను ఊహించుకోవచ్చు. ఈయేడాది ఎలాంటి తప్పులు లేకుండా ప్రశ్నపత్రాలు రూపొందించి వాటిని పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలకులు పాత పాటే పాడుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా పాలకులహామీలపై నమ్మకం కలగడంలేదు. లీకులు ఒకపక్క, మరొకపక్క తప్పులు, అధికారగణం అసమర్థతను చెప్పకనే చెబుతున్నాయి. ఈ వైఫల్యాల కారణంగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిపోతున్నది. ప్రస్తుతం ఉన్న పాలకుల కాలంలోనే ఈ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, పరీక్షా నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరిస్తున్నారని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఇది కొనసాగుతున్నది. ప్రశ్నపత్రాలు లీక్ అయిన విషయం కొన్ని సందర్భాల్లో బయటపడుతుంది. ఇలా బయటపడిన సందర్భాల్లో ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో పరీక్షలను వాయిదా వేస్తున్నది. మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇందుకు గత పదేళ్లలో చూసినా ఎన్నో ఉదహరించవచ్చు. రద్దు అయిన పరీక్షలకు తిరిగి హాజరు కావాల్సిన విద్యార్థుల పరిస్థితి ఒక్కసారి పాలకపెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు తయారై రాయాల్సిన సమయానికి అది వాయిదా పడినా లేక రాసిన పరీక్షను రద్దుచేసి మళ్లీ రాయమన్నా ఆ విద్యార్థులు ఎంతటి నిరాశానిస్పృహలకు గురవుతారో పాలకులు ఆలోచించడం లేదు. ఇక ప్రశ్నపత్రాలు లీక్ అయి బయటపడకుండా ఉంటే ఈ ప్రశ్నపత్రాలు కొన్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాల జవాబును కంఠస్థం చేసిన ప్రబుద్ధులు ఎలాంటి కష్టం లేకుండా మేధావులుగా పైకివెళ్లిపోతుంటే సంవత్సరం పొడువునా శ్రద్ధాశక్తులతో కష్టపడి చదివిన మెరికల్లాంటి విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వంపరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ పరీక్షలపై పటిష్టమైన నిఘా ఉంచాలి. అసలు అవి ఏ దశలో లీక్ అవు తున్నాయి?బాధ్యులు ఎవరు? ప్రశ్నపత్రాలుతయారు చేసేవారా?వాటిని సరిచూసి సక్రమంగా ఉన్నాయా?లేదా అని నిర్ధారించేవారా? లేక ఈ ప్రశ్నపత్రాలు రహస్యంగా తయారు చేసి రవాణా చేస్తున్నవారా? లేక పరీక్షా కేంద్రాలకు చేరిన తర్వాత అది నిర్వహిస్తున్న అధికారులా? తదితర విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఒకసారి మెడికల్ ప్రశ్నపత్రాలు రూపొందించిన ప్రొఫెసరే లీక్‌కు బాధ్యుడు కాగా మరొకసారి ఎంసెట్ ప్రశ్నపత్రాలు ముద్రించిన ప్రింటింగ్ యజమాని బాధ్యుడైనట్లు అప్పటి పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. మొత్తం ఇలాంటి కీలకమైన పరీక్షల్లో కూడా అవకతవకలు జరుగుతుండడంతో విద్యావ్యవస్థ ఎంతటి పతనావస్థకు దిగజారిపోతున్నదో స్పష్టమవుతున్నది. చదువుల తల్లి సరస్వతిదేవిని నడిబజారులో విక్రయించేఘోర స్థితి చేరడం, చదివే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషి చేస్తున్న విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తే ఆవేదన కలగకతప్పదు. నిత్య అధ్యయనంతో విజ్ఞానం ఆర్జించి పరిశోధనలతో మేధాసంపత్తిని పెంచుకోవాల్సిన విద్యావిధానం డబ్బుతో కొనుక్కునే స్థాయికి దిగజారడం దురదృష్టకరం. ఇందుకు కోచింగ్ సెంటర్లను కానీ, మరి కొన్ని రెసిడెన్షియల్ కాలేజీలనుకానీ నిందించి ప్రయోజనం లేదు. విద్యను వ్యాపారవస్తువుగా మార్చి స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం ప్రభుత్వమే వారికి కల్పించినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. వారిలో కూడా కొందరు ఇప్పటికీ విద్యాబోధనే పరమావధిగా భావించే వారు కూడా ఉన్నారు. కానీ తమ కళ్లముందే వెలసిన కోచింగ్ సెంటర్లు అతి స్వల్పకాలంలోనే కోట్లకు పడగెత్తడం చూసిన వారికి ఆ 'ఉన్నతి'ని తాము కూడా సాధించాలనే ఆశ పెరగడం సహజమే. ఆ ఆశే దురాశగా రూపాంతరం చెందినప్పుడు అక్రమాలకు అదుపు ఉండదు. అందుకే వారిని విమర్శించడానికి ముందు ఈ పరీక్షల నిర్వహణకు వేలాదిరూపాయల జీతభత్యాల రూపేణ ప్రజాధనం తీసుకుంటూ బాధ్యత వహిస్తున్న సంబంధిత అధికారులను నిలదీయాలి. ఆశాఖలోని కొందరు అధికారుల అవినీతితో పాటు రాజకీయజోక్యం, ఆశ్రిత పక్షపాతం వల్లనే పరీక్షల కు ఈ దుస్థితి దాపురిస్తున్నది. అంతేకాదు పరీక్షాపత్రాలు లీకైన సందర్భాల్లో కూడా బాధ్యులైన అధికారులపై పటిష్టమైన చర్యలు లేకపోవడం వల్లనే మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయి. అక్రమాలకు బాధ్యులైన అధికారులను తొలగించడమే కాదు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేసివారి ఫొటోలను మీడియా ద్వారా, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియపరచాలి. ప్రభుత్వం అంత కఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో పరీక్షాపత్రాలు కొనుగోలు చేయాలనే ఆశపడేవారికి, వ్యాపారం చేసేవారికి భయం ఉండదు.

జీవితంలో తృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎన్నడూ విచారానికి గురికాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.



జార్జి ఇలియట్

నీ గురించి ప్రజలు ఏమనుకోవాలని కోరుకుంటావో, అలా కావడానికి ప్రయత్నించడంలోనే జీవితానికి సార్థకత ఉంది.



విలియం జేమ్స్

## ప్రజావాక్కు



### బోసిపోతున్న ప్రభుత్వ ఖజానా

ప్రయాగరాజ్ స్టేషన్‌లో ట్రైన్ కోసం బెంచ్ మీద కూర్చుని నిరీక్షిస్తున్న పూరిశంకరాచర్య నిశ్చలానంద స్వామి వారిని చూసి ఆయన చాలామంది రాజకీయనాయకులు, పెద్ద ప్రభుత్వ ఉద్యోగులు నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. కళ్లు భైరులు తెచ్చే ఆయన ప్రొఫైల్ చూస్తే ఆయన ఎంత సామాన్య జీవితం గడుపుతున్నారో అర్థంఅవుతోంది. ప్రజాధనాన్ని విలాసవంతమైన ప్రయాణ ఖర్చులకు, తమ తమ బంధుమిత్రుల దైవదర్శనాలకు, పనిపేరుతో విలాస ప్రయాణాలకు ఖర్చుపెట్టేవీరుఇలాంటి మహానుభావులను చూసయినా స్వయం అవలోకన చేసుకొని నడుచుకుంటే ప్రభుత్వాల ఖజానా ఎందుకు బోసి పోతుంది. ఆలోచించాలి. డిప్యూటీ సి ఎం గారు ఈ విషయములో ఒక్కరే కొరడా ఝూళిపించగల సామర్థ్యం ఉన్న వారు అనుకోవడంలో సందేహం లేదు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### వ్యాఖ్యల దుమారం

**బిజెపికి** చెందిన ఎమ్మెల్యే, ఎంపి మంత్రులు తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా మోహన్‌భగవత్ వీరి పంచన చేరారు. దేశ చరిత్రను, దివంగత నాయకులను అవమానిస్తూ మాట్లాడటంఅంటే వీరికిచాలా ఇష్టంలాఉంది. ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రజల ముందు మాట్లాడే సమయంలో ఆచితూచి మాట్లాడాలి. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం సబబు కాదు.

-మిథునం, హైదరాబాద్

### ఆంగ్ల మాధ్యమంగా విద్యాబోధన

**కర్ణాటక,** తమిళనాడు రాష్ట్రాలు ఇటీవల ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఆంగ్లాన్ని విద్యాబోధన మాధ్యమంగా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రాథమికవిద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నాయి. అందుకు అనుగుణంగా, వచ్చే విద్యా సంవత్సరం నుండే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించటానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జపాన్, ఐర్లాండ్, పోలాండ్, ఫిన్లాండ్, దక్షిణకొరియా వంటి దేశాల్లో ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరుగుతోంది. దీంతోవిద్యార్థికిబోధనఅంశం సమగ్రంగా అర్థమవుతుంది.

-సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సెకి ఒప్పందం రద్దు చేసుకోవాలి!

**రాష్ట్ర** ముఖ్యమంత్రి విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే అంటున్నారు. మరి గత ప్రభుత్వం సెకితో చేసుకున్న సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంరాష్ట్రానికి పూర్తిగా నష్టదాయకం. దానిపై తెలుగు దేశంపార్టీ న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించడం జరిగింది. ఆ తర్వాత ఒప్పందంలో అవినీతి చోటు చేసుకుందని ఆధారాలతో సహా అమెరికా న్యాయస్థానంలో కేసు కూడా నమోదు చేశారు. ఈ అవినీతిలో జగన్ లడ్డూలా దొరికాడు అనికూడా వ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రభుత్వానికి భారమైన సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. లేదంటే కొనుగోలు షరతులనైనా మార్చుకోవాలి? ఈ విషయంలో ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో ప్రభుత్వం పై విశ్వాసం పోతుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఆ రోజులు మళ్లీరావు

మగ ప్రధానులు చూపలేని ధైర్యాన్ని ఇందిరాగాంధీ చూపారు. వారు చేయలేని సాహస కృత్యాలను ఆవిడ చేశారు. రాజకీయ ప్రత్యర్థుల నోటనుంచి శభాష్, వీరనారి, అపరదుర్గ అనే మాటలు వచ్చేలా పనిచేశారు. పాలన బావుంటే అప్పట్లో ఉన్న ప్రతిపక్ష నాయకులు ఇలానే ప్రశంసించేవారు. విలువలను పాటిస్తూ అధికార పార్టీ వారిని గౌరవంగా చూసేవారు. ఇప్పుడు అలాంటి ప్రతిపక్ష నాయకులు కాగడా పట్టుకుని వెతికినా కానరావటం లేదు. అధికారంలో ఉన్న వారిని చూసి అసూయపడే వారు ఎంత పనిచేస్తున్నా ప్రజలకు మంచి చేయడం కోసం చెమటోడ్చుతున్నా విమర్శించేవారు అధికారం కోసం పాకులాడే స్వార్థ బుద్ధి గలవారే కనబడుతున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### అంతర్యుద్ధం

**బర్మాలో** జరుగుతున్న అంతర్యుద్ధం తారాస్థాయికి చేరిన బర్మాలో సామాన్య ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఉండే ఆకాంక్షను వ్యక్తీకరణ చేస్తుంది. 87 శాతం ఓట్లు గెలుచుకున్న సూకీ నికాదని ముఖ్యమైన అధికారాలను దగ్గర పెట్టుకొని నియంతృత్వ పోకడలతో అధికారంలోకి వచ్చిన సైన్యం ను ప్రజలు ఎవగించుకుంటున్నారు. అది ప్రజాస్వామ్యం పట్ల ఆ పాలన పట్ల అక్కడి ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన జరిగితే మంచిది.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విస్తరిస్తున్న అవయవాల వ్యాపారం

**అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదానం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మందిలో మరణాంతరం నలభై మంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితర దేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసం చేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒక కారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి.**

దామెర్ల సాయిబాబ

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ ఆట పట్టిస్తుంది. అదే ఆశ మరో అడుగు ముందుకు వేసి అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులు కావాలనే దురాశతో కొందరు చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. ఏమిచేసైనా డబ్బు సంపాదించాలనే ఆరాటం పెరిగిపోతున్నది. ఇది అది అని కాదు. ఎక్కడబడితే అక్కడ మంచి చెడులు గూర్చి పట్టించుకోకుండా డబ్బుసంపాదనే ధ్యేయంగా కొందరు చేయరాని, చేయకూడని పనులు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. మానవ అవయవాలు, జీవితాలతో వ్యాపారం చేసే దుస్సంప్రదాయానికి తెగపడుతున్నారు. ఈ డబ్బు సంపాదన ఆరాటంలో రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. ఏకంగా ఇన్సూరెన్స్ చేయించి ఆ తర్వాత సదరు వ్యక్తిని హత మార్చి డబ్బు కాజేసే కార్యక్రమం గూర్చి వింటుంటుంటే ఆవేదన కల్గుతుంది. మనుషుల ప్రాణాలు అత్యంత కిరాతకంగా తీసి దాన్ని డబ్బుగా మార్చుకోవడం కంటే మరొక దుర్మార్గం ఉండదేమో. ఇక మానవ అవయవాల వ్యాపారం కూడా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరిస్తున్నది. శ్రీలంక రాజధాని కొలంబో కేంద్రంగా ఈ రాకెట్ కొనసాగుతున్న విషయం గతంలో బయటపడింది. విజయవాడ ప్రాంతంలో కూడా మరొక ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా హైదరాబాద్‌లో గత నెలలో వెలుగు చూసిన కిడ్నీల వ్యాపారంలోవిస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. కేవలం తొమ్మిది పడకలకు అనుమతులు పొందిన ఆస్పత్రిని ఏకంగా ముప్పయి పడకలతో నిర్వహిస్తూ అందులో కిడ్నీల మార్పిడి చేసే వ్యాపారం చేస్తున్నట్లు ఒక వ్యక్తి టెలిఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో జరిపిన తనిఖీల్లో బయటపడింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి గత నెల 17న వారి నుండి కిడ్నీలు తీసి కర్ణాటకకు చెందిన మరో ఇద్దరికి అమర్చినట్లు దర్యాప్తు అధికారులుగుర్తించారు. కిడ్నీ గ్రహీతల నుండి యాభైఐదు లక్షల రూపాయల మేర వసూలు చేసి కిడ్నీదాతలకు నాలుగు లక్షలు మాత్రమే ఇచ్చినట్లు అధికారుల దర్యాప్తులో బయటపడింది. ఇలా ఈ ముఠా దాదాపు తొంభైకి పైగా కిడ్నీమార్పులు చేసినట్లు చెపుతున్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ కేసులు విస్తరించి ఉండడంతో స్థానిక పోలీసుల నుండి దర్యాప్తును రాష్ట్ర సిఐడికి ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాదిలో మరొక కిడ్నీ మార్పిడి వెలుగుచూసిన కేసులో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ సూత్రధారి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడుగా కేరళ పోలీసులు గుర్తించారు. కొచ్చి విమానాశ్రయంలో పట్టుబడిన నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ముఠా ఈ కిడ్నీ వ్యాపారంలో పాలుపంచుకోగా అందులో ఒక వైద్యుడు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. అటు కర్ణాటక ఇటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పేద యువకులను ఇరాన్‌కు తీసుకువెళ్లి అక్కడ వారి కిడ్నీలను అమ్ముతున్నారు. ముఖ్యంగా డబ్బుఅవసరం ఉన్న పేద యువకులను గుర్తించి వారికి డబ్బు ఆశచూపి, వారికి కావాల్సిన పాస్‌పోర్టు, వీసాలు దళారులే సమకూర్చి ఇరాన్‌కు తరలిస్తున్నారు. ఎవరికిడ్నీ ఏ గ్రహీతకు సరిపోతుందో మెడికల్‌గా నిర్ధారించుకొన్న తరువాత ఈ మార్పిడి కార్యక్రమం చేయిస్తున్నారు. అయితే బాధిత యువకుడు ఒకరు ఇటీవల మరణించడంతో అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూపీలాగుతున్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకొన్నది. హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు విశాఖపట్నం వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పివెళ్లి శ్రీలంకలోని కొలంబోలో శవమై తేలాడు. కూపీలాగడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విఫలమై ప్రాణాలు కోల్పోయినట్లు వెలుగుచూసింది. ఎందరో యువకులు దళారుల మాయలో పడి డబ్బుల ఆశలో ఈ వలలో చిక్కుకొంటున్నారు. ఈ అవయవాల మార్పిడి ఆపరేషన్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న విషయాలు స్పష్టం చేస్తున్నాయి. మరొకపక్క కిడ్నీ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మారిన ఆహార అలవాట్లతో కిడ్నీవ్యాధి దేశవ్యాప్తంగా తెలుగురాష్ట్రాల్లో బాగా పెరిగిపోయింది. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికితోడు వాతావరణ కాలుష్యం, జీవన విధానంలో మార్పులు కారణంగా మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు విస్తరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా మూత్రపిండాలకు సంబంధించిన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్లాడుతున్నారు. దాదాపు పదిలక్షల వరకు మూత్రపిండాలు మార్పిడి చికిత్స చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. అవసరం మేరకు మూత్రపిండాలు ఇచ్చే దాతలు ముందుకు రావడంలేదు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు లక్షన్నర మందికిపైగా మూత్రపిండాలు పనిచేయక డయాలిసిస్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికిమార్పిడి చికిత్స ఒక్కటేపరిష్కారం. అయితే ఇందుకు యాభైలక్షల రూపాయల వరకు వ్యయంచేయాల్సి ఉంటుంది. నిరుపేదలుఅంతటి ఖర్చును పెట్టుకునే పరిస్థితుల్లో లేరు. మరొకపక్క ప్రభుత్వం నుండి ఈవిషయంలో పెద్దగా శ్రద్ధ కన్పించడంలేదు. ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయి కోమాలో ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించి 'జీవన్‌ధార్' పథకంకింద ముందుగా నమోదు చేయించు కున్న వారికి సీనియార్టీ బట్టి మార్పిడి చికిత్స చేస్తున్నారు. అయితే ఏళ్లతరబడి ఎదురు చూసి తమ టర్మ్ వచ్చేలోపలే అసువులు బాసినవారెందరో ఉన్నారు. తెలంగాణలో అవ యవ మార్పిడికి నలభైఒక్క ఆస్పత్రులకే అనుమతులున్నా యి. దాదాపు 15 వేల 7 వందల మందికి పైగా జీవన్ ధార్ ట్రస్టులో రిజిస్టర్ చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ పరిస్థితుల్లో మార్పు వచ్చినట్టు కన్పించడం లేదు. తెలంగాణలో, అటు ఆంధ్రప్ర దేశ్‌లో డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక మం చానికే పరిమితమై రోజురోజుకూ కృంగి కృశించి అసువులు బాస్తున్న వేలాది కుటుంబాల వేదన వర్ణనాతీతంగా ఉంది. నరకయాతను అనుభవిస్తూ యమలోకానికి పయనం కడుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయకస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు పడుతున్న వేదన వర్ణనాతీతం. తెలంగాణలో గత ప్రభుత్వం ఈ డయాలసిస్ సెంటర్లు పెంచి పేదలకు ఉచితంగా చికిత్సఅందించే ఏర్పాటుచేసింది. అవి అవసరం మేరకు కిడ్నీ బాధితులందరికీ సరిపడేస్థాయిలో, అందుబాటులో లేవనే చెప్పచ్చు. పాలకులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని అటు కిడ్నీల వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టించడ మేకాక ఇటు ప్రభు త్వపరంగా చర్యలు తీసుకొని మార్పిడి చికిత్స సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా చేయాల్సి న అవసరంఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదా నం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మంది లో మరణాంతరం నలభైమంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితరదేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసంచేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒకకారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసు కొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి. •

## ఒక్క మాట

# విమాన ప్రయాణాలు ఎంత వరకు సురక్షితం!

బి.మధుసూదన్‌రెడ్డి

దక్షిణ కొరియాలో గత ఆదివారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఏకంగా 179మంది దుర్మరణం పాలవడం వింటేనే విమాన ప్రయాణం అంటే వణుకు పుట్టేస్తున్నది. 175 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు సిబ్బందితో కూడిన విమానం థాయిలాండ్ నుంచి సియోల్‌కు 290 కిమీ దూరంలోఉన్న ముయాన్‌కు బయలుదేరి జెజు ఎయిర్‌కు చెందిన బోయింగ్ జెట్ విమానం దిగుతుండగా కుప్పకూలిపోయి రక్షణ గోడను ఢీకొని ముక్కలైపోయి 179 మందిని పొట్టన పెట్టుకుంది. ఇద్దరు సిబ్బంది మాత్రమే గాయాలతో బయట పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదంగా దీనిని గుర్తిస్తున్నారు. అదే విధంగా ప్రపంచ క్రిస్టియన్లు క్రిస్మస్ వేడుకల్లో మునిగిన వేళ అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 25 డిసెంబర్‌న కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 ప్రాణాలు కోల్పోవడం, 29 మంది గాయాలతోబయట పడడం కూడా మనల్ని కలిచి వేసిన ప్రమాదంగా మన మనసుల్లో నమోదు అయింది. ఈ విమానాన్ని రష్యా మిలిటరీ కూల్చి వేసిందనే ఆరోపణ కూడా వినవలసిరావడం విచారకరం. తరుచుగా జరుగుతున్న వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు ప్రపంచ ప్రయాణికుల గుండెల్లో వణుకును పుట్టిస్తున్నాయి. ఏవియేషన్ వర్గాల అధ్యయనాల ప్రకారం 53 శాతం విమాన ప్రమాదాలు మానవ తప్పిదాలతో, 21 శాతం మెకానికల్ వైఫల్యాలతో, 11శాతం ప్రతికూల వాతావరణాల వల్ల జరుగుతున్నట్లు తేలింది. అయినప్పటికీరోడ్డు, రైలు ప్రయాణాలతో పోల్చితే విమాన ప్రమాదాలు చాలా తక్కువగా నమోదు అవుతున్నట్లు వివరిస్తున్నారు. 2018-22 మధ్య సమయంలో ప్రపంచవ్యాప్తంగా 13.7 మిలియన్ల విమానయాన ప్రయాణీకుల్లో ఒక్క ప్రయాణీకుడు మాత్రమే ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అదే విధంగా 16 మిలియన్ల వాణిజ్య విమానాల్లో ఒక్కటి మాత్రమే ప్రమాదానికి గురి అవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు 20 వరకు జరుగగా, అందులో 400 వరకు ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో రష్యా మిలటరీ విమాన కూల్చివేతలో 74 మంది, బ్రెజిల్ ప్రమాదంలో 62మంది, కాట్మండు ప్రమాదంలో 18మంది, రష్యా విమానప్రమాదంలో 15మంది, లుతువానియా విమాన ప్రమాదంలో నలుగురు ప్రయాణీకులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో మాత్రమే ఒక్క ఏడాది 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.69 లక్షల మంది ప్రాణాలు వదిలారు. 2023లో సగటున రోజుకు 474మంది ప్రజలు మరణిస్తున్న విషయం మరువరాదు. 2014- 23 మధ్య కేవలం భారత్‌లో జరిగిన 638 రైలుప్రమాదాల్లో 2,453 మంది మృతి చెందినట్లు తెలుస్తున్నది. విమాన ప్రయాణాల భద్రతకు విమాన పైలెట్‌సిబ్బంది, విమాన ఇంజన్ కండీషన్, సిబ్బందికి అందించే శిక్షణలాంటిఅంశాలు సంబంధాన్ని కలిగి ఉంటాయి. విమాన ప్రమాదాలకు కొంతవరకు పక్షులు ఢీకోవడం కూడా మరోకారణంగా గుర్తించబడింది. ఇప్పటికైనా విమానయానాలు పరలోక ప్రయాణాలు కాకుండా వారిని సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని, మానవ తప్పిదాలను పూర్తిగా తప్పించాలని ఆశిద్దాం. •

# గాజాపై అమెరికా అధ్యక్షుని ప్రభావం

ఎం కె కుమార్

ట్రంప్ గాజాపై అమెరికా యాజమాన్యాన్ని ప్రస్తావిస్తూ, 'మేము దానిని సొంతం చేసుకుంటాం, అభివృద్ధి చేస్తాం, వేలాది ఉద్యోగాలు కల్పిస్తాము" అంటూ గాజాను ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేశారు. గతంలో కూడా ట్రంప్ "జస్ట్ క్లీన్ అవుట్" అంటూ పాలస్తీనా ప్రజలను జోర్డాన్, ఈజిప్టుకు బలవంతంగా తరలించాలనే సూచన చేశారు. ఇది 1948 జెనీవా కన్వెన్షన్ ప్రకారం జాతిహత్య ఉద్దేశం కింద పరిగణించబడుతుంది. అంతేకాదు, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధ నేరాలను విమర్శించే ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల మండలి, పాలస్తీనా ప్రజలకు సహాయపడే యుఎన్ ఏజెన్సీలకు మద్దతును కూడా ట్రంప్ ఉపసంహరించుకున్నారు. ఇజ్రాయెల్‌ను తక్షణంగా ఆపాల్సిన అవసరం ఉన్న సమయంలో, ట్రంప్ ప్రభుత్వం 2000 పౌండ్ల బాంబుల సరఫరాను కొనసాగించింది. ఇది గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్, సిరియాలో ఇజ్రాయెల్ హింసను మరింత పెంచడానికి దోహదపడింది. ట్రంప్ చేసిన ప్రకటనలు గాజా ప్రజలను పూర్తిగా తరిమేయాలని ఉద్దేశించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలస్తీనాప్రజలు, ప్రతిఘటన వర్గాలు ట్రంప్ మాటలను ఖండించాయి. ప్రపంచ మంతా గాజాను జియోనిస్ట్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రదేశంగా చూస్తున్నది. ట్రంప్ మాత్రం దానిని మరణం, విధ్వంసంగా పేర్కొన్నారు. ట్రంప్ నిజంగా గాజాపై అమెరికా దండయాత్రకు ప్రణాళిక వేస్తున్నాడా? లేక ఇది కేవలం రాజకీయ ఆడంబరమా? కాలమే సమాధానం చెప్పాలి. ట్రంప్ తనను యుద్ధాలను ముగించే నేతగా ప్రస్తావించుకున్నాడు. ఆయన చర్యలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని24 గంటల్లో ముగిస్తానని చెప్పినా, అది సాధ్యపడలేదు. గాజా కాల్పుల విరమణ కూడా మిగిలిపోలేదు. ఇప్పుడు ఆయన గాజా జనాభాపై జాతి ప్రక్షాళనకు మద్దతుగా మాట్లాడటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురైంది. ట్రంప్ ప్రవేశపెట్టిన అబ్రహం ఒప్పందాలు ప్రణాళిక, పాలస్తీనా స్వేచ్ఛా ఉద్యమాన్ని అణిచివేయడానికి రూపొందించబడింది. ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్ ముందుకు తెచ్చిన ఈ ప్రణాళికను బిడెన్‌హారిస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీని ద్వారాఈజిప్ట్, జోర్డాన్, మొరాకో, యుఎఇ, సూడాన్ దేశాలను ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకునేందుకు ఒత్తిడి చేశారు. ఇప్పుడు సౌదీ అరేబియా కూడా ఒప్పందంలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఒప్పందాల అసలు ఉద్దేశ్యం పాలస్తీనా, హిజ్బుల్లా, ఇరాక్, ఇరాన్, యెమెన్ వంటి ఖియాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ అనే దేశాలు, సంస్థలను అణగదొక్కడమే. అక్టోబర్ 7న గాజాలో తిరుగుబాటు, జైలు విచ్ఛిన్నం, విధ్వంసం జరిగింది. దీని తర్వాత, ఈ ఒప్పందాలను సమర్థించడం అరబ్ దేశాలకు కూడా కష్టంగా మారింది. ట్రంప్ యుద్ధాలకు వ్యతిరేకి కాదు. ఆయన చర్యలు గాజా ప్రజల పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ జియోనిస్ట్ లాబీ, వైట్‌హౌస్, అమెరికా పాలనపై ఎంత ప్రభావం కలిగిఉందో ప్రపంచం చూస్తోంది. అత్యంత ప్రజాదరణ లేని నాయకుడైన ట్రంప్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) అరెస్ట్ వారెంట్ ఉన్న నెతన్యాహును వైట్‌హౌస్‌కు ఆహ్వానించాడు. దీనివల్ల ఆయన "అమెరికా ఫస్ట్" అనే నినాదం వెనుక "ఇజ్రాయెల్ ఫస్ట్" వుంది కదా? అనే ప్రశ్న ఉత్పన్నమయింది. అమెరికా ఆధిపత్యం తగ్గి



పోతున్న ఈ పరిస్థితిలో, ట్రంప్ తన యుద్ధాలు, ఆంక్షలు, బెదిరింపులు ఇకపై పని చేయవని గ్రహించాలి. జి7దేశాలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ ఆవిర్భావం ప్రపంచ శక్తి సమతుల్యతను మార్చేస్తోంది. ఇజ్రాయెల్ వద్ద ఆధునిక ఆయుధాలు, బలమైన మద్దతుఉన్నప్పటికీ, గాజాలో విజయం సాధించలేకపోయింది. కాల్పుల విరమణ ఒప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. హమాస్‌ను ఓడించలేకపోయింది. బందీ లను విడిపించలేకపోయింది. తన స్వంత ప్రజల దగ్గరే ఓడిపోయిన నెతన్యాహు, యుద్ధ నేరాలకు బాధ్యుడయ్యాడు. అన్ని హింసల మధ్య పాలస్తీనా ప్రజలు లొంగిపోవడానికి నిరాకరించారు. ఇజ్రాయెల్ అమెరికా యుద్ధ యంత్రాన్ని ఎదుర్కొంటూ, తమ హక్కులకోసం పోరాటం కొనసాగిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో కాల్పుల విరమణకు అంగీకరించడంపై అనేక చర్చలు జరిగాయి. దీనికి ప్రధాన కారణాలు, విస్తరించిన ఇజ్రాయెల్ సాయుధ దళారులకు విరామం అవసరం. అమెరికా కొత్త అధ్యక్షుడి ఒత్తిడి, తక్కువ హింసాత్మక విధానాలను అనుసరించాలనే వ్యూహం వుంది. ట్రంప్ నెతన్యాహును ఏ విధంగా ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఉంది. ఆయన అమెరికా వ్యూహాన్ని అనుసరించాలి. అదే సమయంలో యుద్ధాలను తగ్గిస్తూ ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించాలని సూచించి ఉండవచ్చు. నెతన్యాహు కూడా ఇది తన సైన్యానికి విశ్రాంతి కల్పించడానికి, బందీల విడుదల ద్వారా దేశీయ ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు. అంతర్జాతీయంగా ఒక సానుకూలత సృష్టించడానికి ఉపయోగపడుతుందని అంగీకరించవచ్చు. ట్రంప్ నెతన్యాహును ఏమని ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఇది. అమెరికా వ్యూహాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగా, ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు యుద్ధాన్ని పూర్తిగా నిలి పివేయకుండానే మరొక మార్గాన్ని అన్వేషించమని సూచించి ఉండవచ్చు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పాలస్తీనియన్లను ఈజిప్ట్, జోర్డాన్‌లో పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు. అయితే, ఈ నిర్ణయాన్ని పాలస్తీనియన్లు, ఈజిప్ట్, జోర్డాన్‌తోపాటు ఇతర అరబ్‌దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ట్రంప్ గాజాలో అమెరికా ప్రత్యక్ష పాత్ర ఉండొచ్చని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ తరలింపు వ్యూహం విఫలమయ్యేలా కనిపిస్తోంది. ఎందుకంటే అన్ని అరబ్ దేశాలు దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలిచాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, యుద్ధంకాకుండా అమెరికా, ఇజ్రాయెల్ తమ లక్ష్యాలను ఎలా సాధిస్తాయి? శాంతియుత మార్గాలు పనిచేయకపోతే, మళ్లీదాడులకు, యుద్ధానికి మారుతారా? ఈ అస్పష్టత కారణంగా గాజా ప్రజలు, శాంతిని కోరుకునే ప్రపంచం ఆందోళనతో ఎదురుచూస్తోంది. అధ్య క్షుడు ట్రంప్ యుద్ధం కాకుండా ఆధిపత్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఈ వ్యూహంలో ప్రధానంగా రెండు భాగాలు ఉన్నాయి. పొరుగు ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం. ఇందులో గ్రీన్‌ల్యాండ్ లేదా కెనడా వంటి ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని టార్గెట్ ఉంది. ఇది అమెరికాకు సహజ వనరులను పెంచుతుంది. రష్యా, చైనాలపై వ్యూహాత్మక క్షేత్రం ఏర్పడటానికి దోహదపడుతుంది. వ్యూ హాత్మకలోతును పెంచడం. అమెరికా, ఆర్కిటిక్ ప్రాంతంపై నియంత్రణ పెంచుకోవడం ద్వారా మరింత ప్రభావవంతంగా మారుతుంది. అలాగే యూరోపియన్ దేశాలకు సమీపంగా కొత్త గ్రీన్‌ల్యాండ్ సరిహద్దు ఏర్పడుతుంది. ఈ వ్యూహం వాస్తవంగా యుద్ధం లేకుండా అమెరికాకు విజయాన్నిసాధించడంలో సహాయపడుతుంది. అలాగే కొన్ని విధ్వంసకర యుద్ధాలను నివారించడంలో దోహదం అవుతుందని ఊహించవచ్చు. ఈవ్యూహారచన గతంలో జరిగిందే. అమెరికా, అంతరిక్ష లేదా వైమానిక యుద్ధంవైపు అడుగులు వేయాలని సూచిస్తుంది. ట్రంప్ వంటి నాయకులు తమ అధికారాన్ని సాధించడానికి చేసే వ్యూహాలు చాలా దేశాలకు ఇబ్బందులను కలిగిస్తాయి. •

# కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఎల్జీ ఆదేశం

### ఆప్ అధినేత ఆరోపణలను ఖండించిన బిజెపి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తమ అభ్యర్థులను కొట్టుకుపెట్టుకొనేందుకు కుట్రలు చేసిందని మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు అనుమతించారు. ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీ జరుగుతున్నందున ఇప్పటి నుంచే అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు బిజెపి సిద్ధం అవుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.అయితే ఈ వ్యాఖ్యలు బిజెపి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని, ఎన్నికల ఫలితాలను సైతం దిగజార్చేవిధంగా కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి ఆరోపించింది. ఇదిలా ఉంటే లెఫ్టినెంట్‌గవర్నర్ వికె సక్సేనా ఈ ఆరోపణలపై వాస్తవాలు వెలికితీయాలంటూ విచారణకు ఆదేశించారు. ఢిల్లీ ఎసిబి అధికారులు కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఆయన ఉంటున్న సివిల్‌లైన్స్ నివాసానికి వెళ్లారు. అయితే ముందు లాంఛనంగా కేసు నమోదు చేయాలని ఎసిబి భావిస్తోంది. ఎసిబి చర్యలు తీసుకోవాల్సింది పోయి ఎందుకు డ్రామాలు చేస్తోందని ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ ప్రశ్నించారు. విచారణలో మొత్తం వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కదా అని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్‌కేజ్రీవాల్ తన సోషల్‌మీడియా పోస్టులో మొత్తం 16మంది ఆప్ అభ్యర్థులకు బిజెపినుంచి ఆఫర్లు వచ్చాయని, వారికి మంత్రి పదవులివ్వడంతోపాటు ఒక్కొక్కరికీ రూ.15 కోట్లు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. కొన్ని సర్వేసంస్థలు బిజెపికి 55 సీట్లు వస్తాయని ముందునుంచే చెపుతోందని, గడచిన రెండగు గంటల్లోనే 16 మంది తమ అభ్యర్థులకు ఈ ఆఫర్లు వచ్చాయని ఆయన చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్ సర్వేల వివరాల వాస్తవికతను కేజ్రీవాల్ ప్రశ్నించారు. వారికి నిజంగా 55 సీట్లే వస్తుంటే మావాళ్లకు ఆఫర్లు ఎందుకు ఇస్తున్నారని కేజ్రీవాల్ ప్రశ్నించారు. దీన్నిబట్టే ఇవన్నీ బోగస్ సర్వేలని తెలిసిపోతున్నదని అన్నారు.

ఆప్ అభ్యర్థులను చీల్చేందుకు బిజెపి మైండ్‌గేమ్ ఆడుతోందన్నారు.అయితే ఏ ఒక్కరు కూడా అటువైపు వెళ్లబోరని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ సీఎం అభ్యర్థి కల్కాజీనుంచి పోటీ చేసిన అతిశీ మాట్లాడుతూ వారికి మెజార్టీ సీట్లు వస్తేమా అభ్యర్థులకు ఎందుకు ఆఫర్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూడా బిజెపికే విజయం అని చెపుతూ ఆప్ అభ్యర్థులను నిస్తేజపరిచే కుట్రలుచేసారని ఇదంతా బిజెపి కుట్రల్లో భాగమేనని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈఆరోపణపై సమగ్ర విచారణ జరగాలని భావిస్తున్నారు, ఎసిబి ఈ ఆరోపణల్లో నిజమెంతుందో వెలికితీయాలని ఎల్జీవికె సక్సేనా కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

70 సీట్ల అసెంబ్లీ ఎన్నికలకుగాను ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీన జరుగుతుంది. అదేరోజు ఫలితాలు కూడా వెల్లడి అవుతాయి.

# దేశాన్ని అస్థిరపరిచేందుకు విచ్ఛిన్నకర శక్తుల కుట్రలు

### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దేశంలో కొన్ని విచ్ఛిన్నకరశక్తులు భారత్‌ను అస్థిరపరిచే కుట్రలుచేస్తున్నాయని దేశప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ హెచ్చరించారు. వాతావరణ మార్పులకంటే ఈ శక్తులనుంచి మరింత తీవ్రస్థాయి ముప్పు ఎదురవుతుందని కొందరు వ్యక్తులు ఈ తరహా వ్యవహారశైలితో కొనసాగుతున్నారన్నారు. మరికొందరయితే ఏకంగా ప్రజల్లోనే చీలికలు తెచ్చి వేర్పాటు వాద సిద్ధాంతాలను చొప్పిస్తున్నారని, కులం, మతం, ప్రాంతం ఆధారంగా విచ్ఛిన్నకర శక్తులు కీలకపాత్రలు పోషిస్తున్నారన్నారు. ప్రాంతీయతత్వం, జాతీయ వాదంలు రెండూ సమాంతరంగా వెళుతున్నాయని తరిచితరిచి చూస్తే జాతి వ్యతిరేకశక్తుల కుట్రలే ఇవన్నీ అని తెలుస్తుందన్నారు. కర్ణాటక సాహిత్య సంస్కృతిక వైభవ వేడుకల సభలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఈ జాతివ్యతిరేకశక్తులు విభిన్న మార్గాల్లో ఎదురవుతుంటారని, కొత్తకొత్త మార్గాలతో, అనేక అంశాలను చీలిక వాదానికి మూలంగా ఎంపికచేసుకుని ప్రజల్లోకి చొప్పిస్తారని హెచ్చరించారు. దేశం సాంస్కృతిక వారసత్వ సంపదను మనమే పరిరక్షించుకోవాలని ఉపరాష్ట్రపతి అన్నారు. భారత దేశ అభివృద్ధి ఇపుడు ప్రపంచ దేశాలకు సైతం కనిపిస్తోందని, దేశ ప్రజలు ఈ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న దశలో విచ్ఛిన్నకర శక్తులు, వేర్పాటువాద శక్తులను గుర్తించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. భారత ఆర్థిక ప్రగతిపై మాట్లాడుతూ ప్రపంచ ఆర్థికసంస్థలు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఇతర సంస్థలన్నీ కూడా భారత్ ను పెట్టుబడులకు సానుకూల గమ్యస్థానంగా చూస్తున్నాయని అన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు ఇపుడు భారత్ హబ్‌గా నిలవడం మన కెంతో గర్వకారణమని అన్నారు.


# అమెరికా తుదిజాబితాలో 487 మంది భారతీయులు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అక్రమ వలసదారులను తరలింపు ప్రక్రియను ముమ్మరంచేసిన అమెరికా 104 మంది భారతీయులను వెనక్కి పంపించిన తర్వాత అమెరికా బహిష్కరించిన తుది జాబితాలో మరో 487 మంది భారతీయులు ఉన్నారని విదేశాంగశాఖ ప్రకటించింది. అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసిందని వెల్లడించింది. వలసదారులకు సంకెళ్లు వేసి తరలిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ వీటికి సంబందించి అమెరికా వద్ద ఆందోళన తెలియజేసామని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. అక్రమంగా అమెరికా వెళ్లినట్లు గుర్తించిన భారతీయులను సురక్షితంగా తీసుకువస్తామన్నారు. సైనిక విమానాల్లో తరలిస్తోన్న ప్రక్రియపై మిస్రీ స్పందిస్తూ తాజా బహిష్కరణ ప్రక్రియ మునుపటి విమానాలతో పోలిస్తే భిన్నంగా ఉందన్నారు. అయినప్పటికీ జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అమెరికా ప్రభుత్వ విధానంలోనే పేర్కొన్నట్లు విదేశాంగ కార్యదర్శి స్పష్టంచేసారు. అక్రమ వలసదారులను తిరిగి స్వదేశాలకు పంపించే ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత్ ఇప్పటికే ప్రకటించింది. గడచిన 15 ఏళ్లలో 15,756 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు విదేశాంగమంత్రి జైశంకర్ తెలిపారు. 2009లో ఈ సంఖ్య 734గా ఉండగా 2019లో గరిష్టంగా 2042 మందిని తిరిగిపంపించిందన్నారు. 2025లో భారత్‌కు ఇప్పటివరకూ 104 మందిని పంపించిందని విదేశాంగమంత్రి తెలిపారు.

# యుఎస్ ఎయిడ్‌లో 9700 మందికి ట్రంప్ ఉద్వాసన

**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నిర్ణయాలుప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయినా అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అనే యుఎస ఎయిడ్‌లో ఏకంగా 9700 మందికిపైగా ఉద్యోగాలను తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ఆలోచనచేస్తోంది. ఈసంస్థకు ప్రపంచ వ్యాప్తంగా పదివేలమందికిపైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్‌ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా, బ్యూరో ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట. మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అయితే దీనిపై అమెరికా విదేశాంగశాఖనుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అటు డోజ్ విభాగ సారథి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ యుఎస్ఎయిడ్ నేరగాళ్లసంస్థ అని ఆరోపించారు. ఈక్రమంలోనే ఇటీవల ఈ సంస్థలో వందలాదిమంది ఉద్యోగులను సెలవుపై పంపించారు. సుమారు 120 దేశాలకు మానవతా ధృక్పథంతో సాయంచేయడానికి ఆదేశాల అభివృద్ధికి, భద్రతకు నిధులు సమకూర్చడానికి యుఎస్ ఎయిడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ వందలకోట్ల డాలర్లను సాయంగా అందిస్తోంది. అలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాజాగా ఆయన సంతకంచేసారు. అమెరికా దాని మిత్ర



దేశం ఇజ్రాయెల్ లక్ష్యంగా నిరాధార దర్యాప్తులు చేపడుతోందని ఈసందర్భంగా అధ్యక్షుడు దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అరెస్టువారంట్‌జారీచేసి అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టు తన అధికారాలను దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. ఆంక్షల నేపథ్యంలో ఐసిసి అధికారులు అమెరికాలో ప్రవేశించకుండా వారిపై నిషేధాజ్ఞలు అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు.

# 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లపై ఇన్ఫోసిస్ వేటు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సుమారు 700మంది కొత్త ఉద్యోగులను మైసూరు క్యాంపస్‌నుంచి ఇంటికి పంపింది. ఐటి ఉద్యోగుల సంఘం నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్) శుక్రవారం ఈప్రకటనచేసింది. జాయిన్ అయిన కొద్దినెలలకే వీరందరినీ తొలగించిందని నైట్స్ వెల్లడించింది. ఇది అత్యంత అనైతికమని ఇన్ఫోసిస్ నిర్బంధంగా ఉద్యోగులను పంపించివేయడం ప్రారంభించిందని అందులో భాగంగానే 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లను తొలగించిందని నైట్స్ అధ్యక్షుడు హార్‌ప్రీత్‌సింగ్ సలూజా ఆరోపించారు. ఈ ఉద్యోగుల తొలగింపుప్రక్రియలో కంపెనీ బౌనర్లు, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించిందని చెపుతూ ఉద్యోగులను మొబైల్‌ఫోన్లు కూడా లోపలికి అనుమతించలేదని, ఎందుకంటే ఎవరైనా వీడియో చిత్రిస్తారన్న అనుమానంతోనే ఎవ్వరి మొబైల్ ఫోన్లను అనుమతించలేదన్నారు. ఇలా ఏకపక్షంగా ఆకస్మికంగా తొలగించడం ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని సలూజా ఆరోపించారు. అయితే ఇన్ఫోసిస్ మాత్రం తమ చర్యను సమర్థించుకుంది. క్యాంపస్ రిక్రూట్ అయిన ఉద్యోగులు కంపెనీలో నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో విఫలం అయ్యారని అందువల్లనే వారిని పంపించివేస్తున్నట్లు తెలిపింది. కొత్త ఉద్యోగులు అందరికీ మూడుసార్లు అసెస్‌మెంట్ క్లియర్‌చేసే అవకావం ఇచ్చామని, విఫలం అయితే వారు కంపెనీలో కొనసాగేందుకు అర్హులు కాదని ముందే స్పష్టం చేసామన్నారు. వారి కాంట్రాక్టులో కూడా స్పష్టంగా తెలిపామని కంపెని ప్రకటించింది. రెండుదశాబ్దాలుగా ఇదే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తీర్ణులైన వారిని కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే నైట్స్ మాత్రం కేంద్ర కార్మిక ఉపాధికల్పనశాఖకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించింది. ఇలా ఎంతమాత్రం కొనసాగనీయ కూడదని ఐటి వర్కర్ల హుందాతనం, హక్కులను పరిరక్షిస్తామని సలూజా వెల్లడించారు.

# మహాకుంభ్‌కు 40 కోట్లమంది భక్తులు

### కుంభమేళాప్రాంతంలో మళ్లీ అగ్నిప్రమాదం





**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 7:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు వెలువలా వస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలకు ప్రతినిత్యం లక్షల్లోనే భక్తులు వస్తున్నారు. కుంభమేళా ప్రారంభం అయినప్పటి నుంచి నేటివరకూ 40 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు చేసారని యుపి ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం నాటికి 39.74 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీ మహాకుంభమేళా ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ శివరాత్రి వరకూ ఈకుంభమేళా కొనసాగనున్నది. సుమారు 45రోజులపాటు జరిగే ఈ మహాకుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 50 కోట్లమంది భక్తులు వస్తారని యుపి ప్రభుత్వం అంచనావేస్తోంది. అందుకు తగిన ఏర్పాట్లుకూడా చేసింది. ఇదిలా ఉండగా మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. శకంరాచార్య మార్గ్‌లోని సెక్టార్ 18లో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. అక్కట ఏర్పాటు చేసిన టెంట్లు మంటల్లో కాలిపోతున్నాయి. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగ ఆశ్రమిస్తున్నారు. అదృష్టవ శాత్తూ ఈప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరిపీల్చు కుంటున్నారు.




# లిఖిత పూర్వకంగానే జవాబిస్తాం

### కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

**ముంబయి, ఫిబ్రవరి 7:** మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలను, సూచనలను తాము గౌరవిస్తున్నామని త్వరలోనే లిఖితపూర్వకంగా స్పందిస్తామని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్లకు సంబంధించి పూర్తి వాస్తవాలు విధానపరమైన అంశాలతోనే కమిషన్ సమాధానం ఇస్తుందని వివరించింది. కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రతిపక్షాలకు చెందినపార్టీలు ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుని ఓటర్ల సంఖ్యపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాలకు చెందిన ఎందరో ప్రజల ఓట్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగించారని, కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నా అక్కడి ఓటర్లను మరో కేంద్రానికి మార్చారని ఆరోపించారు. ఈక్రమంలో మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తమకు ఇవ్వాలని ఈసీని కోరామని, దీనిద్వారా కొత్తగాచేరిన ఓటర్లు ఎవరనేది కచ్చితంగా తెలుస్తుందని తెలిపారు. అలాగే ఎంతమంది ఓటర్లను తొలగించారో ఒక బూత్‌నుంచి మరొక బూత్‌కు ఎందుకు బదిలీచేసారో కూడా తెలుస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ విషయమై ఈసీనుచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా లేదు కనకనే ఓటర్ల జాబితాను తమకు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం ఆసక్తిచూపించడంలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ తాము లిఖిత పూర్వకంగానే సమాధానం ఇస్తామని ఇందులో వాస్తవాలను దాచే ప్రసక్తేలేదన్నారు.

# సిద్దరామయ్యకు భారీ ఊరట

**బెంగళూరు, ఫిబ్రవరి 7:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఊరట నిచ్చాయి. కర్ణాటకలో ముడా కుంభకోణం కలకలం సృష్టించిన క్రమంలో లోకాయుక్తపోలీసుల దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదలీ చే యాలని వేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసును దర్యాప్తు సంస్థకు అప్పగించాలనే అభ్యర్థనను నిరాకరించింది. ముడా స్కామ్ కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపుతోంది.



ముడా స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబసభ్యులు లబ్దిపొందడం అందుకు ముఖ్యమంత్రి అదికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టిజె అబ్రహాం గవర్నర్‌కు ఫిర్యాదుచేసారు. ఆయనతోపాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్‌లు ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేసారు. దీనితో ప్రథమ నిందితుడిగా సిద్దరామయ్యపై కేసు నమోదయింది సిద్దరామయ్య సతీమణి పార్వతి, బావమరిది మల్లిఖార్జున్‌స్వామితో పాటు మరో వ్యక్తిపేరు ఈ నిందితుల జాబితాలో చేర్చారు. ఈ విషయంపై సిద్దరామయ్య మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయలేదని తప్పుచేసి ఉంటే ఇంతకాలం రాజకీయాల్లో ఉండటం అసాధ్యమన్నారు. భగవంతుడి ఆశీస్సులు ఉన్నంత వరకూ తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన సతీమణి తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేసారు. ఈ వ్యవహారంలో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసినా ఆయనకు న్యాయం జరగలేదు. దీనితో ఆయన సుప్రీంకోర్టుకు అప్పీలు చేసారు.



# 25 బేసిస్‌పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

### రెపోరేట్లు తగ్గితేనే వ్యవస్థలోకి మరింత నగదు

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, ఫిబ్రవరి 7:** భారతీయ రిజర్వుబ్యాంకు రెపోరేట్లను ఈ ఏడాది తొలిసారి సవరించింది. మానిటరీ పాలసీ కమిటీ సమీక్షల్లో ఏకగ్రీవడం 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని నిర్ణయించారు. 6.5నుంచి 6.25శాతానికి కుదించినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారి నిర్వహించిన సమీక్ష అనంతరం రెపోరేట్ల వివరాలను ప్రకటించారు. ఆర్‌బిఐ సభ్యులతోపాటు ముగ్గురు బయటిప్రముఖులు, ఏకగ్రావంగా రెపోరేట్లను తగ్గించాలని అభిప్రాయం వ్యక్తం చేసారన్నారు. 2020 మే సమీక్ష కాలంనుంచి ఇప్పటివరకూ 11 సమీక్ష సమావేశాలు జరిగినా రెపోరేట్ల జోలికి వెళ్లలేదు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమనం ఆర్థికవనరుల వ్యవస్థలపై ప్రభావం చూపిస్తున్నదని అందువల్లనే వృద్ధి కూడా చరిత్రాత్మక సగటునుంచి తగ్గుతున్నదన్నారు. అయితే క్రమేపీ ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఊపందుకుంటున్నదని మరింత పటిష్టపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. వడీరేట్ల కుదింపులో అమెరికా బాండ్ల రాబడులు కూడా ఒక్కసారిగాపెరిగాయి. అలాగే డాలర్‌కరెన్సీ కూడా పెరిగింది. జిడిపి వృద్ధిరేటు ఆర్థిక సంవ త్సరంలో 6.4శాతంగా ఉంటుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వృద్ధి 6.7శాతంగాఉంటుందని, మొదటి త్రైమాసికంలో ఏడుశాతం, రెండోత్రైమాసికంలో 6.5శాతం, నాలుగోత్రై మాసికంలో 6.5శాతం గా ఉంటుందని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 48 శాతంగా ఉంటుందని గత త్రైమాసికంలో 4.4శాతంగా ఉందని మల్హోత్రా వెల్లడించారు. బ్యాంకులవద్ద నగదు లభ్యత పటిష్టంగానే ఉందని వ్యవస్థలోకి మరింత నగదును చొప్పించేందుకు అవసరమైన చర్యలు కూడా అమలవుతాయన్నారు. స్థిరాస్తులపై రాబడులు, ఈక్విటీలుకూడా బ్యాంకులకు మంచి ఫలితాలిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే డిజిటల్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.అన్నిరంగాలకు సంబంధించిన వారు కూడా కఠిన చర్యలకు ఉపక్రమించాలని బ్యాంకులు కూడా వీటిని కట్టడిచేసే కార్యాచరణ మరింతవేగంగా అమలుచేయాలని సూచించారు.

# రెపోరేట్ల ప్రభావంలేని సెన్సెక్స్ నిఫ్టీ

### కీలక కంపెనీల షేర్లన్నీ దిగువన ట్రేడింగ్



**ముంబయి, ఫిబ్రవరి 7:**రెపోరేట్లను తగ్గిస్తూ ఆర్బీఐ ప్రకటించిన ఎంపిసి సమీక్ష నిర్ణయాలు ట్రేడర్లను సంతృప్తిపరచలేదు. నిఫ్టీ, సెన్సెక్స్ రెండూ కూడా దిగువప్రాంతంలోనే ట్రేడింగ్‌ముగించాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో విదేశీ నిధులు అధికశాతం విత్‌డ్రా అయ్యాయి. వరుసగా మూడోరోజు కూడా ఈక్విటీలు తగ్గుముఖం పట్టాయి. 30షేర్ బిఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 197.97 పాయింట్లు క్షీణించి 77,860.19పాయింట్ల వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ఆసాంతం అనిశ్చితంగానే కొనసాగింది. ఈ రోజు ట్రేడింగ్‌లోసుమారు 0.74శాతం క్షీణించి 77,475.4పాయింట్లకు సైతం ఒకదశలోచేరింది. ఇక ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 43.40 పాయింట్లు క్షీణించి 23,559.95 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఐటిసి తన త్రైమాసిక ఫలితాల్లో తగ్గుదల నమోదుచేయడంతో రెండుశాతం షేర్లు క్షీణించాయి. నికరలాభం 5013.16క ఓట్లుగా కంపెనీ ప్రకటించింది. ఎస్‌బిఐ, ఆదాని పోర్ట్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసిఐసిఐబ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్‌గ్రిడ్‌లు కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. ఆర్‌బిఐ వడ్డీరేట్లకుదింపు మార్కెట్లకు ఎలాంటి ఊతం ఇవ్వలేదు. ఆర్‌బిఐ గవర్నర్ వ్యాఖ్యల్లో ఎలాంటి కొత్త అంశం లేదని భావించారు. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసిజి, ఇంధనరంగ స్టాక్‌లన్నీ కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. వీటికితోడు ఒక్కొక్కటిగా వస్తున్న ఆర్థిక ఫలితాలు కూడా మరి కొంత ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మెమతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు. టాటాస్టీల్‌మాత్రం 4శాతం పెరిగింది. భారతి ఎయిర్‌టెల్ స్టాక్ నాలుగుశాతంపెరిగింది. ఐదురెట్లు నికరలాభం పెరిగి 16,134.6 కోట్లకుచేరింది. ఇండస్ టవర్స్ బిజినెస్ జోరందుకోవడం, ట్యారిఫ్ పెంపు వంటివికూడా కొంత షేర్లకు ఊతం ఇచ్చాయి. జొమాటో, వమీంద్ర, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్‌మహీంద్రాలు కూడా లాభాల్లోనే ముగిసాయి. వడ్డీరేట్ల ఆధారిత రంగాలయిన ఆటోమొబైల్ స్టాక్స్ కూడా లాభనష్టాలులేని దశలోముగిసాయి. ఆర్‌బిఐ రేట్లవల్ల ఆటో, హోం లోన్లు కొంతమేర వడ్డీరేట్లు తగ్గవచ్చని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెపుతున్నారు. రెపోరేట్లు ఎక్కువ ఉంటే డిపాజిట్లపై రిటర్నులు పెరుగుతాయి. పొదుపు, ఇన్వెస్ట్‌మెంట్ ఉత్పత్తుల రెపోరేట్లను ఇవి నిర్ణయిస్తాయి. రెపోరేట్లు తగ్గితే వడ్డీ ఆధారిత రంగాల్లో రిటర్నులు కూడా తగ్గుతాయి. ఆసియా మార్కెట్ల పరంగా దక్షిణకొరియా, జపాన్ మార్కెట్లు దిగువన ముగిస్తే షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సానుకూలంగానే ముగిసాయి. ఇక యూరో పియన్ మార్కెట్లు కూడా దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా మార్కెట్లు మాత్రం ముం దురోజు భారీగాపెరిగాయి. బ్రెంట్ ముడిచమురు 0.73శాతంపెరిగి బ్యారెల్‌కు 74.83డాలర్లుగా కొనసాగింది. మార్కెట్లనుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 3549.95 కోట్ల విలువైన షేర్లను విక్రయించి లాభాల స్వీకరణ బాటపట్టారు.



### సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

# ఏడుగురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, ఫిబ్రవరి 7:** భారత్ భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించాలన్న పాక్ ఉగ్రవాదుల కుట్రలను భద్రతా బలగాలు భగ్నంచేసాయి. నియంత్రణరేఖను దాటేందుకు యత్నిస్తుండగా ఏడుగురు చొరబాటుదారులను హతమార్చాయి. మృతుల్లో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బందికూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ముకాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గల కృష్ణఘాటి సెక్టార్‌లో ఈనెల 4,5 తేదీలమధ్యరాత్రివేళ ఈ ఘటన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖను దాటి భారత ఫార్వర్డ్‌పోస్ట్‌పై దాడికి యత్నిస్తున్న పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌పై సైన్యం మెరుపుదాడికి పాల్పడింది. ఈ క్రమంలోజరిగిన కాల్పుల్లో ఏడుగురు చొరబాటుదారులు హతమైనట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో ఇద్దరు ముగ్గురు పాకిస్థానీ ఆర్మీ రోగ్యులర్ సిబ్బందికూడా ఉన్నారు. మిగిలిన వారు ఉగ్రవాదులన అల్ బదర్‌గ్రూప్‌నకు చెందిన వారయి ఉండవచ్చని ఈ వర్గాలుతెలిపాయి. పాక్‌ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతిమంత్రం వల్లెవేసిన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కాశ్మీర్ సహా అన్ని సమస్యలకు భారత్‌తోసంప్రదింపుల ద్వారానే పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆయన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా జైషేమహ్మాద్ లష్కరే తాయిబా వంటి ఉగ్రసంస్థలు తాజాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో సంయుక్త సదస్సు నిర్వహించినట్లు తెలిసింది. దీనికి హమాస్ ప్రనతినిధులు కూడా హాజరైనట్లుప్రచారం జరగడంతో భారత నిఘా వర్గాలు మరింతగా అప్రమత్తం అయ్యాయి.

## సెలవు ఇవ్వలేదని సహోద్యోగులపై దాడి: నలుగురికి కత్తిపోట్లు



**కోల్‌కత్తా, ఫిబ్రవరి 7:** అత్యవసరపనిపై వెళ్లాలని సెలవు కావాలని అడిగిన ప్రభుత్వ ఉద్యోగికి సెలవు ఇవ్వకపోవడంతో సహనం కోల్పోయాడు. ఉన్నతాధికారి కాదనడంతో ఆతడి కోపం కట్టలు తెంచుకుంది. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఉన్నతాధికారితోపాటు సహచర ఉద్యోగులపైనా దాడిచేసాడు. తర్వాత అదే కత్తితో తిరుగతూ కనిపించాడు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో న్యూటౌన్‌ప్రాంతానికిచెందిన కారిగరి భవన్‌లోని సాంకేతిక విద్యావిభాగంలో అమిత్‌కుమార్ సర్కార్ విధుల్లో ఉన్నాడు. ఎప్పటిలాగే ఆఫీస్‌కు వచ్చిన కుమార్ లీవ్ కావాలని ఉన్నతాధికారిని కోరితే ఆయన తిరస్కరించారు. అదే విషయంలో తన సహోద్యోగులతో గొడవకూడా జరిగింది. ఈ గొడవలో అమిత్‌వెంట తెచ్చుకున్నకత్తితో సహచర ఉద్యోగులపై దాడికి దిగాడు. వీపున బ్యాగ్, రక్తంతో తడిసిన కత్తితో వెళుతున్న అమిత్‌ను స్థానికులు విడియోలు తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచినచంది. ఆఫీస్ లో జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్ అదికారి మాట్లాడుతూ నిందితుడు తన సహోద్యోగులతో సెలవు విషయంలో గొడవపడ్డాడని, సెలవు నిరాకరించడానికి గల కారణం, సహోద్యోగులపై కత్తితో ఎందుకు దాడిచేసారో ఆరా తీస్తున్నట్లు తెలిపారు. నిందితుడికి మానసిక ఆరోగ్య సమస్యలున్నాయని అనుమానిస్తున్నామని ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తామన్నారు. అమిత్ కత్తిదాడలో జయదేబ్ చక్రవర్తి, శంతను సాహా, సర్తాలేట్, షేక్ సతాబుల్‌లు గాయపడ్డారని వీరిలో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందన్నారు.

# మొబైల్‌లోనే అన్ని ధృవపత్రాలు, ప్రతి ఒక్కరికి డిజి లాకర్ సదుపాయం

## - ఐటి, ఆర్టీజి శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించిన ధృవీకరణ పత్రాలేవీ భౌతికంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని, తమ మొబైల్ ఫోన్లోనే అన్ని పత్రాలు డిజిటల్ రూపేణా పొందుపరచవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఐటీ మరియు ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. దీనికోసం ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా డిజీ లాకర్ సదుపాయం కల్పించున్నామన్నామని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ గురించి అన్నీ శాఖలు, విభాగాధిపతులతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) శుక్రవారం సచివాలయంలో ఒక సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ ప్రభుత్వంలో ఇప్పటికీ కూడా ఒక సింగిల్ సోర్స్ ఆఫ్ డేటా అనేది లేదన్నారు. ఆయా శాఖల్లో చాలా డేటా ఉన్నప్పటికీ అది ఇప్పటికి కూడా ఒకచోట అనుసంధానం కాలేదని, దానివల్ల పౌరులకు ప్రభుత్వం అందించే సేవలు మరింత సమర్థవంతంగా అందించడానికి సాంకేతిక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగేపని లేకుండా పౌరులకు వారికి కావాల్సిన అన్ని సేవలు వారి చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే అందించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆర్టీజీఎస్ ఒక పెద్ద డేటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఈ డేటా లేక్‌తో అనుసంధానం చేస్తామని, తద్వారా పౌరులకు డిజిటల్ సేవలు మరింత మెరుగ్గా అందించే సదుపాయం కల్పిస్తామన్నారు. పౌరులెవ్వరు కూడా తమకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఏ కార్యాలయానికి, ఏ అధికారి వద్దకు వెళ్లకుండా కేవలం తమ వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారనే ఇట్టే సులభంగా పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవలే వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించిందన్నారు. దీనికోసం మెటా సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు, అన్ని రకాల ధృవీకరణ పత్రాలు ఇందులో పొందే సదుపాయం కల్పింస్తుందన్నారు. ఒక పౌరుడు తనకు సంబంధించిన విద్యార్హత, కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధృవీకరణ పత్రాలన్నీ కూడా వాట్సాప్ ద్వారానే డౌన్ లోడు చేసుకోవచ్చని ఎవరి వద్దకు తిరగాల్సిన పని ఉండబోదన్నారు. అలాగే రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించి సర్టిఫికెట్లను భౌతికంగా తమతో తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోతదని, తమ చేతిలోని మొబైల్ ఫోన్లోనే ఆ సర్టిఫికెట్లను డౌన్ లోడు చేసుకుని పొందుపరచవచ్చున్నారు.



# బైకుల చోరీ ముఠా అరెస్ట్

## - 56 మోటార్ సైకిళ్ల స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** వ్యసనాలు ఒకటి చేశాయి. చెడు వ్యసనాలకు బానిసై నలుగురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముఠాను నెల్లూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ముఠా కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు సీసీఎస్, కొడవలూరు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 56 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఎస్పీ జి. కష్ణకాంత్ నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన పేర్కొన్న సమాచారం మేరకు అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన ఎ.శివ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. 2017లో హత్యాయత్నం కేసులో పోలీసులు అతనిని అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు తన చిన్నమ్మ కుమారుడైన రవిదుర్గతోకలిసి బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కి ఇద్దరూ జైలుపాలయ్యారు. అనంతరం పాతనేరస్థులైన అల్లూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన కె. నాని, హోసన్నలను కలుపుకుని ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని పలు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడసాగారు. ఇటీవల బైక్ దొంగతనాలు అధిక మైన నేపథ్యం లో జిల్లా ఎస్పీ జి. కష్ణకాంత్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు సిహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో ప్రత్యేక బృందంగా ఏర్పడి బైక్ దొంగతనాలు, నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈనెల ఆరోతేదిన వారు కొడవలూరు మండలం పద్మనాభ సత్రం వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతి జిల్లాలో 21, ప్రకాశం జిల్లాలో 8, బాపట్ల, వైఎస్సార్ కడప, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు బైక్‌లు మొత్తంగా రూ. 30లక్షలు విలువచేసే 56 బైక్‌లను దొంగలించినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసుల చేధనలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్, కొడవలూరు సిఐలతో పాటు కొడవలూరు, విడవలూరు, సీసీఎస్ ఎస్ఐలు కోటిరెడ్డి, నరేష్, వెంకటాద్రి నాయుడుతో పాటు వారి సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదుప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు, డిఎస్పీలు పి. సింధుప్రియ, శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు సీతారామయ్య, అశోక్ కుమార్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# విజయవాడ రైల్వే డివిజన్‌లో ట్రాక్‌ల ఆధునీకరణ..

## 130 కి.మీ వేగంతో ప్రయాణం

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ట్రాక్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంలో విజయవాడ రైల్వే స్టేషన్ పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 1287.76 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేసే పనులను ముమ్మరం చేసింది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్ళు ప్రయాణించేలా డివిజన్ పరిధి లోని 58 శాతం ట్రాక్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. నిడదవోలు- భీమవరం, రసాపూర్-గుడివాడ-మచిలీపట్నం, కాకినాడ పోర్టు-సామర్ల కోట మార్గంలో 473.4 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు సీనియర్ డివిజనల్ ఇంజనీర్ వరుణ్‌బాబు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 129 కి.మీల మీర స్లీపర్ రెన్యువల్,164 కి.మీల మేర రైల్ రెన్యువల్ సాధించినట్లు వరుణ్‌బాబు తెలిపారు. పీక్యూఆర్ఎస్,టీఆర్‌టీ మెషీన్లను ఉపయోగించి త్వరితగతిన ఆధునీకరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కీలకంగా పనిచేసిన సిబ్బందిని ఈ సందర్భంగా విజయవాడ డిఆర్ఎం నరేంద్రపాటిల్ అభినందించారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్యామలా నవరాత్రుల పూర్ణాహుతి

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయంలో మాఘమాసం శుద్ధ పాడ్యమి నుండి నిర వ్రహిస్తున్న శ్యామలా నవరాత్రులకు సంబంధించిన పూర్ణాహుతిని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ పూర్ణాహుతి, పూజాదికాలు నిర్వహించారు.

- దుర్గమ్మవారి సేవలో మంత్రి జనార్ధనరెడ్డి :

దుర్గమ్మవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



మంత్రి బిసి జనార్ధనరెడ్డి దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటి ఇఓ ఎం

**- మాఘమాసంలో లోకకళ్యాణార్ధం సూర్యోపాసన సేవ:** దుర్గమ్మ ఆలయంలో లోకకళ్యాణార్ధం మాఘమాసం సందర్భంగా వేదోక్తంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో పాల్గొనాలని ఇఓ తెలిపారు. ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ధ ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్దశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానపథకానికి రు.1లక్ష విరాళాన్ని విజయవాడచు చెందిన గోలీ శ్రీనివాసరావు దంపతులు విరాళంగా అందించారు. వారికి దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన తదుపరి దుర్గమ్మవారి మెమంటో, ప్రసాదం, శేషవస్త్రంలను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారం

## మంత్రిని కలిసిన నూతన ఎయిమ్స్ డైరెక్టర్

**సచివాలయం. ఫిబ్రవరి 7. ప్రభాతవార్త.** ప్రతిష్టాత్మక మంగళగిరి ఎయిమ్స్‌ను దేశంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలందిస్తుందని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్‌కు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ హామి ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భౌగోళికంగా మంగళగిరిలోని సుందరమైన, ఆహ్లాదభరితమైన కొండల నడుమ ఎయిమ్స్‌ను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. 2018లో ప్రారంభమైన దీనికి గత ప్రభుత్వ హయంలో మంచి నీటి సౌకరాన్ని కూడా కల్పించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరించిందన్నారు. అలాగే ప్రత్యామ్నాయా విద్యుత్ సరఫరాను కూడా కల్పించిందన్నారు. 183 ఎకరాల్లో ఏర్పాటైన ఎయిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలం లేనందున, కొలనుకొండలో 10 ఎకరాల స్థలాన్ని మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబు ఇటీవలే ఆదేశాలిచ్చారన్నారు. త్వరితగతిన ట్రామాకేర్ సెంటర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 965 పడకల ఆసుపత్రిగా మంజూరైన ఎయిమ్స్‌లో ప్రస్తుతం 650 పడకలున్నాయని,

విస్తరణకు తగు చర్యలు తీసుకోవాలని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్‌కు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి భవిష్యత్‌లో అన్ని విధాల సహకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# మరో వివాదంలో చిక్కుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో వివాదంలో చిక్కుకున్నారు. కొలికపూడి వేధింపులు తాళలేక డేవిడ్ అనే టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. పార్టీ కోసం కష్టపడిన తనని అక్రమ కేసులతో ఎమ్మెల్యే వేధిస్తున్నారంటూ బాధితుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తనను ఏ విధంగా ఎమ్మెల్యే వేధింపులకు గురి చేస్తున్నారో చెబుతూ వీడియో రికార్డు చేసిన అనంతరం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు డేవిడ్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన విజయవాడకు తరలించారు. అయితే బాధితుడి సెల్ఫీ వీడియో బయటకు రాకుండా కొలికపూడి గురువారం రోజున అందరినీ బెదిరించాడంటూ పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఇప్పటికే వరస వివాదాలతో అధిష్ఠానానికి కంటిలో నలుసుగా కొలికపూడి తీరు మారింది. కాగా, గతంలోనూ పలు వివాదాల్లో చిక్కుకున్న ఎమ్మెల్యే కొలికపూడిపై టీటీపీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. టీటీడీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయినా ఎమ్మెల్యే తీరులో మాత్రం మార్పు రాలేదు. గతేదాడి ఓ ప్రైవేటు కార్యక్రమం నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామానికి వెళ్లారు. ఇద్దరి అన్నదమ్ముల స్థల వివాదంలో తలదూర్చిన ఆయన.. భూక్యా కృష్ణ, చంటి దంపతులపై దాడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను హుటాహుటిన విజయవాడకు తరలించారు. అలాగే తన సొంత నిధులతో కాలువలు తవ్వించానని, కుక్కలకు ఉన్న విశ్వాసం రైతులకు లేకుండా పోయిందంటూ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవి కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# మేనకోడలు, మేనలుడి ఆస్తులు కాజేయాలని జగన్ కుట్ర!

## పిసిసి అధ్యక్షురాలు షర్మిల సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ని కలిసి అనేక అంశాలు చర్చించినట్లు ఆమె తెలిపారు. తనపై అన్న జగన్ చేసిన కుట్రలు సాయిరెడ్డి చెప్తుంటే విని కన్నీళ్లు పెట్టుకున్నట్లు షర్మిల వెల్లడించారు. జగన్ తనపై చేసిన అరాచకాలు, తన క్యారెక్టర్‌ను కించపరిచేలా చేయించిన వ్యాఖ్యలు తెలుసుకుని నిర్ఘాంతపోయినట్లు చెప్పుకొచ్చారు. చట్టప్రకారం తనకు రావాల్సిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తులను జగన్ ఎలా దోచేయాలని చూశారో తెలిసి తీవ్ర మనోవేదనకు గురైనట్లు షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీసీసీ చీఫ్ షర్మిల మాట్లాడుతూ.. "విజయసాయిరెడ్డిని కలిసి చాలా అంశాలు మాట్లాడాం. జగన్ మోహన్ రెడ్డి వల్ల పడిన ఇబ్బందుల గురించి ఆయన చెప్పారు. సాయిరెడ్డి అనేక విషయాలు చెప్పినప్పటికీ నేను కేవలం నా బిడ్డలకు సంబంధించిన విషయాలు మాత్రమే చెబుతున్నా. వైఎస్ ఆస్తులకు సంబంధించి షేర్స్ తనకే చెందాలంటూ జగన్.. నాపై, తల్లి విజయలక్ష్మిపై కేసు వేశారు. అందుకే ఆస్తుల గురించి వైఎస్ ఆనాడు అన్న మాటలు గతంలో మీడియాకు చెప్పా. అప్పుడు విజయసాయిరెడ్డితో జగనే ప్రెస్ మీట్ పెట్టించి నా మాటలు అబద్ధాలని చెప్పించారు. ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి మాటలు అబద్ధమని మా అమ్మ విజయలక్ష్మి లేఖ రాసి మరీ చెప్పారు. ఆ తర్వాత కూడా విజయసాయిరెడ్డిపై జగన్ ఒత్తిడి తెచ్చారంట. ఆయన అంగీకరించకుంటే సుబ్బారెడ్డితో మాట్లాడించారు. అనంతరం జగన్ మళ్లీ విజయసాయిరెడ్డిని పిలిపించారు. 40 నిమిషాలపాటు జగనే స్వయంగా విజయసాయిరెడ్డికి డిక్టేట్ చేశారంట. ఎలా చెప్పాలి, నాపై ఏం మాట్లాడలో ఆయనే మొత్తం వివరించారంట. ఆ తర్వాత సాయిరెడ్డి ప్రెస్ మీట్ పెట్టకపోవడంతో జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారంట. వైఎస్ కోరికకు భిన్నంగా అబద్ధం చెప్పాలని విజయసాయిరెడ్డిపై ఒత్తిడి చేశారు. నా పరువు పోతుందని.. వదిలేయండని సాయిరెడ్డి చెప్పినా జగన్ ఊరుకోలేదట. ఏ అబద్ధాలు ఎలా చెప్పాలో జగన్ చెబితే విజయసాయి రెడ్డి రాసుకున్నారంట. ఈ విషయాలను విజయసాయి రెడ్డే నాకు స్వయంగా చెప్పారు. ఇవన్నీ పల్లు పోకుండా సాయిరెడ్డి చెప్పిన మాటలే. ఈ విషయాలు విని నా కళ్ల వెంట నీళ్లు వచ్చాయి. ఇదీ జగన్ మోహన్ రెడ్డి మహోన్నతమైన క్యారెక్టర్. వైఎస్ బిడ్డ, తోడబుట్టిన చెల్లి అని కూడా చూడకుండా జగన్ దిగజారిపోయి వ్యవహరించారు. నా క్యారెక్టర్‌పై ఇంత నీచంగా మాట్లాడించారు. ఇటీవల ఆయన క్యారెక్టర్ గురించి పెద్దపెద్ద డైలాగులు చెబుతున్నారు. అసలు క్యారెక్టర్ అంటే ఏంటో జగన్ మరచిపోయారు. సొంత మేనకోడలు, మేనల్లుడు ఆస్తులు కాజేయాలని ఇంత కుట్రలు చేశారు. జగన్, అతని భార్య బైబిల్ ముందు కూర్చుని ఎంత దిగజారిపోయారో ఆలోచన చేయాలి. నా పిల్లలకు మీ ముఖం చూపించే ధైర్యం ఉందా?" అంటూ షర్మిల ప్రశ్నించారు.

# వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి విచారణకు హాజరు!

## కేసు పై దృష్టి పెట్టిన కూటమి పెద్దలు

పులివెందుల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :

మాజీమంత్రి వై.ఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ గా వున్న షేక్ దస్తగిరి కడప సెంట్రల్ జైలులో శుక్రవారం విచారణకు హాజరయ్యారు.

కడప సెంట్రల్ జైలులో షేక్ దస్తగిరిని ఏడాది క్రిందట పెట్టిన ప్రలోభాలు, ఇబ్బందులు, బెదిరింపులు ఘటన పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో విచారణ కడపలో ప్రారంభం అయింది. షేక్ దస్తగిరి ఓ అట్రాసిటీ కేసులో 2023 అక్టోబరు నుండి 2024 ఫిబ్రవరి వరకు కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న సందర్భంలో వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ 5 గా వున్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి(ఏ1) అప్పటి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ (ఏ 2), జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు(ఏ 3), ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్య(ఏ 4)లు తనను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో వై.సి.పి ప్రభుత్వం అధికారంలో వుండడంతో అప్పటి అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేసు విచారణ వేగవంతం చేశారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు ఈనెల 3వతేదీ ఆ నలుగురి పై పులివెందుల పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. దస్తగిరి తన ఫిర్యాదులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న తనను 2023 నవంబరు 28న జైల్ లోని ఎస్ ఎస్.ఆర్ బ్యారక్ లోకి డాక్టర్ చైతన్యరెడ్డి వచ్చి తాను వివేకా హత్య కేసులో అప్రూవర్ గా మారినందున వివేకాహత్య కేసులో వై.ఎస్ అవినాష్ రెడ్డి, వై.ఎస్ భాస్కర్ రెడ్డి, డి శివశంకర్ రెడ్డిలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించారని, అప్పటి సిబిఐ అధికారి రామ్ సింగ్ కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెట్టారని, తమకు అనుకూలంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని అప్పట్లో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వేళ మేము చెప్పినట్లు వినకపోతే జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత నిన్ను చంపుతామని బెదిరించారని దస్తగిరి పోలీసులకు ఫిర్యాదులో తెలిపారు. చైతన్యరెడ్డి తనను బెదిరించే సమయంలో అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ వారించలేదని ఫిర్యాదు చేశారు. జైలు సూపరిం టెండెంట్ వారం రోజుల పాటు చీకటి గదిలో బంధించారని ఫిర్యాదు చేశారు. అలాగే తనను అప్పటి జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్యలు బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఈ సంఘటనకు సంబంధించి విచారణ అధికారిగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహూల్ శ్రీరామ్ ను విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం కడప సెంట్రల్ జైలుకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం కడప సెంట్రల్ జైలులో రాహూల్ శ్రీరామ్ షేక్ దస్తగిరిని 3 గంటల పాటు విచారించారు. రాహూల్ శ్రీరామ్ ఎవరెవరు నీకు బెదిరించారు, ఏమి ఇబ్బందులకు గురి చేశారు, ఏ ఏ అధికారి నిన్ను ఇబ్బందులకు గురి చేశారో అనే కోణంలో దస్తగిరిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. అలాగే ఆ సమయంలో పని చేసిన సిబ్బందిని కూడ విచారించినట్లుతెలిసింది. షేక్ దస్తగిరి 2023 నవంబరు 28న ఎస్.ఎస్.ఆర్ బ్యారక్ లో జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలను విచారణ అధికారికి వివరించినట్లు తెలిసింది. తనను అన్యాయంగా అధికారులు కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టిన వైనాన్ని ఆయన వివరించినట్లు తెలియ వచ్చింది. విచారణ అనంతరం దస్తగిరి సెంట్రల్ జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన నలుగురి పై నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని విచారణ అధికారి ఆదేశించడంతో విచారణకు వచ్చాను అన్నారు.

# నేతకానీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాల్సిందే

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులాల జనాభాను తప్పుల తడకగా భావిస్తూ నేతకాని సమాజాన్ని తక్కువ జనాభాగా చూపించడం జరిగిందని నేతకాని కులస్తులు నిరసన తెలియజేస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు నేతకాని కులసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రకటనపైన 'నేతకానిల నిరసన గలం' పేరుతో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేతలు హాజరై మాట్లాడారు. ఎస్సీ కులాలలో అధిక జనాభా కలిగిన మూడవ పెద్ద కులం నేతకానిలకు కులగణనలో తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. వాస్తవలెక్కలను దాచిపెట్టి అశాస్త్రీయంగా తక్కువ సంఖ్యను ప్రపంచానికి తెలియజేస్తూ న్యాయబద్ధంగా పట్టభద్రంగా రావలసిన వాటాను అందించకుండా కుట్రలు చేశారన్నారు. మాల ద్వారానే ప్రభుత్వం మాపట్ల అణచివేత ధోరణి ప్రదర్శించి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ నేతకానిలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని వారి న్యాయమైన పోరాటానికి తప్పక ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నని భవిష్యత్తులో వాస్తవ జనాభాను తెలియజేసి వారి వాటాను వారు కేటాయించాల్సిందేనని ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత మాట్లాడుతూ ఈ రిజర్వేషన్ వర్గీకరణ ద్వారా భవిష్యత్తు అంధకారమైపోయిందన్నారు.

# తీన్మార్ మల్లన్నపై కామారెడ్డిలో కేసు నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మరో కేసు నమోదయింది. మల్లన్న తమ కులాన్ని దూషించడంతోపాటు కించపరుస్తున్నారని తెలంగాణ ఆరోపిస్తూ కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. రెడ్డి సంఘం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు ఈ కేసును నమోదు చేశారు.

# బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**వికారాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిటెక్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన క్షీరసాగర్ సత్యనారాయణ పిల్లల చదువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నాడు. సత్యనారాయణ కూతురు జ్యోతి హైదరాబాద్ నగరంలో ఓ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఇదిలా ఉండగా, సత్యనారాయణ దగ్గరి బంధువులకు సంబంధించి పెళ్ళి ఉండటంతో కుటుంబ సభ్యులందరు వారి స్వగ్రామమైన ముజాహిద్‌పూర్‌కి ఈ నెల 5న వెళ్ళారు. కూతురు జ్యోతి తనకు పరీక్షలు ఉన్నాయని, చదువుకోవాలని చెప్పి 6వ తేదీన వికారాబాద్‌కు తిరిగి వచ్చింది. బంధువుల పెళ్ళికి కావాల్సిన బట్టలు వికారాబాద్‌లోని అద్దె రూమ్‌లో ఉండటంతో సత్యనారాయణ కుటుంబంతో సహా తిరిగి వికారాబాద్‌కు శుక్రవారం ఉదయం వచ్చారు. ఎంతసేపు కూతురు జ్యోతి ని పిలువగా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి తెరిచి చూశారు. కూతురు జ్యోతి(19) ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమకుమార్ తెలిపారు.

### ఉరివేసుకుని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య


**హైదరాబాద్ (ఉప్పల్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఉరివేసుకుని పదో తరగతి చదవుతున్న ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివసించే నీలం విజయ్‌కుమార్, పావనిలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నీలం పవిత్ర (15) రామంతాపూర్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. అయితే శుక్రవారం ఉదయం పదిన్నర సమయంలో తల్లి పావని తన కుమార్తె పవిత్రను స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వెళ్లి మెటిమలు వస్తున్నాయని ఆసుపత్రి తీసుకెళ్లి చూయించింది. అనంతరం తిరిగి 12.30 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద వదిలి బ్యాంక్ పని మీద బయటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో ఫ్యానుకు విద్యార్థిని పవిత్ర ఉరివేసుకుని కనిపించిందని తెలిపారు. దీంతో వెంటనే స్థానికుల సహాయంతో కిందకు దింపు చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

# ముంబయిలో ఆగని డ్రగ్స్ స్మగ్లింగ్

## ఎన్‌సిబి దాడిలో రూ.200 కోట్ల కొకైన్, హైబ్రిడ్ గంజాయి జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో డ్రగ్స్ దందాలు ఆగడం లేదు. ఓవైపు పోలీసులు మరోవైపు కోస్ట్ గార్డ్ ఇంకోవైపు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) వరుసగా దాడులు చేస్తున్నా మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలు కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగుతూనే వున్నాయి. తాజాగా శుక్రవారం నవీ ముంబయిలో 200 కోట్ల రూపాయల విలువ చేసే కొకైన్, హైబ్రిడ్ గంజాయిని జప్తు చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. నెల రోజుల క్రితం ముంబయి తీర ప్రాంతంలో ఓ పడవలో 200 గ్రాముల కొకైన్ లభ్యం కాగా దీనిపై విచారణ జరిపిన ఎన్‌సిబి అధికారులు నవీ ముంబయి లో ఓ ప్రాంతంలో దాడి పుండిన 11.54 కిలోల నాణ్యమైన కొకైన్‌తోపాటు 5.5 కిలోల హైబ్రిడ్ గంజాయిని జప్తు చేశారు. గంజాయిని 200 ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి వుంచ గా పట్టుకున్నారు. పట్టుబడ్డ మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 200 కోట్ల రూపాయలుగా తేలింది. కొకైన్, హైబ్రిడ్ గంజాయి అమెరికా నుంచి కొరియర్ లేదా పార్శిల్ ద్వారా ముంబయి వచ్చినట్లు తేలింది.

# కుక్కల బెడదతో బేంబేలెత్తుతున్న జనం



రాత్రి సమయాలలో తీసుకొచ్చి వదిలేస్తున్నారు నియంత్రణ చేపట్టాలని కోరుతున్న ప్రజలు

**రావులపాలెం, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** రావులపాలెం మండలపరిధిలోని వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ స్వైరవిహారం చేస్తూ స్థానికులతో పాటు వాహన చోదకులనూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సైతం కుక్కలబెడద తప్పడంలేదు, చీకటి పడితే చాలు ఎక్కడనుండి వస్తున్నాయో తెలియడంలేదు గాని గుంపులు, గుంపులుగా రోడ్లపైకి చేరుకొని ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు, గోపాలపురం, రావులపాలెం, పొడగట్లపల్లి, ఈతకోట ఇలా పలు గ్రామాలలో కుక్కల బెడద అధికమయ్యింది, ఇబ్బందులు తలెత్తకముందే అధికారులు వీధి కుక్కల నివారణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వీధి కుక్కలు దాడి చేయడంతో పలు చోట్ల ప్రజలు, చిన్నారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకమున్నాయని అన్నారు.

**వాహనాలపై తీసుకొచ్చి ఇక్కడ వదు లేస్తున్నారు**

రాత్రి సమయాలలో వాహనాలపై కుక్కలను తీసుకుని వచ్చి రావులపాలెం పరిసర ప్రాంతాలలో వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో జన సంచారం లేని సమయాలలో ఈ కుక్కలనూ రోడ్లపక్కన వదిలేస్తున్నరన్నారు. అవి గుంపులు గుంపులుగా గృహ సముదాయాల మధ్యకు, రోడ్ల పైకి పక్కన ఉండే హెూటళ్ల వద్ద తిష్ట వేస్తూ ఒక్కోసారి జనాలనపైకి, వాహన చోదకులపైకి దూసుకురావడంతో భయబ్రాంతులకు గురవుతున్నారని అంటున్నారు.

## ఘనంగాశ్రీశ్రీశ్రీ వారాహి దేవి దివ్య సుందర విగ్రహం ప్రాణ ప్రతిష్ట - హాజరైన ఎమ్మెల్యే బలరామకృష్ణ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** కొంతమూరు గ్రామం కోరుకొండ రోడ్డులో షణ్ముఖ పీఠం శ్రీశ్రీ స్కంద స్వామి పర్యవేక్షణలో శ్రీశ్రీశ్రీ వారాహిదేవి పీఠం వ్యవస్థాపకులు పామర్తి బాబురావు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా శ్రీశ్రీశ్రీ వారాహి దేవి దివ్య సుందర విగ్రహం ప్రాణ ప్రతిష్ట అత్యంత వైభవంగా కన్నుల పండుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించారు. ఆ అమ్మవారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వామి కళ్యాణానికి ఆలయం లో పూర్తయిన ఏర్పాట్లు - జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి

**కోనసీమ బ్యూరో , ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** మాఘ మాసం శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశి రోజున దక్షిణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించ డానికి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి తెలి పారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కళ్యాణ వేదిక ఏర్పాట్లు, భక్తుల కొరకు ఏర్పాటు చేసిన కంపార్ట్మెంట్లు, మినీ కంట్రోల్ రూమ్, బీచ్ పాయింట్, స్నాన ఘట్టాలు పరిశీలించి తదుపరి ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం, సిబ్బందికి ఏర్పాట్లకుసంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండితుల వేద మంత్రోశ్చరణలు అర్చకుల పూజాది కార్యక్రమాలతో శ్రీ స్వామివారి కల్యాణో త్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు గావించడం జరిగింద న్నారు. కోనసీమ జిల్లాలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీనర సింహస్వామి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. రాత్రి 12.55 గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం జరగనుందని అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించ డానికి అంతర్వేది ఆలయాన్ని ముస్తాబు చేశారన్నారు. స్వామి అమ్మ వార్లు వధూవరు లుగా భక్తులకు దర్శనమి స్తారన్నారు. ఈ కళ్యాణం తిలకించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల తోపా టు వివిధ ప్రాంతాల నుంచి నాలుగు లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కళ్యాణం కోసం గోదావరి జిల్లాల నలు మూలల నుంచి అంత ర్వేదికి 105 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ వారు నడుపుతున్నారన్నారు. పోలీసు సిబ్బందితో పోలీస్ బందోబస్తు మరింత పటిష్టంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ లతో ఉత్సవాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని డ్రోన్ కెమె రాలతో పరిస్థితులను పర్యవేక్షించనున్నారు. ఎస్టీఆర్ఎఫ్, స్పెషల్ పార్టీ,



మెరైన్ పార్టీలతో పర్యవేక్షణ కొరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డిజిటల్ డిస్ప్లే, ఎస్ఈడీ స్క్రీన్లతో భక్తులు స్వామివారి కళ్యాణం తిలకించే అవకాశం కల్పించార న్నారు. క్యూలైన్లలో పటిష్టమైన బారికేడింగ్స్ ఏర్పాటు చేశారని అదే విధంగా ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు చేశారని, కళ్యాణం తర్వాత భక్తులకు అక్షింతలు పంపిణీ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేప ట్టారన్నారు. భద్రాచలం తరువాత బహిరంగంగా అశేష భక్త జనం మధ్య కళ్యాణం నిర్వహించడం అంతర్వేది లోనే కావడం విశేషమన్నారు. కళ్యాణం ఆద్యంతం భక్తులు తిలకించేందుకు అన్ని ఏర్పా ట్లు చేశామన్నారు. భక్తులు ఆలయ అను వంశిక ధర్మకర్త మొగ ల్తూరు రాజ వంశీయులు శ్రీ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహుద్దూర్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రజా ప్రతినిధు లు అధికారులు, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, అమ లాపురం ఆర్డీఓ కె.మాధవి దేవస్థానం ఈవో సత్య నారాయణ, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలి - జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** కంప్రెస్డ్ బయోగ్యాస్(శుద్ధి చేసిన వ్యర్థాల నుంచి తయారైన గ్యాస్) ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్,జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై చర్చించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూములు వివరాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద జీవ ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలను తీసుకువచ్చిందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును రిలయన్స్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదేళ్లపాటు సుస్థిర మూలధనం పెట్టుబడిపై 20 శాతం, స్టేట్ జీఎస్టి పూర్తి రియంబర్స్మెంట్, ఐదేళ్లపాటు విద్యుత్ రాయితీ ఇవ్వనున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. సాంప్రదాయ వనరులపై ఆధారపడడం తగ్గించడంతో పాటు వ్యర్థాలను శక్తిగా మార్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నదన్నారు. ఈ కంప్రెస్డ్ బయోగ్యాస్ సేంద్రీయ వ్యర్థాల మూలాల నుంచి తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ప్లాంటుకు అనువైన భూములను గుర్తించాలన్నారు. ప్రధానంగా అటవీ, అసైన్డ్ భూముల వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, కె.శ్రీరమణి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజశ్యామల మహాయాగం

**అమలాపురం, ఫిబ్రవరి 06, ( ప్రభాతవార్త ) :** శుద్ధ పాడ్యము నుండి తొమ్మిది రోజుల పాటు జరిగే శ్యామల నవరాత్రులలో తొమ్మిదో రోజు శుక్రవారం సందర్భంగా శ్రీ రాజా శ్యామల మహాయాగం శ్రీ కామాక్షి పీఠ మహాసంస్థానం నందు నిర్వహించబడింది. లోక కళ్యాణార్థం విశ్వశాంతిల కోసం ఈ యాగం శ్రీ కామాక్షి పీఠం నందు నిర్వహించడం జరిగిందని పీఠాధిపతి శ్రీ శ్రీ కామేషమహర్షి వారి అనుగ్రహ భాషణలో తెలియజేశారు. శ్రీ కామాక్షి పీఠాధిపతి శ్రీ శ్రీ కామేశ్వర మహర్షి పర్యవేక్షణలో పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ బృందం వారిచే పీఠం బ్రహ్మ బ్రహ్మశ్రీ గోవింద వజ్జుల నాగ భాస్కర శర్మ యాగ్నికం లో శ్రీ రాజ శ్యామల మహాయాగం జరుపబడింది. భక్తులందరికి యాగంలో పాల్గొని వారి వారి సమస్త సమస్యలు పరిష్కరించుకోవడానికి మార్గాన్ని కల్పించడం



జరిగింది. పుణ్యాహవాచనం,విఘ్నేశ్వర పూజ పంచగవ్య ప్రాసన, పరిషత్తు,మండపారాధన క్రమం తప్పకుండా జరిగాయి. అనంతరం యాగం చేసి మహా పూర్ణాహుతి చేయడం జరిగింది. తరువాత వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు.

## కేంద్రం సహకారంతో ఏపీ అభివృద్ధి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రామారావు

**అంబాజీపేట, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సహకారంతోనే ఏపీ అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్సీ,పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దువ్వారపు రామారావు అన్నారు. అంబాజీపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలో రూ.6.85 లక్షల కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. దీంతో పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈనెల 27న జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరంను ఏకగ్రీవంగా



ఆమోదించారన్నారు. పి. గన్నవరం నియోజవర్గంలో 8,952 మంది పట్టభద్రుల ఓటర్లుకు గాను, అంబాజీపేట మండలంలో మూడు పోలింగ్ బూతులు గాను 2,431 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లను మూడు భాగాలుగా విభజించి ముగ్గురు పరిశీలకులను నియమించామన్నారు. వీరి ద్వారా మరో 80 మంది ఇన్చార్జిలను నియమించి ఒక్కొక్కరికి 30 మంది ఓటర్ల బాధ్యతలను అప్పగించామన్నారు. వీరంతా ఓటర్లను కలుసుకోవడంతోపాటు, ప్రస్తుతం వారు ఎక్కడ ఉంటుంది తెలుసుకోవాలన్నారు. టిడిపి జనసేన, బిజెపి నాయకులతో పాటు కార్యకర్తలు ప్రతి ఒక్కరు బాధ్యతగా ఎన్నికల ప్రచార విధులను నిర్వహించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్. డి. ఏ ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని,ఇవన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు రామారావు, ఎమ్మెల్యే సత్యనారాయణ,రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనంద సాగర్ లను కూటమి శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు,షేక్ సుభాను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు ఎఫ్ ఆర్ లో పేర్లు నమోదు చేసుకోవాలి

**రౌతులపూడి, ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. ప్రతి రైతు ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం నకల్ తోపాటు మొబైల్ ను రైతు సేవ కేంద్రం కు తీసుకొని వెళ్ళాలని ఆయన సూచించారు. నమోదు కానిపక్షంలో పథకాలు లబ్ధి పొందలేరన్నారు. ప్రతి ఒక్కరు రైతు సేవ కేంద్రంను సంప్రదించాలన్నారు.

## వైసిపి సమాచార హక్కు చట్టం విభాగం అధ్యక్షులుగా మందపల్లి



**మండపేట రూరల్ , ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :** మండపేట నియోజక వర్గ వైసిపి సమాచార హక్కు చట్టం విభాగం అధ్యక్షులు గా మండపేట 8 వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియమకపు ఉత్తర్వులు ఇచ్చినట్లు రవి కుమార్ మీడియా కు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండపేట వైసిపి ఇంచార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనను నియమించారని తెలిపారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## గుండె పోటు ఇంజెక్షన్ అందుబాటు లో ఉంచడం పై హర్షం

**మండపేట ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** ప్రభుత్వం గుండె పోటు ఇంజెక్షన్ ను సామాన్యులకు అందుబాటులో ఉంచడం పై జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గుండె నొప్పు రోగనిర్ధారణ చేసి గంటలోపే ఇంజెక్షన్ ఇస్తే ప్రాణాపాయం ఉండదని పేర్కొన్నారు. గుండెపోటుకు గురైనప్పుడు చేయాల్సిన ఖరీదైన ఇంజెక్షన్ కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు గుండెపోటుకు గురైన పేషంట్ ను పెద్ద ఆస్పత్రికి తీసుకువెళ్లే లోపు... అతని ప్రాణం నిలిపేందుకు మొదటి గంట లోపే 'టెనెక్టెప్లేస్' అనే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే ఇది రూ.40 నుంచి 45 వేలు ఉంటుందన్నారు.

## ఉత్తమ అర్చకుడికి ఘన సత్కారం

**అంబాజీపేట, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** జనవరి 26న జరిగిన రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నుండి ఉత్తమ అర్చకుడిగా అవార్డు అందుకున్న నందంపూడి శివాలయ ప్రధాన అర్చకులు యలమంచిలి సుబ్రహ్మణ్యశర్మను స్థానికులు, నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఆలయంలో సుబ్రహ్మణ్యశర్మను దుశ్శాలువా,పూలమాలలతో సత్కరించి, ఆయన నుండి ఆశీర్వాదాలు అందుకున్నారు ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు,గణపతి వీరరాఘవులు, పితాని వీరాస్వామి, మైపాల తాతాజీ, కుదుపూడి బుజ్జి,



రాజు డాక్టర్, నందంపూడి సత్యనారాయణ, కొప్పినీడి సాయి సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం ను గెలిపిద్దాం:నులుకుర్తి వెంకటేశ్వర్రావు



**కాకినాడ రూరల్ , ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ను భారీ మెజారిటీతో గెలిపిద్దామని టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల సమన్వయకర్త, మాజీ జెడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వర్రావు అన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నులుకుర్తి కూటమి అభ్యర్థి రాజశేఖర్కు మద్దతుగా స్థానిక నాయకులతో ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, సర్పవరం పోలీస్ స్టేషన్, రమణయ్యపేట హై స్కూల్, ఎలిమెంటరీ స్కూల్ లోని గ్రాడ్యుయేట్ ఓటర్ల వద్దకి వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నులుకుర్తి వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడు నెలల కాలంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు మాసుమేను గంగయ్య, మాసుమేను శ్రీరాములు, కొండా వినాయక్, కాదా ప్రసాద్, లాయర్ శ్రీను, మల్లంపల్లి నారాయణ, దమ్ము నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి విద్యానిధి చేయూత

**అమలాపురం, ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :** విద్యానిధి విద్యాసంస్థల్లో ఆయాగా సేవలందిస్తున్న కె. పెదపూడి గ్రామానికి చెందిన బళ్ళ చంద్రావతి కుమార్తె బేబీసీతామహా లక్ష్మి అగ్ని ప్రమాదంలో తీవ్రం గా గాయపడి, స్థానికంగా ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు తోంది. ఈనేపథ్యంలో ఆమె కు చేయూతనందించే నిమిత్తం,విద్యానిధి విద్యార్థులుచేయిచేయి కలిపారు. విద్యానిధి సంస్థ లు విద్యార్థులు,సిబ్బంది, యాజమాన్యం కలిసి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి ద్వారా అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందు కు వచ్చిన విద్యార్థుల సంక ల్పాన్ని విద్యానిధి చైర్మన్ ఆకుల బాపన్నాయిడు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్యామల మహాలక్ష్మి, డిగ్రీ



కళాశాల ప్రిన్సిపాల్ బి. సుబ్బారాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగ మాధవి పాల్గొన్నారు.

## రేషన్ డీలర్స్ అధ్యక్షుడి గా సూరంపూడి ఎన్నిక : అభినందలు తెలిపిన ఎమ్మెల్యే నానాజీ

**కాకినాడ రూరల్, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సూరంపూడి కిషోర్ రూరల్ మండలం రేషన్ డీలర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారంరేషన్ డీలర్లు నూతన కమిటీ తో కలసి స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి గజమాలాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ నానాజీ నూతన అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. డీలర్స్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి,ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రజలకు మేలు చేసే విధంగా నూతన కమిటీ పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూరంపూడి కిషోర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించి బాధ్యతయుతంగాపని చేస్తానని అన్నారు. నూతన అసోసియేషన్ ప్రెసిడెంట్ ను మాజీ అధ్యక్షుడు కోటిపల్లి శ్రీనివాస్,



రూరల్ మండలంకు చెందిన డీలర్లు అభినందించారు. అనంతరం యువ నాయకులు పంతం సందీప్ ను నూతన కమిటీ ఘంజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం రేషన్ డీలర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న భక్తుల కోసం అన్నదాన వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం, ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :** నేను సైతం స్వచ్ఛంత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన వాహనాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని



దర్శించుకోవడానికి నడచి వెళ్లే భక్తులకు ఈ అన్నదాన సదుపాయాన్ని ఏర్పాటు చేసిన సంస్థ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవలను ప్రజలకు అందించాలని సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, తోట స్వామి, తాడి మోహన్ రెడ్డీ, సేవ సంస్థ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు కాకినాడ మధుర స్మృతిగా ఉండేలా ఏర్పాట్లు చేయాలి - జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**



కాకినాడ డిఎస్ఏ స్టేడియం వేదికగా జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఈ వెంట్ ఆర్గనైజింగ్ ఉప కమిటీలను కోరారు. శుక్రవారం మద్యాహ్నం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వాహక కమిటీలతో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఈ నెల 15 నుండి 28వ తేదీ వరకూ 14 రోజులపాటు జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఈవెంట్ ను విజయవంతం చేయాలని కోరారు. టోర్నమెంట్ లో పాల్గొనే జాతీయ స్థాయి క్రీడాకారులకు ఈ పోటీలను క్రీడా వేడుకగా నిర్వహించి, క్రీడాకారులకు మధుర స్మృతిగా నిలిచి ఉండేలా ఆతిధ్యం, సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. పోటీలకు తరలి వచ్చే క్రీడాకారుల కొరకు సౌకర్యాలతో కూడిన బస కల్పించాలని, కాకినాడ, సామర్లకోట రైల్వే, బస్ స్టేషన్ల నుండి వారి బసకు, బసచోటు నుండి క్రీడా మైదానానికి వెళ్లేందుకు బస్సులు, కార్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. క్రీడాకారుల నమోదు, పోటీల నిర్వహణ సజావుగా జరిగేట్లు ఏర్పాట్లు చేపట్టాలని రిజిస్ట్రేషన్, టెక్నికల్ కమిటీలను కోరారు. అలాగే ఆహార, వైద్యసేవలను ఫుడ్, మెడికల్ ఉపకమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రారంభ, ముగింపు వేడుకల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పబ్లిసిటీ, మీడియా సమన్వయం, పారిశుద్యం, ట్రాఫిక్, క్రౌడ్ నియంత్రణ, పార్కింగ్, లైటింగ్ తదితర అంశాలను ఆయా కమిటీల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించి ఆదేశాలు జారీ చేసారు. ఈ ఈ సమావేశంలో ఆర్డిఓలు ఎస్. మల్లిబాబు, కె. శ్రీరమణి, డిఎస్డిఓ బి. శ్రీనివాసకుమార్, సిపిఓ పి. త్రినాద్, వివిధ ఉప కమిటీల సభ్యులైన అధికారులు పాల్గొన్నారు.

# ఓఎన్జీసీ లో కాంట్రాక్టు డ్రైవర్ల ను దోచుకుంటున్నారు..సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

**రాజమహేంద్రవరం , ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :**



ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ లొ పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్ల కష్టాన్ని కాంట్రాక్టర్లు, ఒక యూనియన్ నాయకుడు దోచుకుంటున్నాడని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ ఆరోపించారు. దీనిపై రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ లో విలేకర్ల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఓ.ఎన్. జి.సి కె జి బేసిన్ రాజమండ్రి అసెట్ లో 350 మందికి పైగా డ్రైవర్లు కాంట్రాక్టు వర్కర్లుగా పని చేస్తున్నారన్నారు. వీరికి సెంట్రల్ లేబర్ డిపార్ట్మెంట్ నిర్దేశించిన కనీస వేతనంతో పాటు అదనంగా 35 శాతం ఫెయిర్ వేజ్,రోజుకు రూ. 50 ,సెలవు కూడిన జీతం,బోనస్, పి ఎఫ్, ఈ ఎస్ ఐ,ఈ ఎస్ ఐ పరిమితి దాటిపోతే ఇన్సూరెన్స్ ఇతర సౌకర్యాలు ఇవ్వాలని దీనికి అంగీకరించిన వారే టెండర్లు వేసేందుకు అనుమతి ఉన్నదని తెలిపారు. రెండేళ్ల క్రితం వరకూ నెలకు రూ. 22 వేల నుంచి రూ25వేలు వేతనం కాంట్రాక్టు డ్రైవర్స్ తీసుకుంటే కొత్త కాంట్రాక్టరు నెలకు రూ. 14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. 2021 లో కుదిరిన అగ్రిమెంట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం నైపుణ్యం కలిగిన కార్మికులకు రోజుకు రూ. 739 దీని పైన 35 శాతం ఫెయిర్ వేజ్ అంటే రోజుకు 258.65 రూపాయాలు దీనికి అదనంగా రోజుకు 50 రూపాయలు మొత్తం కలిపి రోజుకు 1048 రూపాయలు ఇవ్వాలని నెలకు 26 రోజులకు గాను 27,248 రూపాయాలు జీతం రావాలని వీటికి అదనంగా ఓవర్ టైమ్, నెలకు ఒకటిన్నర రోజు జీతం తో కూడిన సెలవు,ఏడాదికి నెల రోజుల జీతం బోనస్ ఇవ్వాలని కానీ కేవలం నెలకు 14 వేల రూపాయలు చెల్లించి కార్మికులను దోపిడీ చేసి కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారని అన్నారు. కార్మికులు అందరూ పెట్రోలియం ఎంప్లాయిస్ యూనియన్ లో సభ్యులని ఆ యూనియన్ నాయకుడు సురేష్ వద్ద కార్మికులు పలు మార్లు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. చివరికి గత్యంతరం లేక కార్మికులు ఆ సంఘానికి రాజీనామా చేసి సిఐటియు లో చేరారని కార్మిక శాఖ వద్ద కేసు వేశారని తెలిపారు. తమ కష్టానికి తగ్గ కనీస వేతనం ఓఎన్జీసీ సంస్థ నిబంధనల ప్రకారం ఇవ్వమని అడిగినందుకు 4 గురుని ఉద్యోగాల నుండి నిలుపుదల చేసారని విమర్శించారు. పని నుండి నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో ఓఎన్జీసీ మెయిన్ గెట్ వద్ద ఆందోళన చేపడతామని అన్నారు. దీనిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. పవన్,నాయకులు ఎస్ ఎస్ మూర్తి, కాంట్రాక్టు డ్రైవర్స్ పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు సత్య ప్రభ ప్రచారం



**శంఖవరం , ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ప్రచారం చేపట్టారు మండలంలోని కత్తిపూడి లో నాలుగో వార్డ్ లో శుక్రవారం ఆమె ప్రచారం చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారము లోకీ రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగ యువకులకు అండగా నిలిచిందన్నారు, నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలి అనే లక్ష్యంలో భాగంగా దావోస్ వేదికగా రాష్ట్రానికి అనేక కంపెనీలను ఆహ్వానించిన ఘనత చంద్రబాబుదని ఎమ్మెల్యే సత్య ప్రభ అన్నారు. జగన్ గత ఐదేళ్లలో బటన్ నొక్కడం తప్పించి చేసినది ఏమీ లేదని, అంతకంటే మెరుగైన సంక్షేమం రాష్ట్రంలో త్వరలోనే కూటమి ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందని , ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పలాలు కూడా అందించాలనే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ఈ రోజు ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే సత్య ప్రభ అన్నారు.. పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, వైద్యం, విద్యా వ్యవసాయ రంగాలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తుందని అన్నారు. కూటమి పార్టీల ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరము నిరంతరం శ్రమించే వ్యక్తి , సేవ భావం గల వ్యక్తి అని అలాంటి వ్యక్తిని శాసనమండలి పంపాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు వెన్న శివ గాబు కృష్ణ కేలంగి జనార్ధన్ సాధనల లక్ష్మీ బాబు తదితరులు పాల్గొన్నారు

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు



**ప్రత్తిపాడు , ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :**

ఒమ్మంగి గ్రామంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. శాసనసభ్యురాలు వరపుల సత్యప్రభ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సదస్సులోఎన్డీఏ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీల నుండి పోటీ చేయుచున్న పేరాబత్తుల రాజశేఖరం కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారము లోకీ రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగ యువకులకు అండగా నిలిచిందన్నారు, నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలి అనే లక్ష్యంలో భాగంగా దావోస్ వేదికగా రాష్ట్రానికి అనేక కంపెనీలను ఆహ్వానించిన ఘనత చంద్రబాబుది అన్నారు... కూటమి పార్టీల ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరము అత్యంత సామాన్యుడని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి , సేవ భావం గల వ్యక్తి అని అలాంటి వారిని శాసనమండలికి పంపించడం ద్వారా ఒక సేవకున్ని ఎన్నుకున్న వారు అవుతారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకు మెట్ల రమణబాబు ప్రత్యేక పరిశీలకులు గొంప కృష్ణ, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సింగల్ దేవి సత్య రాజు ఎన్డీఏ కూటమి శ్రేణులు,మరియు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ విలువలు లేని పాలనందించిన జగన్ -ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం , ఫిబ్రవరి 06, ( ప్రభాతవార్త ) :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ విలువ లేని పాలనందించారని రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆరోపించారు. వచ్చే ఎన్నికలో ఆ 11 సీట్లు వైకాపాకు రావన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ జగన్ సీఎంగా ఉన్నప్పుడు డిల్లీ పర్యటన మీడియాకు చెప్పేవారు కాదు ఇదంతా గమనించిన ప్రజలు 1.ఓ ను పక్కన పెడితే ఇప్పుడు 2.ఓ చూపిస్తా అంటే అందరూ నవ్వుతున్నారన్నారు. జగన్ కు రాజకీయ విలువలు లేని ఫలితంగా రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. తాజాగా ప్రవేశపెట్టిన రైల్వే, కేంద్ర బడ్జెట్ మన రాష్ట్రానికి భారీ కేటాయింపులు జరిగాయన్నారు. రాష్ట్రానంతా కలుపుతూ కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు గ్రీన్ సిగ్నల్ రావడం ఎన్డీయే కూటమి కృషి ఫలితం అన్నారు. జగన్ లిక్కర్ స్కాంపై ఉదయం సిట్ విచారణ వేయగానే రాత్రికి రాత్రి తాడేపల్లి ప్యాలెస్ కాగితాలు, డ్కరీలు డాక్యుమెంట్లు తగలబెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఎన్ని కుట్రలు చేసినా తిప్పి కొడతామని గెట్ రెఢీ జగన్ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీకి అభ్యర్థులను నిలబెట్టే ధైర్యం లేదన్నారు. దీనిలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, అత్తి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, యెనుముల రంగబాబు, మొకమాటి సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, వై వీ డి ప్రసాద్, వడ్డాది ఇంద్ర, విన్నం వాసు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**అన్నవరం శంఖవరం , ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు మాఘమాసం సందర్భంగా స్వామివారి ఆలయంలో కన్నుల పండగగా నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీనరసింహస్వామి వారికి అన్నవరం దేవస్థానం తరపున కార్యనిర్వహణ అధికారి వీర్ల సుబ్బారావు అంతర్వేది దేవస్థానం కార్యనిర్వణాధికారికి అందజేశారు ఆయన వెంట రమేష్ బాబు వేద పండితులు పాల్గొన్నారు

# మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులుగా సత్యనారాయణ



**రౌతులపూడి , ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**

రౌతులపూడి మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులుగా ములగపూడికి చెందిన చింతకాయల వీర వెంకట సత్యనారాయణ ను అధిష్టానం నియమించినట్లు నియోజవర్గం ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. గతంలో గ్రామ ఉప సర్పంచ్ గా పని చేశారు. ప్రస్తుతం మండల కో ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్నారు. ఆయనకు మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు శుభాభినందనలు తెలిపారు.

# రథోత్సవం సందర్భంగా... పట్టణం లో విద్యుత్ బంద్...



**మండపేట ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**

ప్రసిద్ధి చెందిన మండపేట శ్రీ జనార్ధన్ స్వామి వారి రథోత్సవం సందర్భంగా శనివారం పట్టణం లో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. రథం ఆలయం నుండి మధ్యాన్నం రథాన్ని ఊరేగిస్తారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు మండపేట టౌన్ లో విద్యుత్ సరఫరా వుండదు. శ్రీ జనార్ధన స్వామి (రథోత్సవం ) సందర్భంగా కరెంట్ వైర్లు తొలగిస్తారు. కేపి రోడ్డు, రావిచేట్టువద్ద , తెనుకలపేట, బురుగుంట చెరువు వద్ద, మెయిన్ రోడ్డు, తర్వాణి పేట, పోలీస్ స్టేషన్ రోడ్డు, సైదుల పేట, గాంధీ నగరం, కలవపువ్వ సెంటర్, మునిసిపల్ ఆఫీస్ రోడ్డు, నాళం వారి వీధి, సంకా వారి వీధి, రథం సెంటర్, వల్లూరి వారి వీధి, గవర్నమెంట్ హాస్పటల్ వెనుక వీధి, గౌరీశంకర్ వీధి , సంగం పుంత రోడ్డు, పార్థసారధి నగర్, కరాచీ సెంటర్, ఏడిద రోడ్డు ల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు. ఈ మేరకు మండపేట ఎలక్ట్రికల్ డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ మండపేట ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ముని లు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని తెలిపారు.


# రథోత్సవం సందర్భంగా... పట్టణం లో విద్యుత్ బంద్...

**మండపేట, ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**

ప్రసిద్ధి చెందిన మండపేట శ్రీ జనార్ధన్ స్వామి వారి రథోత్సవం సందర్భంగా శనివారం పట్టణం లో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. రథం ఆలయం నుండి మధ్యాన్నం రథాన్ని ఊరేగిస్తారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు మండపేట టౌన్ లో విద్యుత్ సరఫరా వుండదు. శ్రీ జనార్ధన స్వామి (రథోత్సవం ) సందర్భంగా కరెంట్ వైర్లు తొలగిస్తారు. కేపి రోడ్డు, రావిచేట్టువద్ద , తెనుకలపేట, బురుగుంట చెరువు వద్ద, మెయిన్ రోడ్డు, తర్వాణి పేట, పోలీస్ స్టేషన్ రోడ్డు, సైదుల పేట, గాంధీ నగరం, కలవపువ్వ సెంటర్, మునిసిపల్ ఆఫీస్ రోడ్డు, నాళం వారి వీధి, సంకా వారి వీధి, రథం సెంటర్, వల్లూరి వారి వీధి, గవర్నమెంట్ హాస్పటల్ వెనుక వీధి, గౌరీశంకర్ వీధి , సంగం పుంత రోడ్డు, పార్థసారధి నగర్, కరాచీ సెంటర్, ఏడిద రోడ్డు ల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు. ఈ మేరకు మండపేట ఎలక్ట్రికల్ డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ మండపేట ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ముని లు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని తెలిపారు.


# కొలతల ప్రకారం సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలి

**- నిర్దేశించుకున్న సమయపాలన లోగా రీ సర్వే పూర్తి చేయాలి :**
**- కలెక్టర్ పి ప్రశాంతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఫిబ్రవరి 07 , ( ప్రభాతవార్త ) :**



ఖండవల్లి సచివాలయం లో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి , ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా సర్వే అధికారి బి లక్ష్మి నారాయణ తో కలిసి శుక్రవారం సాయంత్రం పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో రీసర్వే పురోగతిని సమీక్షించడం జరిగింది . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, రెవిన్యూ సర్వే రికార్డ్ క్షేత్ర స్థాయి భూమిపై డేటాను సర్వే చేసే సమయంలో రెండు రికార్డ్ ల వివరాలు సరిపోవాలని, సర్వే సమయంలో అటువంటి సమస్యలు గుర్తించడం జరిగిందా అని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. జియోలొకేషన్ రికార్డ్ , ఇమేజ్ ఫీచర్‌లను ధృవీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందన్నారు. గ్రౌండ్ ట్రూటింగ్ ద్వారా భూముల సరిహద్దులను గుర్తించడం సులభతరం చేస్తుందని, ఎటువంటి వివాదాలు తావులేకుండా పారదర్శకంగా ఉండేలా తోడ్పాటు పడుతుందని తెలిపారు. కొలతల ప్రకారం లేని పక్షంలో ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగింది, సంబంధించిన యజమానులకు నోటీసు జారీ చేసి వాస్తవ భూ కొలతలు ఆధారంగా సర్వే నెంబర్ లో ఉన్న భూమి సరిపోవాలని స్పష్టం చేశారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , మార్గదర్శకాలు మేరకు సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. రీ సర్వే లో అభ్యంతరాలు ఉంటే వాటిని అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని , ఆమేరకు పరిష్కారం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఈరోజుకి ఆరోజు క్షేత్ర స్థాయి లో సర్వే వివరాలు, సర్వే రికార్డులను అనుసరించి బేరీజు వేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పెరవలి మండలం క్షేత్ర స్థాయి సర్వే సిబ్బంది, రెవిన్యూ అధికారులు , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'ఈ-శ్రమ్' పోర్టల్ నందు అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ నమోదు చేయాలి - జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 07, ( ప్రభాతవార్త ) :**



జిల్లాలో అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులను ప్రతీ ఒక్కరిని'ఈ-శ్రమ్' పోర్టల్ నందు మార్చి31లోగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ సమేవేశపు హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్,జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి జిల్లాస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులు పురపాలక సంఘాల కమిషనర్లు, ఎంపీడీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అసంఘటిత కార్మికులను 'ఈ-శ్రమ్' పోర్టల్ నందు నమోదు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో 'ఈ-శ్రమ్'పోర్టల్ పై అసంఘటిత కార్మికు అవగాహన కల్పించేందుకు రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జేసీ రాహుల్ మీనా, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 6 లక్షలకుపైగా అసంఘటిత రంగంలో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వారికి సామజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు వారందరినీ 'ఈ-శ్రమ్' పోర్టల్ నందు నమోదు చేయవలసి ఉందని ఆయన తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు 16 నుండి 59 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని, ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రోవిడెంట్ ఫండ్ మరియు ఎంప్లాయిన్ స్టేట్ ఇన్సూరెన్సు సదుపాయం లేనివారు అర్హులన్నారు. 'ఈ-శ్రమ్' పోర్టల్ నందు నమోదైన ప్రతీ కార్మికుడికి ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన కింద రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ ఉపాధి పనివారు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు, ఉద్యానవనాలు పనివారు, పాడిపరిశ్రమ, ఉమ్మడి వ్యవసాయదారులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, భవన నిర్మాణం, అనుబంధ రంగాలలో పనిచేసే తాపీ, తవ్వకం, రాళ్లు కొట్టేపని, సెంటరింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, సానిటరీ, పెయింటర్, టైల్స్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, ఇటుక సున్నం బటీలు, రిగ్గర్లు, కాంక్రీట్ మిక్సర్, బావులు తవ్వడం, పూడిక తీత, టైలారింగ్, ఆటోమొబైల్, రవాణా రంగంలోని డ్రైవర్లు, హెల్పర్లు, చేతివృత్తులు, కులవృత్తుల ఉపాధి హామీ, ఆశా వర్కర్లు, స్వయంసహాయక సంఘాలు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం పనివారు, తదితర అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతీ ఒక్కరూ అర్హులని జిల్లా కలెక్టర్ వివరించారు. 'ఈ-శ్రమ్' పోర్టల్ నమోదుకు అవసరమైన సమాచారంతో దగ్గరలో గ్రామ/వార్డ్ సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని, లేదా మొబైల్ నుండి %షుషు. వంప్త్రతీఖఎ. స్త్రశీజ. ఱఅ% వెబ్సైటు లో వివరాలు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అసంఘటిత రంగంలో కార్మికులుగా పనిచేస్తున్నవారందరిని 'ఈ-శ్రమ్' పోర్టల్ నమోదు ఆవశ్యకతపై సంబంధిత శాఖల అధికారులు, ట్రేడ్ యూనియన్ నాయకులకు అవగాహన కలిగించి, మార్చి 31లోక నమోదు చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయా జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఈ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వే చేపట్టిందన్నారు. క్షేత్రస్థాయి అధికారులు ఈ సర్వే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి తమ పరిధిలోని వ్యాపారాలు, పరిశ్రమలకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు సేకరించి, ప్రత్యేక ఆప్ లో సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఈ సర్వేను రానున్న మార్చే 05 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ బులిరాణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# మహిళలకు అల్లికల్లో శిక్షణ



ఏడు పదుల వయసంటే విశ్రాంతిని కోరుకుంటారు. కానీ ముంబయికి చెందిన చంద్రప్రభ పరిహార్ మాత్రం ఓ కొత్త ప్రయాణం మొదలుపెట్టారు. స్కూల్ రోజుల్లో సరదాగా టైలరింగ్ నేర్చుకుని తన చెల్లెళ్లకు గౌన్లు కుట్టారు. తర్వాత కాలేజీలో చేరడం, 19ఏళ్లకు పెళ్లి, కుటుంబ బాధ్యతలు. అప్పుడే తీరిక సమయాల్లో మ్యాగజీన్లు తిరగేస్తూ అల్లికలు నేర్చుకున్నారు. పిల్లలకు, మనవలూమనవరాళ్లకు స్వెట్టర్లు అల్లేవారు. 2022లో తన కూతురి కోరిక మేరకు తొలిసారి విభిన్నమైన క్రోషే బ్యాగు అల్లారు. అది కుటుంబసభ్యులకు ఎంతో నచ్చింది. దాన్ని చూసి తెలిసినవాళ్లు అలాంటిది కావాలని కోరారట. అలా వేరొకరికి అల్ల డం, వాళ్లూ మెచ్చుకోవడంతో యూట్యూబ్లో చూస్తూ క్లిష్టమైన క్రోషే అల్లికల్ని నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఏడాదిలో 60 రకాల ఉత్పత్తుల్ని తయారుచేశారు. ఈ క్రమంలో తన కోడలు స్వాతి సలహా, సహకారంతో వ్యాపారిగా మారి... నేహార్ (may-ber.com) పేరుతో సంస్థను ప్రారంభించి క్రోషే ఉత్పత్తుల అమ్మ కాన్ని మొదలుపెట్టారు. మహిళలకు బ్యాగులు, జ్యువెలరీ, చిన్నారులకు స్వెట్టర్లు, బ్లాంకెట్లు అందిస్తున్నారు. గృహాలంకరణ విభాగంలోనూ కొన్ని ఉత్పత్తులు తెస్తున్నారు. వీటికి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు స్వాతి. ఆస్ట్రేలియా నుంచి ఓసారి పెద్ద మొత్తంలో ఆర్డర్లు తీసుకున్నారు చంద్రప్రభ. సకాలంలో అందించ డంతోపాటు, అవెంతో నచ్చడంతో వాళ్లు అప్ప ట్నుంచీ రెగ్యులర్‌గా తీసుకోవడం మొదలు పెట్టారు. ఈమె గురించి తెలుసుకుని మరో ఆరుగురు మహిళలు ఈవిడ దగ్గరే క్రోషే అల్లికల్లో శిక్షణ తీసుకోవడంతోపాటు, ఉపాధి పొందు తున్నారు. కాస్త ప్రోత్సా హం, చేయాలన్న కుతూ హలం ఉండాలేకానీ, వయసు అడ్డంకికానే కాదంటారు చంద్రప్రభ . □

# పిల్లలకు పరీక్షల వేళ పోషకాహారం..



**'అమ్మా ప్లీజ్... నన్ను కదిలించకు... ఇప్పుడేం తినను' అని విసుక్కుంటుంది పదో తరగతి చదువుతోన్న అమ్మాయి. ఎన్ని సార్లు చెప్పాలమ్మా... పెరుగు తింటే నిద్రొస్తుందని అంటూ అమ్మమీద చిరాకుపడతాడు ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఉన్న శ్రీకర్.వీళ్లిద్దరే కాదు... ఇంట్లో పిల్లలున్న అమ్మలందరికీ ఇలాంటివన్నీ అనుభవమే.అసలే పరీక్షలు... తినకపోతే మరీ నీరసపడతా రన్నది తల్లి ఆందోళన. దాంతో వాళ్లకిష్టమైనవేవో చేసి పెట్టేస్తుం టారు. కానీ అది సరికాదు. మామూలుగానే పిల్లలకు పోషకాహారాన్ని ఇవ్వాలి. ఇక, పరీక్షల వేళ మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరి స్తున్నారు. నిపుణులు.**

మనం రోజూ తినే ఆహారంలో కొన్ని పదార్థాలు గ్యాస్‌రైటిస్‌ని పొట్టలో ఎప్పటికైనా కలిగిస్తాయి. నిద్ర, బద్ధకాలకి దారి తీస్తాయి. అలాగే కొన్ని పదార్థాలు మెదడును శక్తిని మార్చి అందిస్తే, ఏకాగ్రతని పెంచుతాయి. ఇంకొన్ని ఒత్తిడీ, ఆందో ళనల్ని తగ్గిస్తాయి. కాబట్టి పరీక్షల ముందు పిల్లల కిచ్చే ఆహారంలో తల్లులు కొన్ని నియమాలను తప్పక పాటించాలి.

**నిర్ణీత వేళల్లోనే...** సెకండరీ స్కూలు స్థాయి నుంచి మాస్టర్స్ వరకూ. ఏ విద్యార్థికైనా పరీక్ష లంటే ఒత్తిడి ఉంటుంది. దాన్ని ఆహారంతో అధిగమించడం. కాబట్టి విద్యార్థులకు నిర్ణీత వేళల్లో ఆహారం ఇవ్వాలి. బ్రేక్ ఫాస్ట్ అస్సలు మిస్ చేయొద్దు. అలాచేస్తే రక్తంలో చక్కెర నిల్వలు తగ్గిపోయాయి. ఆలోచనాశక్తిమీద ప్రభావం పడు తుంది. పరీక్షల సమయంలో పిల్లలకు అధిక పిండి పదార్థాలతో కూడిన ఆహారం, నూనె వస్తువులు పెట్టొద్దు. వీటివల్ల అధిక నిద్ర గ్యాస్ట్రైటిస్ సమస్యలు వస్తాయి. పంచదార, ఉప్పు తగ్గించాలి. ప్రాసెస్డ్, జంక్, ఫాస్ట్, ప్యాకేజ్డ్ ఫుడ్స్ ఇవ్వొద్దు. పిజ్జా, బర్గర్, వడాపావ్, సమోసా... వంటి క్రేవింగ్స్ దూరంగా ఉంచాలి. ఇవి జీర్ణశక్తిని తగ్గిస్తాయి. ఏకాగ్రతనూ దెబ్బతీస్తాయి. మైదా, వెన్న, పంచదారతో చేసిన బేకరీ పదార్థాలూ స్వీట్లూ పూర్తిగా మానేయాలి. వాటిలోని కొవ్వులు, తీపి వల్ల ఆ క్షణానికి హుషారుగా అని పించినా మెదడు కణాలు నిస్తేజంగా మారతాయి. కానీ



మనదేశంలో ఒత్తిడి కారణంగా మామూలుగా కన్నా పరీక్షల సమయం లోనే 30 శాతం ఎక్కువ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తింటారట. దానితో అధ్య యనం, జ్ఞాపకశక్తి సామర్థ్యాలు తగ్గిపోవడంతో పాటు భవి ష్యత్తులో ఊబకాయం, హృద్రోగాల బారినపడుతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. నిద్ర రాకుండా పిల్లలకు టీ, కాఫీ ఇస్తుంటారు కొందరు. బదులుగా తాజా పండ్లూ పండ్లరసాలూ ఇవ్వొచ్చు. కాఫీ, టీల అలవాటు ఉంటే కప్పు వరకూ తాగనివ్వొచ్చు. శీతల పానీయాలు అనారోగ్యాలకు దారితీస్తాయి. వాటిని మానిపించ డమే మంచిది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ముడి ధాన్యాలతో చేసిన పోహా, రాగి దోసె, ఇడ్లీ... నిలువు పెట్టాలి. ఇవి వద్దు అంటే పిల్లలకోసం ఓట్స్, చక్కెర శాతం తక్కువగా ఉన్న మ్యూజిలీ... ఇవ్వొచ్చు. ఇవయితే రక్తంలో చక్కెరల్ని కొంచెంకొంచెంగా వదిలేశారు. ఉప్మా, పోహా, ఇడ్లీ.... వంటివే బ్రేక్‌ఫాస్ట్‌గా ఇచ్చేటటు వంటి వాటిని కూరగాయలు, ఆకుకూంలతో కలిపి వండాలి. ఓట్లు గాని ఇస్తే అందులో కొన్ని రకాల పండ్లముక్కలు, డ్రైఫ్రూట్స్ జోడిస్తే మేలు. వీటితోపాటు పచ్చ సొనతోసహా గుడ్ ఓడు. గ్లాసు పాలు ఇస్తే ప్రొటీన్ అందు తుంది. టొండిమిల్క్ చాలు, రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

**భోజనంలో...** కూరగాయలు, పప్పులతో చేసిన కిచిడీ, చపాతీ, పప్పు, పన్నీర్, వెజిటబుల్ కర్రీ లేదా సాంబాడా ఒకటీరెండు కూరలతో అన్నం పెట్టాలి. ఆకుకూరలు, కూరగాయలు విధిగా ఉండాలి. లేదూ వీటినే చపాతీలో కలిపి చేయొచ్చు. పెరుగు తప్పనిసరి. ఇది ప్రొబయాటిక్ కావడంతో గ్యాస్ట్రైటిస్, తేన్పులు, పొట్టలో ప్రస్తుతం లేకుండా ఉంటాయి. మొత్తమ్మీద భోజనంలో ప్రొటీన్లు, పీచు, గుడ్డ కార్బోహైడ్రేట్లు ఉండేలా చూడాలి.



**స్నాక్స్‌లో ఏవంటే...** భోజనానికి మధ్యలో యాంటీ ఆక్సి డెంట్లు పుష్కలంగా ఉండే బాదం, అక్రోట్లు, గుమ్మడి, సన్‌ఫ్లవర్ గింజలు, విటమిన్లూ ఖనిజాలూ ఎక్కువగా ఉండే అరటి, ఆపిల్, కమలా,జామ.. వంటి తాజా పండ్లూ లేదా వాటితో చేసిన స్మూతీ, సలాడ్లూ ఇస్తే మేలు. పండ్లు ఒత్తిడినీ తగ్గిస్తాయి. కనీసం రోజూ రెండు మూడు ఇవ్వాలి. అవీ సీజన్‌లో స్థానికంగా దొకేవీ చాలు. జామ మరీ మంచిది. మిగి లిన వాటితో పోలిస్తే ఆహారం లోని ఐరన్ శాతాన్ని పదిరెట్లు ఎక్కువ శోషించుకునేలా చేస్తుంది.



**మంచినీళ్లు ఎన్నంటే.. ...** రోజును మంచినీళ్లతోనే ప్రారంభించాలి. కొన్ని విద్యాసంస్థల హాస్టళ్లలోనూ ఈ నియమాన్ని పెట్టాక మంచి ఫలితాలు వచ్చాయట. ఎటువంటి డీహైడ్రేషన్‌కు గురైన కండరాలలో అలసట, తలనొప్పి వస్తాయి. దాంతో పరీక్షలు సరిగ్గా రాయలేరు. వీలైతే పరీక్ష హాల్లోకీ ఓ బాటిల్ మంచినీళ్లు తీసుకెళ్లాలి. పరీక్ష మధ్యలో నీళ్లు తాగిన పిల్లలు మిగిలిన వాళ్లకన్నా ఐదు శాతం బాగా రాసినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.కొబ్బరినీళ్లలో పుదీనా, నిమ్మరసం కలిపి ఇస్తే సహజ ఎలక్ట్రోలైట్లూ యాంటీ ఆక్సిడెంట్లూ రెండూ అందు తాయి. ఒత్తిడిని తగ్గించేందుకు అల్లం టీ కూడా ఇవ్వొచ్చు. రోజుకు రెండు లీటర్ల మంచినీళ్లనీ; కొబ్బరినీళ్లు, నిమ్మరసం తేనె, మజ్జిగ, రాగిజావ... వంటి వాటితో కలిపి మూడు లీటర్ల నీళ్ల వరకూ తీసుకునేలా చూడాలి. పీచు అధికంగా ఉండే ఆహాఈరంతో అజీర్తి మలబద్ధకం. వంటిపొట్ట సమస్యలు ఉండవు. అరటి పండు, నట్స్.. వంటివి పరీక్షకి ముందూ ఇవ్వొచ్చు. వీటివల్ల రక్తంలో చక్కెర నిల్వలు సరిపడా ఉండి కన్ఫ్యూజన్ లేకుండా చదవడం, రాయడం చేస్తారు. పాలు, పెరుగు, మజ్జిగ... ఈ మూడింటిలో ఏదైనా ఒక్క రోజుకి కనీసం పావులీటరు తీసుకునేలా చూడాలి. ఒత్తిడివల్ల ఆకలి ఉండదు. అయినా రోజుకి మూడుసార్లు తినేలా చూడాలి. రాత్రి ఎనిమిది. గంటలకి ముందే తక్కువ మోతాదులో డిన్నర్ ముగించాలి. టైంకి తినాలి. నిద్రపోవాలి. మేలు కోవాలి. అప్పుడే వాళ్లు ఎగ్జామ్స్ సరిగ్గా రాయ గలరు.ఆరోగ్యకరమైన ఆహారం... జీవనశైలిలో భాగంగా ఉన్నవాళ్లు పరీక్షల కోసం ప్రత్యేకంగా తినాల్సిన పనిలేదు. □

# ఈ ఫ్యాషన్లదే హవా

అమ్మాయిలు కోరుకునేదే కొత్తదనం. అందుకే ఆ ముచ్చట తీర్చేస్తూ అటు అమ్మాయిల్నీ ఇటు అబ్బాయిల్నీ ఆకట్టుకోవడానికి ఈ ఏడాది బోలెడన్ని ఫ్యాషన్లు రంగంలోకి దిగాయి. వాటిల్లో కొన్ని.





**స్టైలిష్ కఫ్తాన్... న**డెస్సు ఫంకీగా ఉంటూనే సౌకర్యంగా ఉండాలనుకునేవారి మనసును దోచుకున్న కఫ్తాన్ ఫ్యాన్.

**పలాజో..** అమ్మాయిల మనస్సు పలాజో పైకెళ్లింది. కాస్త పాదాలపైకి ఉండే ఈ పలాజోలు అన్ని రకాల కుర్తాలకూ సరిపోయేలా వచ్చాయి.



**మెరిసిన లంగా ఓణీ :** ఆడపిల్లల్ని ఆకట్టుకునే లంగా ఓణీల్లో బోలెడన్ని ఫ్యాషన్లు. అయితే ఒకప్పుడు పట్టుతోనే అలరించిన లంగా ఓణీ. ఈ ఏడు మెరుపుల దోలా సిల్క్ క్లాత్‌తో మార్కెట్లోకి వచ్చింది. రంగురంగుల్లో ఛవాయి నుంచి కలంకారి వరకూ ఎన్నెన్నో ప్రింట్ల డిజైన్లతో సరికొత్తగా కనువిందు చేస్తుంది.



**చిల్లుల జాకెట్ :** బ్లౌజుల్లో ఎన్ని రకాలొచ్చినా.. ఆడవాళ్లు అస్సలు సంతృప్తి చెందరు. అందుకే మరి ఎప్పటికప్పుడు జాకెట్లలో కొత్తకొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా ఈ ఏడాది కూడా అతివల కోసం చాలానే వచ్చాయి వాటిల్లో ఒకటి ఈ చిల్లుల బ్లౌజు.

# టి.బి. లింఫాడినైటిస్ -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**వ్యాధిలక్షణాలు** : ఎర్రని వాపుతో, నొప్పి లేకుండా లింఫ్ గ్రంథులు. ఉబ్బి ఉంటాయి. వళ్ళు, నొప్పులు, జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, నీరసం, అలసట. కఫంలో రక్తం పడడం, రాత్రిళ్ళు చెమటలు పట్టడం, కొన్ని సార్లు గట్టిగా, నొప్పిగా ఉండే లింఫ్ గ్రంథుల వాపు ఉంటుంది.

**ఇది 5 దశలుగా తయారవుతాయి.**

**మొదటిదశ :** నాన్ స్పెసిఫిక్ రియాక్టివ్ హైపర్‌ప్లాసియా వల్ల లింఫ్ గ్రంథులు గట్టిగా ఉండి కదులుతాయి.

**రెండవదశ :** లింఫ్ గ్రంథులు పెరిగి రబ్బర్‌లాగా ఉండి చుట్టు ఉన్న కణజాలానికి అతుక్కొని ఉంటాయి. దీన్నే పెరి ఎడినైటిస్ దశ అంటారు.

**మూడవ దశ :** లింప్ గ్రంథి మధ్య భాగంలో మెత్తబడి అబ్సెస్ తయారు కావడం. దీన్నే కోల్డ్ అబ్సెస్ అని అంటారు.

**నాల్గవ దశ :** కాలర్‌స్టడ్ అబ్సెస్ తయారుకావడం.

**ఐదవదశ :** సైనస్ ట్రాక్ట్ (రంధ్రం) ఏర్పడడం, చీము, రక్తం కారడం వంటి లోణాలుంటాయి.

**రిస్క్ ఫ్యాక్టర్స్ :** హెచ్ఐవి, పోషకాహారలోపం, ఇమ్యూనిటీని తగ్గించే మందులు, కార్టికోస్టిరాయిడ్ వాడేవారు. కేన్సర్స్, ఆటో ఇమ్యూన్ వ్యాధులుండేవారిలో, కీమ్‌థెరపీ వాడేవారిలో రిస్క్ ఎక్కువ.

**కాంప్లికేషన్స్ :-** సైనస్.. ప్రివెన్షన్ : బి.సి.జి. వాక్సినేషన్ వేయడం ద్వారా టి.బి. లింఫాటినైటిస్ వ్యాధిని ఆరి కట్టవచ్చు. నీడిల్ ఆస్పిరేషన్,వయాప్సీ, సిటీస్కాన్, గళ్ళ పరీక్ష రక్త పరీక్షలు, కల్చర్ టెస్ట్‌లు, స్కానింగ్, టి.బి.టెస్ట్‌లు, ఆసిడ్ ఫాస్ బాసిల్లస్ టెస్ట్, ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు.

**చికిత్స :** మెడికల్ థెరపీ ద్వారా వ్యాధిని 3 నెలలు(30-40%) లేదా 6 నెలలు (80%) వ్యాధిని నయం చేయవచ్చు. రెండు ప్రక్కలా (50% కేసుల్లో) వచ్చే కేసుల్లో వ్యాధి నిరోధకతను పెంచే పోషకాహారాన్ని ఇస్తూ సర్జరీ ద్వారా తీసివేయవచ్చు.

**హోమియో చికిత్స :** డా.పటేల్ బయో కాంబినేషన్ 22 స్కోపులా 4 మాత్రలు చొప్పున మూడు పూటలా వేసుకోవాలి.

**బైరటాకార్బ్ :** 30 సర్వైకల్, మిసెంట్రిక్ లింఫ్ గ్రంథుల వాపున్న స్క్రోపులా తత్వం ఉన్న పిల్లల కిది మంచి మందు టాన్సిల్స్. ఎడినాయిడ్స్ వాపుతో చెవుదు, ఎదుగుదల లోపం ఉంటుంది.

**కాలీ అయోడ్ :** ఇంగ్వైనయిల్, సర్వైకల్ లింఫాయిడైటిస్‌కిది మంచి మందు. దగ్గు, కఫం చీమువంటి కఫం వల్ల ఊపిరాడకపోవడం చర్మంపై పొక్కులున్న వారికిది మంచి మందు.



**మెర్క్‌సాల్:** మాంసగ్రంథుల వాపు, సైనస్, అబ్సెస్ పగిలి దుర్వాసన గల స్రావాలు వెలువడడం, నోరు దుర్వాసన లాలాజల గ్రంథులు టాన్సిల్స్ వాచి ఉంటాయి. గుటక వేయడం కష్టంగా ఉండడం. గజ్జంలోని మాంసగ్రంథులు వాచి చీము పట్టేవారికిది మంచి మందు.

**స్పాంజియా :** పిల్లలు, స్త్రీలలో థైరాయిడ్ వ్యాధులు రావడం, మాంస గ్రంథులు వాచి గట్టిపడడం, జలుబుతో కూడిన శ్లేష్మ రాగాలు మాట బొంగురుగా ఉంటుంది. ఆయాసంతో వచ్చే దగ్గుకిది మంచి మందు. ఇవేగాక కాల్కేరియా కార్బ్, సల్ఫర్, సైలీషియా గ్రాఫైటిస్, సెపియా అయోడియం, ఫాస్పరస్, బ్రోమియం, సిస్టిక్ కానడెన్సిస్, థెరియాడన్ మందుల్ని వైద్య పర్యవేక్షణలో లక్షణాల్ని బట్టి వాడుకోవచ్చు. ప్రివెంటివ్‌గా 8 సంవత్సరాల మగ పిల్లలకి కాల్కేరియతూకార్బ్ 30, ట్యూబర్‌కులినమ్ 300, సైలీషియా 6 ఎక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. 15 సంవత్సరాల మగ పిల్లలకి సైలీషియమా 200, ట్యూబర్‌క్యులినమ్ 200 కాల్కేరియా పాస్ 6 ఎక్స్ మందుల్ని వైద్య పర్యవేఓణలో లక్షణాల్ని బట్టి, వయస్సుని బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. □

# ఉత్పాదకత మెరుగుపడాలని..

**ఉదయం లేచింది మొదలు ఉరుకులు, పరుగులే. పిల్లల్ని స్కూల్‌కి తయారుచేయడం దగ్గర్నుంచీ పెద్దవాళ్లకు అన్నీ సమకూర్చేదాకా ఒకటా రెండా ఎన్ని పనులో ఇవికాక కెరియర్‌లో రాణించాలన్న తపన మరోవైపు. వీటనిననంటి మధ్యా రోజెలా గడిచి పోతుందో కూడా తెలియదు. ఇది సరిపోదని ఉత్పాదకత మెరుగుపడాలంటే పని గంటల్ని పెంచాలంటున్నారు కొందరు ప్రముఖులు. ఇందుకు తమ జీవితాల్నే ఉదాహరణగా చెబుతున్నారు. దీనివల్ల ఒత్తిడి మరింత పెరుగుతుందే తప్ప, ఉపయోగం ఉండదు అంటోందీ తరం.**

ఇప్పటి పరిస్థితుల్లో రోజులో 10 గంటలు వృత్తిగత జీవితానికి కేటాయిస్తున్న వారే అధికం. అవసరాలరీత్యా ఇంతకన్నా ఎక్కువసేపు పనిచేసే మహిళలూ లేకపోలేదు. సెలవు రోజుల్లోనూ ఇంటి దగ్గరనుంచీ సేవలందిస్తున్నారు. దీనికితోడు ప్రత్యేకించి మరీ పనిగంటల్ని పెంచితే... ఒత్తిడి పెరిగి శారీరక, మానసిక సమస్యలు ఎక్కువవుతాయి. అందుకే దీనికి బదులు సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వమంటోందీ తరం. ఇష్టంతో చేస్తే ఎంత పనైనా త్వరగా అయిపోతుంది. అలాంటి వాతావరణాన్ని సృష్టించమంటున్నారు. ఉద్యోగినుల నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా కృషి చేయమంటున్నారు.

✦ మహిళ ఎంత ఉన్నతస్థానంలో ఉన్నా కుటుంబ బాధ్యతల్లో తానే ముందుంటుంది. చిన్నా పెద్దా ఎవరికి బాగోకపోయినా దగ్గరుండి చూసుకోవాలి. దాంతో ఆఫీసుకి సెలవు పెట్టాల్సిన పరిస్థితులూ



ఎదురవుతున్నాయి. దీనివల్ల ప్రమోషన్స్, ప్రాజెక్టులు తీసుకోవడం, లీడర్‌షిప్ లాంటి అంశాల్లో వెనకబడుతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని కొన్ని వెసులు బాటులు కల్పిస్తే వాళ్లూ పురుషులతో సమానంగా ఉత్పాదకతను అందిస్తారు.

✦ ఏ పని పూర్తిచేయాలన్నా ఇప్పటికీ కొన్ని కార్యాలయాల్లో పాత పద్ధతులే ఆచరణలో ఉన్నాయి. వీటివల్ల చాలా సమయం వృథా అవుతోంది. అలాకాకుండా కొత్తవాటినీ, సాంకేతికతనీ అందిపుచ్చుకునే అవకాశాల్ని యాజమాన్యం కల్పించాలి. దీనివల్ల స్మార్ట్‌వర్కింగ్ అలవాటవుతుంది. ఫలితాలూ తొందరగా వస్తాయి. ✦ కార్పొరేట్ ఉద్యోగాల్లో ఉన్నతస్థానాల్లో పురుషులే ఎక్కువ. మహిళలు ఒకవేళ ఉన్నా జీతంలో వ్యత్యాసం ఉంటుంది. ఈ లోపాల్ని సవరించి, నాయకత్వ హోదాలో మహిళల సంఖ్యను పెంచితే ఆయాసంస్థల ఉత్పాదకత ఎక్కువగా ఉన్నట్లు ఇప్పటికే పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి ఆ దిశగా దృష్టిపెడితే మేలు అంటోందీ తరం. □

# చైతన్యపరిచే వెలుగు

ఓ బాటసారి నీరసంగా చెట్టు కింద కూర్చుని మంచి ఆహారం దొరికితే బాగుణ్ణు.. నా ఆకలి తీరుతుంది అనుకున్నాడు. వెంటనే రుచికరమైన ఆహారం వచ్చింది. తృప్తిగా తినడంతో నిద్ర ముంచుకొచ్చింది. మంచి ఉంటే బాగుండు అనుకున్నాడు. పట్టు పాన్పు ప్రత్యక్ష మయ్యింది. ఆత్మీయనేస్తం చెంతనుంటే బాగుంటుంది. అనుకున్నాడు. అది కూడా నెరవేరింది. ఇదేం మాయ? కోరుకున్నవన్నీ లభిస్తున్నాయి. ఈమె మంచిదేనా? దెయ్యమై నన్ను భయపెడితే? అనుకున్నాడు. అంతే అందాకా స్నేహంగా ఉన్న స్త్రీ కాస్తా వికృతంగా మారడంతో వణికిపోయాడు. నిజానికి అతడు సేదతీరిన చెట్టు ఆశలు తీర్చే కల్పవృక్షం. అది తెలియక ప్రాణం కోల్పోయాడు.

కల్పవృక్షాన్ని వెతుక్కుంటూ వెళ్లనవసరంలేదు. మనసులో స్థిరంగా ఉంటే ఆశలు రూపుదాలుస్తాయి. అదే కల్పవృక్షం అన్నారు మహర్షులు. బలమైన భావ తరంగాలకు అనంత శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. మన ఆలోచనలు మంచిగా ఉంటే పాజిటివ్ ఎనర్జీ, చెడుగా ఉంటే నెగెటివ్ ఎనర్జీ. మనమంతా కావలసిన దానికోసం ఆశపడతాం. కానీ అది దక్కుతుందా లేదా అనే భయం, అపనమ్మకం కలుగుతుంటాయి. వ్యతిరేక భావాలను పారదోలి అనుకూలతను పెంచుకుంటే అవి గొప్ప శక్తినిస్తాయి. అందుకే నిరంతరం మంచి పనులే చేయాలి. సద్భావనలను సదా ధ్యానించాలి. దైవమంనే భావన కల్పితం కాదు. అది ఆశలకు స్ఫూర్తి కేంద్రం. మనోసీమలను చైతన్యపరిచే వెలుగు. దైవాన్ని మదిలో నిలుపుకుంటే చెడుకు తావుండదు. □

ఆధ్యాత్మికం

# పానీపూరీ ఎప్పుడంటే అప్పుడే..



**పానీపూరీ మనందరికీ చాలా ఇష్టమైన** స్ట్రీట్ ఫుడ్, రోజూ తిన్నా విసుగేయదు. మరి పానీపూరీ వీధుల్లోనే ఎందుకు తినాలి? దుమ్ముధూళీ లేకుండా ఇంట్లోనే తింటే బాగుంటుంది కదూ! పూరీల ప్యాకెట్ కొనుక్కోవచ్చు కానీ.. పానీ ఎలా అనుకుంటు న్నారా? అదేం కష్టం కాదు, తేలిగ్గా ఇంట్లోనే చేసుకోవచ్చు. ఎలా గంటారా... రెండున్నర టేబుల్ స్పూన్ల ఎండిన పుదీనా ఆకుల పొడి, రెండు టేబుల్ స్పూన్ల వేయించిన జీలకర్ర, చెంచా చొప్పున మిరియాల పొడి, సైంధవ లవణం, ధనియాల పొడి, అర చెంచా చొప్పున శొంఠి పొడి, ఆమ్చూర్ పౌడర్, పంచదార, కాస్త ఇంగువ, చిటికెడు సిట్రిక్ యాసిడ్ క్రిస్టల్స్‌ను తీసుకోవాలి. వీటన్నిటినీ కలిపి గ్రైండ్ చేస్తే చాలు ఘుమఘు మలాడే పానీపూరీ మసాలా తయారై పోతుంది. పొడి మాత్రం బరకగా లేకుండా చాలా మెత్తగా ఉండాలి. లేదంటే సరిగ్గా కలవదు. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే పానీపూరీ తినదలచినప్పుడు కప్పు నీళ్లల్లో అర చెంచా చొప్పున కలిపితే సరిపోతుంది. □



# నేవీ బ్యాండ్‌లో మహిళా అగ్నివీర్‌లు



**గణతంత్ర దినోత్సవ వేడుకల్లో** భారత్ మరోసారి స్త్రీ శక్తిని చాట నుంది. ఈ సందర్భంగా 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 144 మంది సిబ్బందితో నావికాదళం మినీ ఇండియాకు నాయకత్వం వహిస్తోంది. ఇందులో 80 మందితో కూడిన నేవీ బ్యాండ్‌లో ఆరుగురు మహిళా అగ్నివీరులు ఉన్నారు. సంప్రదాయ అడ్డంకులను దాటి వీరు తొలిసారి తమ ప్రదర్శన ఇవ్వనున్నారు. □

# 'తండేల్' అంచనాలకు మించి సర్ ప్రైజ్ చేస్తుంది

## -హీరో నాగచైతన్య



**యువ సామ్రాట్** అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలు వున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగావిడుదల కానుంది. ఈ సందర్భంగా టీం ప్రీరిలీజ్ క్యూ అండ్ ఏ ప్రెస్ మీట్ నిర్వహించింది.

**చైతన్య మీ సినిమా పై చాలా అంచనాలు వున్నాయి. ఈ సినిమా కోసం ఫ్యాన్స్‌కి ఏం చెబుతారు?**
మేమంతా సినిమాచూశాం. చాలాపాజిటివ్‌గా హ్యాపీగా వున్నాం. చివరి ముప్పై నిముషాలు సినిమా పీక్స్‌లో వుంటుంది. అంచనాలుకు మించి సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ పాలి యేట గురితప్పేలేదు. రేపొద్దున్న రాజులమ్మ జాతరే.

**చైతన్య మీ నాన్న సినిమా చూశారా?**
నాన్న సినిమా చూశారు. ఆయనకి చాలా నచ్చింది. ఆయన డేట్స్ తెలుసుకుంటున్నాం. సక్సెస్ మీట్‌కి తీసుకువెళ్తాం.

**అరవింద్ మీరు ఈ సినిమా కథ ముందు విన్నప్పుడు కొన్ని మార్పులు చెప్పారట?**
ముందు కథ విన్నప్పుడు ఫస్ట్ హాఫ్ అదిరిపోయింది. సెకండ్ హాఫ్ డాక్యుమెంటరీ నేచర్‌లో వుంది. అందుకని కథ కొని రైటర్ డైరెక్టర్‌కి ఇస్తే బావుంటుదని అనుకున్నాం. అలాగే జైలుకి వెళ్ళిన 30మందిని స్వయంగా కలిసి వారి నుంచి రైట్స్ తీసుకున్నాం.

**అరవింద్ ఈ సినిమా స్వయంగా మీరే రిలీజ్ చేయడానికి కారణం?**
మా కంట్రోల్ లేని ఏరియాల్లో బయటికి ఇస్తాం తప్పితే మిగతా అంతా మేమే రిలీజ్ చేస్తాం, లాభం, నష్టం మేమే భరించడం గీతఆర్ట్స్‌పాలసీ. మేముతీసిన సినిమా మీద మాకు నమ్మకం. మేము అనుకున్న దానికంటే ఈ సినిమాకి ఎక్కువ ఖర్చు అయ్యింది. వాసు వచ్చి అమ్మేద్దామా అన్నారు. ఏం పర్వాలేదు మనమే రిలీజ్ చేస్తున్నామని చెప్పా. తండేల్‌లో మోస్ట్ సర్ ప్రైజ్ చైతు పెర్ఫార్మెన్స్. సినిమా సూపర్ హిట్. నేను 4.5 స్టార్స్ ఇస్తాను. రేపు మార్నింగ్ దుల్లకొట్టేద్దాం.

**చందు..ఇది జరిగిన కథ. స్క్రీన్ ప్లే పరంగా ఎలాంటి ఛాలెంజ్ వచ్చింది ?**
ఈ ప్రేమకథలోని బ్యూటీ దూరం, ఎడబాటు. తొమ్మిది నెలలు ఓ మనిషి కోసం ఎదురుచూపు, ఆ మనిషి తనకోసం వస్తాడమే నమ్మకం.. ఇలా చాలా బ్యూటీఫుల్ ఎమోషన్ ఈ సినిమాలో వుంది.

**చందు,చైతు సాయిపల్లవి ఈ ఇద్దరిలో ఎవరి పెర్ఫార్మెన్స్ బావుటుంది?**
ఈ సినిమా చూసి బయటికి వచ్చిన తర్వాత ఎవరు బాగా చేశారనే డిబేట్స్ వుంటాయి. నన్ను అడిగే రాజు పాత్ర అని చెబుతా.

**చందు.. ఇందులో వుండే ఎమోషన్ మణిరత్నం రోజా సినిమా అనిపించాయి ?**
మీకు అలా అనిపించిందంటే ఐయాం సో హ్యాపీ. అందులో ఎమోషన్ కూడా వుండి అంతకు మించి వుంటాయి.

**చైతు..ఈ సినిమాలో మీరు ఫీలైన ఎమోషన్ ఏమిటి?**
ఈ సినిమా ప్యూర్ లవ్ స్టోరీ. రాజు సత్య ప్రేమ తర్వాతే ఏదైనా. ఈ సినిమాలో డ్యాన్స్‌పరంగా పల్లవి నేను లవ్ స్టోరీకంటే ఒక స్టెప్ పైకివెళ్లాం. శివుని పాట థియేటర్స్‌లో మీరు చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.

**అరవింద్ అప్పట్లోనే 45 కోట్లు పెట్టి మగధీర సినిమా తీశారు ఇప్పుడు వందల కోట్లు పెట్టి సినిమాలు చేస్తున్నారు ? ఇంత ధైర్యం ఎలా వస్తోంది?**
అప్పటికి 40 కోట్లు ఈ రోజు ద్రవ్యోల్బణం తీసుకుంటే సుమారు 350 కోట్లు అవుతుంది. ఈ రోజుల్లో ఇంత బడ్జెట్‌తో సినిమాలు అందరూ తీస్తున్నారు. ఈ రోజు తెలుగు సినిమా నిర్మాత అంటే తలెత్తి చూస్తున్నారు. దీనికి కారణం అలాంటి సినిమాలు చేయగల హీరోలు, దర్శకులు తెలుగులో వున్నారు. ఇది తెలుగు వారి విజయం. గీత ఆర్ట్స్ పై రానున్న రోజుల్లో మచ్ బిగ్గర్ ఫిలిమ్స్ వస్తాయి. లిరిక్ రైటర్ శ్రీమణి మాట్లాడుతూ, సినిమా పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ఆజాది పాట కూడా అద్భుతంగా వుంటుంది. సాహిత్యానికి గొప్ప స్థానం వున్న సినిమా ఇది. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అన్నారు.

## 'డాన్ బోస్కో' చిత్రీకరణ ప్రారంభం..



**సైమా అండ్ ఎహెచ్ఎం** అవార్డులలో ఉత్తమ డెబ్యూటెంట్ ప్రొడక్షన్ హౌస్ అవార్డును అందుకున్న ఎమర్జింగ్ ప్రొడక్షన్ హౌస్ లౌక్య ఎంటర్టైన్మెంట్స్, శ్రీ మాయ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పనేని, శైలేష్ రామ నిర్మిస్తున్న మూవీ "డాన్ బోస్కో". కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు పి.శంకర్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో మూవీ చిత్రీకరణ ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు నిర్మాత సాహు గారపాటి కెమెరా స్విచ్ ఆన్ చేయగా ..చుక్కపల్లి సురేష్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా మూవీ టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదలచేశారు. పోలీస్ స్టేషన్‌లోని మోస్ట్ వాంటెడ్ బోర్డు ఇంట్రెస్టింగా ఉంది. ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌గా మురళీశర్మ కీలక పాత్ర పోషిస్తున్నారు. లెక్చరర్ సుమతిగా మిర్నా మీనన్ నటిస్తున్నారు.'డాన్ బోస్కో' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. 'వెల్‌కమ్ టు ది క్లాస్ రీయూనియన్‌బ్యాచ్ 2014', 'అన్ని రీయూనియన్లు జ్ఞాపకాల కోసం కాదు; కొన్ని విముక్తికి సంబంధించినవ్విఅంటూ పోస్టర్‌పై రాసిన క్యాప్షన్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## 15 న తలసేమియా బాధితులకు సహాయార్థం

# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్



**తలసేమియా** బాధితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసాము. ప్రతి టికెట్‌పై వచ్చే రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తాం. అడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి. ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యంలో ఫిబ్రవరి15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది.

ఈ సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మాట్లాడుతూ, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే స్ఫూర్తితో ఎన్టీఆర్ ట్రస్ట్ నడుస్తుంది. జెనిటిక్ డిసార్డర్ తలసేమియాతో చాలామంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఈ వ్యాధి వున్న వారు ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేట్ చేస్తే చాలా మంది జీవితాలు నిలబడతాయి. తలసేమియా బాధితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటుచేసాము. ప్రతి టికెట్‌పైవచ్చే రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తాం. తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్‌కి వస్తా అన్నారు. తమన్ ఈ షో ఫ్రీగా చేస్తా అని గొప్ప హృదయంతో చెప్పారు. సమాజ సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేయాలి. మనం వెళ్ళేటప్పుడు మన వెంట డబ్బు రాదు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తే అందరికి గుర్తు ఉంటుంది. ప్రతి ఒక్కరు కొనే టికెట్ సమాజ సేవకే ఉపయోగపడుతుంది, బుక్ మై షోలో టికెట్స్ అవైల్ బుల్‌గా వుంటాయి. ప్రతి ఒక్కరూ టికెట్ కొనుక్కొని కుటుంబ సమేతంగా వచ్చి ఈ కారక్ర్యమం విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను. ఆడియన్స్ ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ, చాలా మంచి ఆలోచనతో మొదలైన కార్యక్రమం ఇది. ఈ షో నేను చేయడం చాలా సంతోషంగా ఉంది. నారా భువనేశ్వరి గారి ఆలోచన చాలా గొప్పది. తలసేమియా బాధితులకు సహాయం కోసం అని చెప్పగానే నేను వెంటనే ఈ కార్యక్రమంకి వస్తా అని చెప్పాను. భువనేశ్వరి నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం నా చేతిలో పెట్టారు. ఎపి సిఎం చంద్రబాబు రాష్ట్రం కోసం పగలు రాత్రి పని చేస్తున్నారు. టికెట్‌పై పెట్టె ప్రతి రూపాయి తలసేమియా భాదితులకు వెళ్తుంది. ఈ షో చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఈ షోని సూపర్ సక్సెస్ చేసే బాధ్యత మన అందరిపై వుంది. ఇది బిగ్గెస్ట్ షో కాబోతోంది అన్నారు .




# '3 బిహెచ్‌కె' ఫస్ట్ లుక్ టైటిల్ టీజర్ రిలీజ్



**సిద్ధార్థ్ హీరోగా** గణేష్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హిట్ చిమావీరన్ష్ నిర్మాత అరుణ్ విశ్వశాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు సినిమా ఫస్ట్ లుక్ టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 3 బిహెచ్‌కె అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటీఫుల్ ఫ్యామిలీగా కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. 'ఇది మన ఇంటి కథ ఈ ఇంట్లోనే చిన్న చిన్నగా చాలా కథలు వున్నాయి. ఇది మసాల డబ్బా కాదు. అమ్మచిన్న బ్యాంక్. ఇది నాన్న సెంటిమెంటు బీరువ్వా అంటూ సిద్ధార్థ్ వాయిస్‌తో మొదలైన టైటిల్ టీజర్ ఫీల్ గుడ్ మూమెంట్స్‌తో చాలా క్యూరియాసిటీని పెంచింది. సిద్ధార్థ్ కూల్ అండ్ చార్మ్‌లుక్‌తో ఆకట్టుకున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు ప్రజెన్స్ కూడా అలరించింది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందుతోందని టీజర్ చూస్తే అర్ధమోతోంది.

## దినేష్‌మహీంద్ర దర్శకత్వంలో ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ!



**ఎన్.శంకర్..** ఈ పేరు వినగానే అందరికి శ్రీరాములయ్య, ఎన్‌కౌంటర్, జయం మనదేరా, భద్రాచలం, జై భోలో తెలంగాణ వంటి సంచలన విజయాలు సాధించిన చిత్రాలు మన కళ్ల ముందు మెదులుతాయి. అప్పట్లో ఈ చిత్రాలు ఎలాంటి ప్రేక్షకాదరణ పొందాయో అందరికి తెలిసిందే. తాజాగా ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ తనయుడు దినేష్‌మహీంద్ర తండ్రి బాటలో దర్శకత్వ ప్రతిభను నిరూపించుకోవడానికి రెడీ అయ్యాడు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ విభాగంలో శిక్షణ పొంది, స్క్రీన్‌ప్లే విషయంలో పలు కోర్సులను పూర్తిచేశాడు దినేష్‌మహీంద్ర. త్వరలోనే దినేష్‌మహీంద్ర దర్శకత్వంలో ఓ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ రూపుదిద్దుకోబోతుంది. నూతన తారలతో పాటు నూతన టెక్నిషియన్లను పరిచయం చేస్తూ యూత్‌ఫుల్ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ చిత్రాన్ని 'ఆరెక్స్ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తుంది..షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పాటల రికార్డింగ్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తారు.

# ఆద్యంతం ఆకట్టుకునేలా'లైల్లా ట్రైలర్



**మాస్ కా దాస్** విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైల్లా. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ సినిమాలో లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు క్రియేట్ అయ్యాయి. సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో చేస్తున్న టీమ్ తాజాగా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఏ మాల్‌గా చాలా గ్రాండియర్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేసి ఆడియన్స్‌లో మరింత హైప్ పెంచేసింది. ఈ ట్రైలర్ ఆద్యంతం ఫన్ రైడ్‌గా ఉంది. లేడీ పాత్రలో విశ్వక్ సేన్ చేసే అల్లరి థియేటర్లలో ప్రేక్షకులు పడిపడి నవ్వేలా చేస్తుందనడంలో సందేహం లేదు. అటు హీరోయిన్ ఆకాంక్ష శర్మ తన గ్లామర్ షోతో యూత్‌ను ఆకట్టుకోనుంది. లియోన్ జేమ్స్ సంగీతం మేజర్ అసెట్‌గా రానున్న ఈ సినిమాపై ఈ ట్రైలర్ అంచనాలను రెట్టింపు చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ,ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ఫిబ్రవరి 14న అందరూ థియేటర్లలో కలుద్దాం. అని చెప్పారు. అనంతరం మీడియా అడిగిన ఆసక్తికర ప్రశ్నలకు టీమ్ సమాధానాలిచ్చారు.

**లైలా టార్గెట్ ఏంటి? ఎంటర్‌టైన్‌మెంట్‌యేనా?**
పూర్తిగా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది.

**సినిమా సెన్సార్ అయింది కదా? రిపోర్ట్ ఏం వచ్చింది?**
నేను ఈ సినిమాలో లేడీ గెటప్ వేసింది ఎంటర్‌టైన్ చేయడానికి. మా ఇంటెన్షన్ కేవలం మిమ్మల్ని నవ్వించడమే. అందులో భాగంగానే కొన్ని డైలాగ్స్ ఉన్నాయి.

**విశ్వక్ ఈ సినిమాకు సంబంధించి మీకు కష్టమనిపించింది ఏంటి?**
సాయంత్ర పూట ఇంట్లో ఒక్కడినే ఉండడం కష్టం అయింది. ప్యాంట్, షర్ట్ వేసుకుని ఈ గెటప్‌లో బయటకు వెళ్లడం కుదరలేదు. ఈ గెటప్ కోసం రోజూ రెండు గంటలు పట్టేది.

**కామాక్షి ఈ సినిమాలో మీ రోల్ ఏలా ఉంటుంది?**
ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అందుకే టీజర్, ట్రైలర్‌లో ఎక్కడా చూపించలేదు. కామాక్షి అంటే చాలా ఇంటెన్స్ రోల్స్ చేస్తుందనే మార్క్ ఉంది. ఆ మార్క్‌కు తగ్గట్లే ఇందులో నా పాత్ర ఉంటుంది. ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ రామ్ నారాయణ్‌దే.

**భానూ విశ్వక్ సేన్‌తో మీ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**
ఈ సినిమాలో అన్ని పాటలు నేను చేశాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన విశ్వక్‌కి థ్యాంక్స్. ఫస్ట్ సాంగ్ సోనూ మోడల్ పెద్ద హిట్ అయింది. అలాగే లాస్ట్ సాంగ్ కోయి కోయిని కూడా హిట్ చేశారు. ప్రతి సాంగ్ సందర్భానుసారం ఉంటుంది. సినిమా మొత్తం బ్లాక్‌బస్టర్‌గా ఉంటుంది.

# 'మోగ్లీ 2025' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం



**తన తొలి చిత్రం** 'బబుల్ గమ్'తో అందరినీ ఆకట్టుకున్న రోషన్ కనకాల తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. సహజమైన నటన ఫ్రెష్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అలరించిన రోషన్ ఇప్పుడు కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన 'మోగ్లీ 2025' చిత్రంలో నటిస్తున్నారు. కలర్ ఫోటోతో జాతీయ అవార్డును గెలుచుకుని యంగెస్ట్ దర్శకుడిగా గుర్తింపు పొందిన సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్, ఫస్ట్ లుక్‌తో ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపింది. విభిన్నమైన కథనాలకు పేరొందిన సందీప్ రాజ్ రోషన్‌ను కొత్త కోణంలో చూపించనున్నారని చిత్ర పరిశ్రమలో మంచి అంచనాలు ఉన్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కాంటెంపరరీ లవ్ స్టోరీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై గిబి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

మోగ్లీ తర్వాత రోషన్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 2025 రెండో అర్ధభాగంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. కథల ఎంపిక విషయంలో ఆయన చూపుతున్న చిత్తశుద్ధి సంఖ్య కంటే నాణ్యతను ప్రాధాన్యమిస్తూ సాగే ఆయన నిర్ణయాలు సినిమాపై ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తున్నాయి. ప్రముఖ నటుడిగా ఎదుగుతున్న రోషన్ కనకాల ఒక్కొక్క అడుగుగా తనదైన ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నాడు. ప్రతీ చిత్రంతోనూ కేవలం వారసత్వాన్ని కొనసాగించడం కాదు తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును కూడా సొంతం చేసుకుంటున్నాడు.



# 'తెలుసు కద్లా పోస్టర్ రిలీజ్

**స్టార్ బాయ్** సిద్ధు జొన్నలగడ్డ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు, ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'తెలుసు కద్లా నుండి ఒక బ్రాండ్ న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సిద్ధు తన మోస్ట్ స్టైలిష్ అవతార్ లో అదరగొట్టారు.

బర్త్ డే స్పెషల్ పోస్టర్‌లో, సిద్ధు, శ్రీనిధి శెట్టి మధ్య రొమాంటిక్ మూమెంట్, మరో సైడ్ రాశి ఖన్నా నుదిటిపై ముద్దు పెడుతూ కనిపించారు. పోస్టర్ ఇద్దరు అమ్మాయిలతో హీరో ప్రేమకథను ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీని క్రియేట్ చేసింది.

ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న మూవీ 'తెలుసు కద్లా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి జ్ఞానశేఖర్ బాబా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న ప్రొఫెషనల్ నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైనర్.

# ట్రంప్‌కు భయపడుతున్న విశ్వగురువు




శుక్రవారం గాంధీభవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి విహెచ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, షబ్బీర్‌అలీ తదితరులు

## ఇజ్రాయెల్ యుద్ధం ఆపిన మోడీ వలసవెళ్లిన భారతీయుల ఇక్కట్లను ఆపలేరా?: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విశ్వగురువుగా ప్రచారం చేసుకొంటున్న భారత ప్రధానమంత్రి భయపడుతున్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడతూ విదేశాంగ మంత్రి జై శంకర్‌కు దమ్ము లేదు, విదేశాంగ మంత్రి పూర్తిగా విఫలమయ్యారు అని ఆవేదన చెందారు. విశ్వ గురువులు భయపడుతారా?కానీ ఏం బలహీనతో ట్రంప్ కి మోదీ భయపడుతున్నారు అని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ దాడులను ఆపేవాళ్ళు అమెరికాలో ఉన్న మనవాళ్ళని తీసుకురాలేరా? అని ప్రశ్నించారు. ట్రంప్ అమెరికా ప్రెసిడెంట్ అయ్యాక ఇండియాకి ఇబ్బంది ఉండదని ప్రచారం చేసారని గుర్తుచేసుకున్నారు. సరైన పత్రాలు లేని104 మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం గుర్తించి ఇండియాకు పంపిందని ఆయన తెలిపారు. ఛార్జ్ తీసుకున్నాక ట్రంప్ ఆయన ఫారిన్ పాలసీ క్లియర్ గా చెప్పాడు. అమెరికా కాళ్ళకు చేతులకు సంకెళ్లు వేసి 104 మందిని టెర్రరిస్టుల లాగా తీసుకువచ్చిందని ఆయన వివరించారు. కుంభమేళాను చూపిస్తున్న మోదీ మీడియా 104 మంది పరిస్థితిపై మాట్లాడడం లేదని అన్నారు. మోదీకి ప్రపంచమంతా బయపడుతని బీజేపీ వాళ్లు డబ్బా కొడతారు కానీ దానికి భిన్నంగా జరుగుతోన్నది. ఇజ్రాయెల్ యుద్ధం అపగలిగిన మోదీ అమెరికాలో ఇబ్బంది పడుతున్న వాళ్ళని క్షేమంగా తీసుకరాలేకపోతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు విదేశాల్లో ఉన్న జైళ్ల నుండి44,000 మంది ని తెలుగు రాష్ట్రానికి తీసుకువచ్చామని షబ్బీర్ గుర్తుచేసుకొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకున్నామని నెమరేసుకొన్నారు. మా హిస్టరీ చూసి కేంద్ర ప్రభుత్వం నేర్చుకోవాలని షబ్బీర్ అలీ హితవు చెప్పారు.

**వలసదారులకు సంకెళ్లు వేయడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**

అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం అమనవీయంగా, అవమానకరంగా కాళ్లకు, చేతులకు బేడీలు వేసి ఇండియా పంపిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఫిరోజ్‌ఖాన్ నేతృత్వంలో శుక్రవారం గాంధీ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్, మాజీ ఎంపీ విహెచ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆధ్వర్యంలో నిరసన చేతులకు బేడీలు వేసుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావ్, టీపీసీసీ. సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్ రావ్ తదితరులు పాల్గొన్నారు. అమెరికా నుంచి భారత పౌరులను నిర్దాక్షిణ్యంగా బేడీలు వేసి బలవంతంగా తరలిస్తుండడం భారత విదేశంగా మంత్రిత్వ శాఖ వైఫల్యంగా చూడాలని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత పౌరులకు బేడీలు వేసి అమెరికా నుంచి పంపిస్తున్న చలనం లేనట్లు కేంద్రం వ్యహరిస్తుందని దుయ్యబట్టారు. అమానవీయ ఘటనకు మోదీ, బీజేపీ సిగ్గు పడాలి అని ఆరోపించారు. అమెరికాకు గులాంగిరి బంద్ ఖరో అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు.



మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి తదితరులు

# మల్లు అనంతరాములుకు నివాళులర్పించిన సిఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** పిసిసి మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా రెండుసార్లు ఎన్నికైన మల్లు అనంతరాములు ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీప్‌దాస్‌మున్షీ, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్టీసి యాజమాన్యం, కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ చర్చలు

**10న లేబర్ కమిషనర్ ఆఫీసులో భేటీ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఆర్‌టీసీ సంస్థని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు.. ఆర్‌టీసీ పరీరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం గత నెల జనవరి 27న ఆర్‌టీసీలోని కొన్ని సంఘాలు జేఏసీ పేరుతో సమ్మె నోటిస్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమ్మె నోటీసు ఇచ్చిన సంఘాలతోనూ అలాగే ఆర్‌టీసీ యాజమాన్యంతోనూ చర్చలు జరపడానికి కార్మిక శాఖ సిద్ధ పడింది. సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ సంఘాలతోపాటు యాజమాన్యంతో లేబర్ కమిషనర్ ఈ నెల 10(సోమవారం)న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్(అంజయ్య భవన్)లో చర్చలు చేపట్టనుంది. చర్చలకు సంబంధించి హాజరు కావాలని జేఏసీ యూనియన్లకు ఆర్‌టీసీ ఎండీకి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శుక్రవారం లేఖలు రాసినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్‌టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్‌టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణ చేయాలని కోరుతూ సమ్మె నోటీసును జేఏసీ అందజేసింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నోటీసులో పేర్కొంది.



కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

## బిసిల బడ్జెట్‌ను 2 లక్షల కోట్లకు పెంచండి

**కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కేంద్రంలో బిసిల బడ్జెటు 2లక్షల కోట్లకు పెంచాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను కేంద్రమంత్రికి వివరించారు. పీయూష్ గోయల్ స్పందిస్తూ బీసీల డిమాండ్ న్యాయమైనవని సంఘం ఇచ్చిన డిమాండ్లపై ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. ఇప్పటికే కేంద్రం లో 27 మంది బీసీలకు కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడం జరిగిందని ఆరు మంది గవర్నర్లను, జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చామని. బీసీల రిజర్వేషన్లను ఎ,బి,సి,డి వర్గీకరణకు కమిషన్ నియమించాం. ఇక తొందరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని, బీసీలకు పెద్ద ఎత్తున బడ్జెట్ పెంచుతామని హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బోను దుర్గ నరేష్, క్రరి వేణుమాధవ్, రాజునేత, మనికంఠ, బీమారపు సురేష్ తదితరులు ఉన్నారు.

## పోలీసుల అదుపులో కీచక ఉపాధ్యాయుడు




పోలీసుల అదుపులో నిందితుడు కృష్ణయ్య

**ధారూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గత సంవత్సరం డిసెంబరు 13న ధారూర్ స్టేషన్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయుడుపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఇప్పటివరకు పరారీలో ఉన్న ఉపాధ్యాయుడు పెద్దగొల్ల కృష్ణయ్యను శుక్రవారం ధారూర్ పోలీసులు వికారాబాద్‌లో అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు ధారూరు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

## రిజర్వేషన్‌ల పరిరక్షణకు బిజెపి పోరాడాలి

**పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిజెపి కి రిజర్వేషన్ ఇవ్వాలని లేదని రిజర్వేషన్ పరిక్షణకోసం బీజేపీ మీద పోరాటం చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీ భవన్‌లో వి. హనుమంత రావు మాట్లాడుతూ కులగణన చేసి బీసీలకు మేము న్యాయం చేస్తున్నామని అన్నారు. సూర్యాపేట లో రాహుల్ గాంధీ తో సభ పెడుతున్నామని తెలిపారు. ఎస్సి రిజర్వేషన్ చేసినందుకు గజ్వేల్ లో మలికార్జున ఖర్గే తో సభ పెడుతున్నాం అని ఆయన వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ పక్షపాతి అని విహెచ్ ధృవీకరించారు. సూర్యాపేట, గజ్వేల్ సభకు నా పూర్తి మద్దతు ఉంటుంది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన జరగాలని అసెంబ్లీ లో బిల్ పెట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తో సూర్యాపేటలో సభ పెడితే 2లక్షల మంది వచ్చారని గతంను నెమరేసుకున్నారు.

# వ్యవసాయ వర్సిటీకి అమెరికా ఆబర్న్ వర్సిటీ బృందం

**ఉపకులపతి ఆల్దాస్ జానయ్య.. పలు అంశాలపై ప్రతినిధి బృందం చర్చ**



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం

**అత్తాపూర్ ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికల్ని రూపొందిస్తున్నామని ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య అన్నారు. అందులో భాగంగా అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం అయిన ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం శుక్రవారం ఉపకులపతి ఆల్దాస్ జానయ్య మరియు ఇటీవల నియమితులైన పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ అధికారులతో పిజెటీఎయూ పరిపాలన భవనంలో సమావేశం అయింది. అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకుని బోధన, పరిశోధన తదితర రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జానయ్య ఆ బృందానికి తెలిపారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రానికి చెందిన ఈ ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్ నేతృత్వంలో ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్యతో సమావేశం అయ్యి అనేక అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ ఎం . రఘునందన్ రావు, ఐఏఎస్ గతేడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరేలా చేశారని జానయ్య అన్నారు. తద్వారా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఆబర్న్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడానికి వెళ్లారని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పిజెటీఎయూ నుంచి ఆబర్న్ విశ్వ విద్యాలయంతో పాటు ఇతర ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలకి 8 10 మంది విద్యార్థుల్ని పంపించడానికి అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఉపకులపతి తెలిపారు. అదేవిధంగా ఎం ఎస్ సి విద్యార్హతతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు కూడా పి హెచ్ .డి పూర్తి చేసి సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభ, సామర్థ్యాన్ని పెంపొందించుకొని మరల ఇక్కడే పనిచేసే అవకాశాలని పరిశీలిస్తామని ఆల్దాస్ జానయ్య తెలిపారు. తర్వాత రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆబర్న్ విశ్వవిద్యాలయ బృందం ప్రతినిధులు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఆబర్న్ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ప్రక్రియ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి .ఈ .సి హెచ్ . విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం . బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం . యాకాద్రి, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కె .బి ఈశ్వరి, విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం సంచాలకులు డాక్టర్ వి . రాములు, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ జమునా రాణి, ఆబర్న్ విశ్వవిద్యాలయ డైరెక్టర్ డాక్టర్ షీనా స్టీవార్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వృషాంక్ రాఘవ్, డీన్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ అండ్ ఎన్విరాన్మెంట్ డాక్టర్ జానకి అలవలపాటి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ కన్నన్ లు పాల్గొన్నారు.

# మూడు గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణ

**బిజెపి, బిఆర్ఎస్ వర్గీకరణను అడ్డుకొన్నాయి**

**ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ఆదేశాలతో వేసిన ఏకసభ్య కమీషన్ జస్టిస్ షామిమ్ అక్తర్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణలో మూడు గ్రూపులుగా ప్రభుత్వం విభజించిందని ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడతూ ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకు న్నామని తెలిపారు. 2011 జనాభా లెక్కలు ప్రభుత్వ అధికారిక లెక్కలు కావడంతో వాటిని ప్రామాణికంగా తీసుకోవడం సరైన నిర్ణయం అని ఆయన సమర్థించుకున్నారు.సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు వేసిన ఏకసభ్య కమీషన్ నివేదికకు అనుగుణంగా మూడు గ్రూపులు విభజించారని ఇందులో సిఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి రాజనర్సింహాకు ఏ దోషం ఆపాదించ కూడదని ఆయన హితవు చెప్పారు.మాల సామాజిక వర్గంతో పోల్చితే మాదిగల జనాభా డబుల్ ఉందని తెలిపారు.గ్రూప్ -2లోని కులాలకు 11శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా9 శాతం రిజర్వేషన్ ఎందుకు కేటాయించారు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని సంపత్ అభిప్రాయపడ్డారు .ఉమ్మడి ఆంధ్రనరపదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే 59 ఎస్సీ కులాలను ఎబిసిడిగా వర్గీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహార్ కమిటీ వేసింది.ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఉదృతం కావడం. తెలంగాణ ఏర్పాటు కావడం కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం జరిగిందని చరిత్రను సంపత్ నెమరేసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ, బిఆర్ఎస్ లు వర్గీకరణ ను అడ్డుకున్నాయి. కాంగ్రెస్ తెలంగాణ లో అధికారంలోకి వచ్చాక.. సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏకసభ్య కమిషన్ వేసి నివేదిక ఆధారంగా మూడు గ్రూపులు రేవత్ ప్రభుత్వం చేసింది.ఆంధ్రప్రదేశ్ తో విడిపోయాక కొన్ని కులాలు తెలంగాణ లో లేవు కాబట్టి మూడు గ్రూపులు గా చేశారని ఆయన వివరణ ఇచ్చుకున్నారు. .గ్రూప్ 1 కి 1శాతం, గ్రూప్2 కి 9శాతం, గ్రూప్ 3 కి 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని ఆయన చెప్పారు. గ్రూప్ 1 లో 15 కులాలు ఉన్నాయి.గ్రూప్ 2 లో 18 కులాలు ఉన్నాయి. గ్రూప్ 3 లో 26 కులాలు ఉన్నాయి. 33.96 శాతం మాత్రానే ఎస్సీ జనాభాలో ఉన్నారు ఏ ఒక్క కులానికి ఇచ్చిన రిజర్వేషన్ కాదు ఇది అని ఆయన స్పష్టం చేశారు. ఆ గ్రూప్ లో ఉన్న అన్ని కులాల కు వర్తిస్తుంది. గ్రూపు 3లో ఉన్న 5శాతం రిజర్వేషన్ మాలలకు మాత్రమే కాదు అందులో ఉన్న ఇతర కులాల జనాభా 2 లక్షల 44వేల మందికి వర్తిస్తుంది.గ్రూప్ 3 కి కేటాయించిన 9 శాతం లో మాదిగలకు మాత్రమే కాదని ఆయన వివరించారు. అందులో ఉన్న ఇతర కులాల కు కూడా వర్తిస్తుంది.ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదని భరోసా ఇచ్చే ప్రయత్నం సంపత్ చేశారు. ఎవరికి ఎక్కువ న్యాయం కూడా జరగదు.8వేల పైగా జస్టిజ్ షామిమ్ అక్తర్ కమిషన్ కి విజ్ఞప్తులు వచ్చాయి. ఎబిసిడి వర్గీకరణ నుంచి మూడు గ్రూప్ లలో కుదించేందుకు భావ స్వరూప్యతా.. సంప్రదాయాలు కలగాల్సిన కులాలను ఒక్కటి చేశారు.సీఎం రేవంత్ రెడ్డి,దామోదర రాజనర్సింహా లు ఎలా దోషులు అవుతారు.ఎస్సీ వర్గీకరణ చేసిన జస్టిస్ షామిమ్ అక్తర్ గారికి,ప్రభుత్వానికి,సీఎం,సబ్ కమిటీ కి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

# రైతుల బిల్లులు చెల్లింపునకే స్థిరాస్తుల విక్రయాలు

**నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్**



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్ (హయత్‌నగర్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బ్యాంకుల్లో తీసుకున్న అప్పును చెల్లించడంతోపాటు రైతులకు చెల్లించాల్సిన పాలబిల్లుల బకాయిలను చెల్లించి సంస్థను గాడిన పడేసేందుకుకే స్థిరాస్థులను అమ్మడానికి పాలక వర్గం నిర్ణయం తీసుకుందని... సొసైటీ ఛైర్మన్లు తీర్మాణాన్ని ఆమోదించి సహ కరించాలని నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధు సూదన్‌రెడ్డి అన్నారు. హయత్ నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమా వేశంలో ఆయన మాట్లా డుతూ 2014 వరకు లాభాల బాటలో ఉన్న మదర్ డెయిరీ క్రమంగా పదేళ్లల్లో 60 కోట్ల మేర అప్పులో కూరుకు పోయిందన్నారు. సంస్థ లాభాల్లో ఉన్నట్లు చూపుతూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని... ప్రస్తు తం నష్టాల్లో ఉన్నట్లు బ్యాంకులు గుర్తిస్తే మార్టిగేజ్ చేసుకున్న నికర ఆస్తులను వేలం వేసే ప్రమాదం ఉందన్నారు. అప్పుల్లో నుంచి బయట పడేందుకు తప్పని పరిస్థితుల్లో మార్టిగేజ్ చేసిన చిట్యాలోని 29.36 ఎకరాల భూమితో పాటు నకిలేకల్, చండూరులోని స్థలాలను విక్రయించి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చడం, రైతులకు చెల్లిం చాల్సిన పాలబిల్లులను చెల్లించడం, సంస్థకు అవసరమైన మిషనరీ కొనడం చేయడం సముచితమని నిర్ణయించినట్లు తెలిపారు.

**స్థిరాస్తుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలి**

మదర్ డెయిరీ ఢిల్లీ వారితో పాలవిక్రయాల ఒప్పందం రద్దు, కరోనా పరిస్థితుల కారణంగానే గతంలో సంస్థ లాభాల నుంచి నష్టాల బాటలోకి వెళ్లిందని మాజీ ఛైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీ కారణంగా ఎప్పటికపుడు విక్రయాలు తగ్గడంతో నష్టాలు పెరుగుతూ వచ్చాయన్నారు. స్థిరాస్థి విక్రయాలకు బదులుగా దిద్దుబాటు చర్యలు తీసుకుని సంస్థను గాడిన పెట్టాలని సూచించారు. సొసైటీ ఛైర్మన్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ మాట్లా డుతూ... నష్టాలను పూడ్చుకోవడానికి ఆస్తులను విక్రయించడంపై తమకు అభ్యంతరాలు లేవని, స్థిరాస్తుల విక్రయాలలో పారదర్శకత పాటించాలని భవిష్యత్తులో తిరిగి నష్టం వస్తే పాలకవర్గం బాధ్యత తీసుకుని పదవులకు రాజీనామాలు చేయాలన్నారు.

## ఒకటో తరగతి చిన్నారిపై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడి

**ఇబ్రహీంపట్నం ఘటన మరువకముందుకే మరో ఘటన**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారి(7)పై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నంలో ఓ పాఠశాల ప్రిన్సిపాల్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ ఘటన మరువకముందుకే శంషాబాద్ లో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారిపై మంచాల లో లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని అన్ ఫ్రెంట్ జీసస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పిక్నిక్ కోసం ఈనెల 4న మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రిసార్ట్ కు వచ్చారు .చిన్నారి వాష్ రూమ్ కు వెళ్ళింది చూసి వ్యాన్ డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా చిన్నారి తన ఆరోగ్యం బాలేదని తన తల్లికి తెలిపింది. చిన్నారికి రక్తస్రావం అవుతుండడంతో తల్లి ఆస్పత్రికి తీసుకెళ్ళింది. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పాఠశాల ఎదుట చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు మంచాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## సమస్య కోసం వస్తే లైంగికదాడి చేసిన కానిస్టేబుల్

**విషయం బయటకు పొక్కితే అంతుచూస్తానని బెదరింపు**

**వేధింపులు భరించలేక ఫిర్యాదు చేసిన బాధిత యువతి**

**మేడ్చల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తనకు సమస్య ఉందని ఓ యువతి పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ కానిస్టేబుల్ ఆమెకు సహాయం చేస్తానని చెప్పి లోబర్చు కుని గర్భవతిని చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన ఓ యువతి (31) డబ్బుల విషయంలో కొందరు తనను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు గతేడాది మార్చి 21న తన తల్లితో కలిసి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అనంతరం ఆమె తిరిగి వెళుతున్న సమయంలో అక్కడే ఉన్న క్రైం విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి వారికి తగిన న్యాయం చేయిస్తా నని చెప్పి తన సెల్‌ఫోన్ నంబర్‌ను ఆ యువతికి ఇచ్చాడు. మర్నాడు ఆ యువతి కేసు విషయమై కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డికి ఫోన్‌చేయగా లాయర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించుకునేలా చేస్తానని చెప్పి అందుకు ఆమెను ఇంటికి రమ్మని తెలిపాడు. ఇంటికి వెళ్లిన ఆమెను కాసేపు కూర్చోబెట్టి లాయర్ ఇంకా రాలేదని, వచ్చేవరకు ఉండమని చెప్పి తనకు పెళ్లి కాలేదని, తాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను లోబర్చుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భవతి అయితే ఆమె చేత బలవంతంగా మాత్రలు మింగిచ్చి ఆబార్షన్ అయ్యేలా చేశాడు. గత డిసెంబరు 16న సుధాకర్‌రెడ్డి తన వాహనంపై ఆ యువతిని బలవంతంగా తీసుకెళ్లి బెదరించడమే కాకుండా గిర్మాపూర్ రోడ్డులో ఆమెను బండిపై నుండి కిందకి తోసేయడంతో యువతి తీవ్రగాయాల పాలైంది. కాగా, సదరు కానిస్టేబుల్‌ను మేడ్చల్ సిఐ సత్యనారాయణ సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేయించాడు. అయినా అతని వేదింపులు, బెదరింపులు ఆగకపోవడంతో ఆగకపోవడంతో బాధిత యువతి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కానిస్టేబుల్ సుదాకర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.



కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి



ప్రజావాణిలో దరఖాస్తుదారులతో డా.జి.చిన్నారెడ్డి

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 4,901

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 105 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2,865 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,640 దరఖాస్తులు (రేషన్ కార్డుల కోసం) వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి. చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్‌కు బిగ్ షాక్



అనంత పద్మనాభన్


జవగళ్ శ్రీనాథ్


నితిన్ మీనన్

## అంపైర్స్, రిఫరీ టీముల్లో నో ప్లేస్

## ఐసిసి కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషన్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) భారత్‌కు బిగ్ షాకిచ్చింది. త్వరలో జరగబోయే ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం ఏర్పాటు చేసిన అంపైర్లు, రిఫరీ బృందంలో భారత్‌కు చోటు దక్కలేదు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, దుబాయ్‌లలో ప్రారంభం కానుంది. ఇందుకు గాను ఐసిసి 12 మంది అంపైర్ల పేర్లను ప్రకటించింది. ఇందులో ఒక్క భారతీయ అంపైర్‌కు కూడా స్థానం దక్కలేదు. అలాగే, భారత మ్యాచ్ రిఫరీకి కూడా చోటు లభించలేదు. భారత్‌కు సంబంధించిన అంపైర్లలో నితిన్ మీనన్, కెఎన్ అనంత పద్మనాభన్, ఉల్హాస్ గాంధీ, సదాశివ అయ్యర్, కృష్ణరాజ్ శ్రీనాథ్, శంషుద్దీన్ తదితరులు ఉండగా, రిఫరీలకు సంబంధించి జవగళ్ శ్రీనాథ్, వృంధా రతి, శివానీ మిశ్రా, జిఎస్ లక్ష్మి తదితరులు ఉన్నారు. ఇక హైబ్రిడ్ మోడల్ ఆధారంగా జరిగే ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో, టీం ఇండియా తన అన్ని మ్యాచ్‌లన్నింటినీ హైబ్రీడ్ మోడల్‌లో దుబాయ్‌లో ఆడుతుంది. మిగిలిన మ్యాచ్‌లు పాకిస్తాన్ దేశంలో జరగనున్నాయి. ఈ ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారతీయ అంపైర్లు లేదా మ్యాచ్ రిఫరీలు ఎవరూ పాకిస్తాన్‌కు వెళ్లకపోవడమే ఇందుకు కారణం. ఇందులో ఐసిసి మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్, ఎలైట్ ప్యానెల్ అంపైర్ నితిన్ మీనన్ పేర్లు ఉన్నాయి.

కానీ, ఐసిసితో చర్చల తర్వాత వారిద్దరూ పాకిస్తాన్ వెళ్లడం లేదు. టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగాల్సి ఉండగా, ఈ ఇద్దరు సభ్యులు టీమ్ ఇండియా మ్యాచ్‌లో మ్యాచ్ ఆఫీసర్ బాధ్యతను నిర్వర్తించలేరు. భారత మాజీ ఫాస్ట్ బౌలర్లు జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్ ఇప్పుడు ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నుంచి దూరంగా ఉండటానికి ఇదే కారణమని తెలుస్తోంది. ఇక ఐసిసి ప్రకటించిన 12 మంది అంపైర్ల టీం, ముగ్గురు మ్యాచ్ రిఫరీల్లో ఒక్క భారతీయుడు కూడా లేడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన అంపైర్లులో కుమార్ ధర్మసేన, క్రిస్ గాఫ్నీ, మైఖేల్ గౌఫ్, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, ఎహ్సాన్ రాజా, పాల్ రీఫెల్, షరాఫ్ ఉద్దౌలా, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, జోయెల్ విల్సన్. అలాగే మ్యాచ్ రిఫరీల్లో డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండ్రూ పైక్రాఫ్ట్ ఉన్నారు.







## 38వ జాతీయ క్రీడల్లో..

### దీపికకు స్వర్ణం, స్వప్నిల్‌కు కాంస్యం

## ఛాంపియన్‌గా జూయెల్

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో ఒలింపిక్ పతక విజేత స్వప్నిల్ కుసాలె కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. డెహ్రాడూన్‌లో జరిగిన షూటింగ్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రిపొజిషన్ విభాగంలో మహారాష్ట్ర షూటర్ స్వప్నిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్సీబీ) తరఫున బరిలోకి దిగిన 25ఏళ్ల నీరజ్ కుమార్ 464.1 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌కు చెందిన ఐశ్వరి ప్రతాప్ సింగ్ (462.4 పాయింట్లు) రజత పతకం దక్కించుకోగా, పారిస్ ఒలింపిక్స్ కాంస్యం నెగ్గి ఈ విభాగంలో దేశానికి తొలిపతకం అందించిన స్వప్నిల్ (447.7 పాయింట్లు) కాంస్యం గెలుచుకున్నాడు. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్-ప్రమోద్ (హరియాణా) 17-7 పాయింట్ల తేడాతో అంజలి షెఖావత్-ఉమేశ్ చౌదరి(రాజస్తాన్)పై గెలిచి పసిడి ఖాతాలో వేసుకుంది. ఇక రాహి సర్ణోబత్-ప్రణవ్ అరవింద్ పాటిల్ (మహారాష్ట్ర) జట్టు కాంస్యం గెలుచుకుంది. సుదీర్ఘకాలంగా భారత టాప్ ఆర్చర్గా ఉన్న దీపిక కుమారి పసిడిని అందుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడంలో విఫలమైన దీపిక నేషనల్ గేమ్స్‌లో జార్ఖండ్ తరఫున బరిలోకి దిగి వ్యక్తిగత విభాగంతో పాటు, టీమ్ ఈవెంట్లోనూ స్వర్ణం కైవసం చేసుకుంది. కాగా పురుషుల విభాగంలో నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌ను ఓడించిన 18 ఏళ్ల బెంగాల్ ఆర్చర్ జుయెల్ సర్కార్ జాతీయ ఛాంపియన్‌గా అవతరించాడు. మరోవైపు బాక్సింగ్స్‌లో లవ్లీనా బోర్గొహైన్, ఆరు సార్లు ఆసియా చాంపియన్ శివ థాపా విజయాలు సాధించారు. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా తిరుగులేని ప్రదర్శన కనబర్చగా, పురుషుల 64 కేజీల విభాగంలో శివ థాపా (అసోం) సత్తాచాటాడు.

## సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో...

# ఫైనల్లోకి సన్‌రైజర్స్

### రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్-2025 ఫైనల్లోకి సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ (సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం) అడుగుపెట్టింది. సెంచూరియన్ వేదికగా జరిగిన క్వాలిఫయర్-2లో పార్ల్ రాయల్స్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసిన సన్‌రైజర్స్ వరుసగా మూడోసారి తమ ఫైనల్ బెర్తును ఖారారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పార్ల్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోర్ సాధించింది. పార్ల్ బ్యాటర్లలో రూబిన్ హెర్మాన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 53 బంతులు మాత్రమే ఎదుర్కొన్న హెర్మాన్ 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు ఓపెనర్ లువాన్ డ్రే ప్రిటోరియస్ (59) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఓవర్టన్, మార్కో జానెసన్, బార్ట్‌మన్, మార్క్రమ్ తలా వికెట్ సాధించారు. అనంతరం 176 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 19.2 ఓవర్లలో ఛేధించింది. లక్ష్య ఛేధనలో ఈస్టర్న్ కేప్ ఓపెనర్ టోనీ డి జోర్జి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రాయల్స్ బౌలర్లను టోనీ ఊచకోత కోశాడు. కేవలం 49 బంతుల్లోనే 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు జోర్డాన్ హెర్మాన్ సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 48 బంతుల్లో 4ఫోర్లు, 4 సిక్స్‌లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. రాయల్స్ బౌలర్లలో మఫాక, దునిత్ వెల్లలాగే తలా వికెట్ సాధించారు. మిగితా బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఇక ఈనెల 8న జోహాన్స్‌బర్గ్ వేదికగా జరగనున్న ఫైనల్ పోరులో సన్‌రైజర్స్, ఎంఐ కేప్‌టౌన్ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. కేప్‌టౌన్‌కు ఇదే తొలి ఫైనల్ కాగా, సన్‌రైజర్సుకు మాత్రం ఇది ముచ్చటగా మూడో ఫైనల్. తొలి రెండుసీజన్లలోనూ మార్క్రమ్ సారథ్యంలోనే సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఛాంపియన్గా నిలిచింది. కాగా ఈస్టర్న్ కేప్ జట్టు ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి సంబంధించినదే కావడం గమనార్హం.

## రెండో టెస్టులో..ఆధిక్యంలో ఆస్ట్రేలియా




**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఆధిక్యంలో కొనసాగుతోంది. గాలే వేదికగా ఈ మ్యాచ్‌లో శ్రీలంక 330 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 330 పరుగులతో ముందుంది. ఆసీస్ వికెట్‌కీపర్, బ్యాటర్ అలెక్స్ క్యారీ శతక్కొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఐదోస్థానంలో బరిలోకి దిగిన క్యారీ 156 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్ సాయంతో కెరీర్లో రెండోటెస్ట్ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో క్యారీకిముందు స్టీవ్ స్మిత్ కూడా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇలా స్మిత్, క్యారీ సెంచరీలతో కదం తొక్కడంతో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి వెళ్లింది. 74 ఓవర్ల అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ స్కోర్ 3 వికెట్లు నష్టానికి 330 పరుగులుగా ఉంది. క్యారీ (139), స్మిత్ (120) సెంచరీల అనంతరం అదే జోరుతో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 73 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో హెడ్ 21, ఉస్మాన్ ఖ్వాజా 36, లబూషేన్ 4 పరు గులు చేసి ఔటయ్యారు. లంక బౌలర్లలో నిషాన్ పెయిరిస్ 2, ప్రభాత్ జయసూర్య ఓ వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగు లకు ఆలౌటైంది. చండీమల్ (74), కుసాల్ మెండిస్ (85 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి శ్రీలంకకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. కెరీర్లో చివరి మ్యాచ్ ఆడుతున్న దిముత్ కరుణరత్నే 36 పరుగులకే ఔట య్యాడు. రమేశ్ మెండిస్ (28), కమిందు మెండిస్ (13), పథుమ్ నిస్సంక (11) రెండం కెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కుహ్నేమన్, లయోన్ తలో 3 వికెట్లు పడగొట్టగా, ట్రవిస్ హెడ్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

కాగా రెండు టెస్టు మ్యాచ్‌లు, రెండు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా శ్రీలంకలో పర్యటిస్తోంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆసిస్ ఇన్నింగ్స్ 242 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఉస్మాన్ ఖ్వాజా (232) డబుల్ సెంచరీతో కదంతొక్కగా, జోష్ ఇంగ్లిస్ (102), స్టీవ్ స్మిత్ (141) సెంచరీలతో మెరిశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆల్ఔట్ అయి ఫాలో ఆన్ ఆడింది. సెకెండ్ ఇన్నింగ్స్‌లోనూ (247 ఆలౌట్) లంక పరిస్థితి మారలేదు. ఫలితంగా ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆసీస్ బౌలర్లు కుహ్నేమన్ 9, నాథన్ లయోన్ 7 వికెట్లు తీసి లంక పతనాన్ని శాశించారు. కాగా, ఈ టెస్ట్ సిరీస్ అనంతరం ఈ నెల 12, 14 తేదీల్లో కొలొంబో వేదికగా శ్రీలంక, ఆస్ట్రేలియా మధ్య రెండు వన్డేలు జరుగనున్నాయి.

## ఇండియన్ సూపర్ లీగ్‌లో..

## గోవా ఫుట్‌బాల్ క్లబ్ సంచలనం

### 2-1 స్కోరుతో ఒడిశాపై విజయం




**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)-2025 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్సీ) 2-1 స్కోరుతో ఒడిశా జట్టుపై విజయం సాధించింది. గోవాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గోవా తరఫున బ్రిసన్ డ్యూబెన్ ఫెర్నాండెజ్ 29వ నిమిషంలో గోల్ సాధించి గోవాకు తొలి ఆధిక్యం ఇచ్చాడు. ఒడిశా ఆటగాడు లాల్తతంగ ఖవిహ్రింగ్ (47వ నిమిషంలో) చేసిన సెల్ఫ్ గోల్ గోవా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. 54వ నిమిషంలో ఒడిశా స్ట్రయికర్ కెపి రాహుల్ గోల్ చేసినప్పటికీ గోవా విజయాన్ని మాత్రం అడ్డుకోలేక పోయాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో ఒడిశా తమ దాడులకు పదును పెట్టలేకపోయింది. అవతలివైపు నుంచి గోవా ఎఫ్సీ ఆటగాళ్లు మాత్రం పదే పదే ప్రత్యర్థి గోల్‌ఫోస్ట్ వైపు దూసుకొచ్చి ఏకంగా 20 షాట్లు కొట్టారు. లక్ష్యంపై ఆరుసార్లు గురిపెట్టగా ఒకసారి గోల్‌తో విజయవంతమైంది. ఒడిశా 15 షాట్లు ఆడినా, కేవలం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై రెండే సార్లు దాడి చేసింది. ఇందులో ఒకసారి మాత్రం ఫలితాన్ని సాధించింది. గోవా ఆటగాళ్లు మైదానంలో పాదరసంలా కదిలారు. బంతిని ప్రత్యర్థుల కంటే తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అదే పనిగా చకచకా పాస్లు చేశారు.

# పన్ను చెల్లింపుదారులకు ఏది బెస్ట్?


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** నిర్ణీత పరిమితికి మించిన ఆదాయం సంపాదించే దేశంలోని పౌరులందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. అయితే వారికి ఖర్చులు, పెట్టుబడులకు సంబంధించి కొన్ని మినహాయింపులు లభిస్తాయి. ప్రస్తుతం పాత, కొత్త విధానాల్లో ఆదాయపు పన్ను చెల్లింపులు చేయవచ్చు ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు లభిస్తుందో లెక్కించుకుని నిర్ణయం తీసుకోవాలి. కొత్త విధానంలో ఏడాదికి రూ.12.75 లక్షల వరకు సంపాదించేవారు (రూ.75 వేల ప్రామాణిక తగ్గింపుతో సహా) 2025-26 ఆర్థిక సంవత్సరంలో సున్నా పన్ను చెల్లిస్తారు. అయితే ఈ విధానంలో రూ.75 వేల ప్రామాణిక మినహాయింపు ఉన్నప్పటికీ పెట్టుబడులకు తగ్గింపులు లేవు. ఒక వేళ ఆర్థిక సంవత్సరంలో రూ.12.75 లక్షల ఆదాయం దాటితే మొత్తం ఆదాయంపై పన్ను వర్తిస్తుంది. ఎటువంటి తగ్గింపులు ఉండవు. ఎందుకంటే ఈ విధానంలో హెచ్ఆర్ఏ, ఈఎల్ఎస్ఎస్, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎన్పీఎస్ తదితర వాటిని క్లెయిమ్‌చేసుకునే వీలుండదు. బడ్జెట్‌లో పాత పన్ను విధానాన్ని మార్చలేదు. దీనిలో రిబేటు కారణంగా రూ.5లక్షల వరకూ ఆదాయం పన్ను రహితంగా ఉంటుంది. అలాగే ఈ విధానంలో సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, ఎల్ఐసీ ప్రీమియాలకు రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమాప్రీమియాలను క్లెయిమ్‌చేసుకోవచ్చు. సెక్షన్ 24(బి) ప్రకారం రూ.2లక్షల వరకూ హౌసింగ్ రుణంపై వడ్డీని మినహాయింపు లభిస్తుంది. వీటితో పాటు




హెచ్ఆర్ఏ, ఎల్టీఏ తదితర ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. ఆదాయపుపన్ను నిపుణుల అభిప్రాయం ప్రకారం, యేడాదికి రూ.12.75లక్షల వరకూ సంపాదించే వారికి కొత్తఆదాయపు పన్ను విధానం చాలా బాగుంటుంది. అంతకంటే ఎక్కువ సంపాదించే వారుమాత్రం తమ పెట్టుబడులు, ఇతర తగ్గింపులను లెక్కించుకోవాలి. పాతవిధానంలో వచ్చే మినహాయింపులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు ఉంటుందో గమనించి, దాని ప్రకారం పన్ను చెల్లించాలి.

## ఈ రంగాల్లో పెట్టుబడులు భేష్: మోతీలాల్ ఓస్వాల్!

**ముంబై, ఫిబ్రవరి 7:** బడ్జెట్ ప్రవేశపెట్టి దాదాపు రెండు రోజులు గడుస్తోంది. బడ్జెట్ తర్వాత దేశీయ స్టాక్‌మార్కెట్లు తెరచుకున్నప్పటికీ అమెరికాఅధ్యక్షుడు చైనా, కెనడా, మెక్సికోలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించటంతో మార్కెట్లు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అలాగే బడ్జెట్ 2025 ప్రధానంగా దేశంలోని సామాన్య ప్రజలను ఈసారి ఫోకస్ చేస్తూ తీసుకురాబడిన సంగతి తెలిసిందే. ప్రధాన ప్రకటనలను పరిశీలిస్తే 2025 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యతరగతికి పెద్ద ఉపశమనం కల్పించారు. ఈ క్రమంలో ఆమె ప్రజల వద్ద వినియోగానికి అధిక నిధుల లభ్యతను పెంచేందుకు.. కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుండి రూ.12 లక్షలకు పెంచటం జరిగింది. ప్రభుత్వ ఈ నిర్ణయం పన్ను చెల్లింపుదారులకు ఎంతో ఉపశమనం కలిగించింది. ప్రధానంగా హై పెయిడ్ ఉద్యోగాలు చేస్తున్న ఐటీరంగంలోని ఉద్యోగులకు దీని నుంచి పెద్ద ప్రయోజనం దక్కింది. ఈ క్రమంలో దేశీయ స్టాక్ మార్కెట్లు పెట్టుబడిదారులు ఏఏ రంగాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు, బడ్జెట్ తర్వాత ఎలా ముందుకు సాగాలని ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రముఖ దేశీయ బ్రోకరేజ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ స్పందిస్తూ.. తాజా బడ్జెట్లో ప్రభుత్వ నిర్ణయం వినియోగాన్ని పెంచడం ద్వారా మూలధన మార్కెట్‌కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందన్నారు. ఈ నిర్ణయం ఎఫ్ఎంసిజి వంటి రంగాలు లేదా చిన్న వస్తువులతో వ్యవహరించే జొమాటో వంటి కంపెనీలు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. పన్నుల తగ్గింపు వల్ల కన్స్యూమర్ డ్యూరబుల్ కంపెనీలకు ప్రయోజనం దక్కుతుందని చెబుతున్నారు. రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ సంపాదన కలిగిన వ్యక్తులు తమ ఆదాయాన్ని ఖర్చు చేయవలసిన అవసరం లేదని అగర్వాల్ అన్నారు. అటువంటి పరిస్థితిలో వారు పన్ను ఆదా ద్వారా వచ్చే డబ్బులో ఎక్కువ భాగాన్ని మూలధన మార్కెట్లో పెట్టుబడి పెట్టవచ్చని పేర్కొన్నారు. క్విక్ కామర్స్ కంపెనీలు ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. జెప్టో, బ్లికింట్, టాటా బిగ్‌బాస్కెట్, ఇన్ స్టామార్ట్ వంటి కంపెనీలు మంచి గ్రోత్ నమోదు చేయగలవని అంచనాలను వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో పాత కంపెనీలకు ఆదాయ వృద్ధి నెమ్మదిగా ఉన్నప్పటికీ విలువలు ఎక్కువగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.




## భారత్ మార్కెట్‌కు ఫారిన్ లగ్జరీ బ్రాండ్స్

**ముంబై, ఫిబ్రవరి 7:** విదేశీ బ్రాండ్లను భారత రిటైల్ మార్కెట్ ఊరిస్తోంది. 2024లో దాదాపు 27కొత్త విదేశీ రిటైల్ బ్రాండ్ దేశీయ విపణిలోకి ఎంట్రీ ఇచ్చాయి. విలాసవంత వస్తువుల కోసం పెరుగుతున్న డిమాండ్ ప్రస్తుతం తమ ఉనికిని చాటుకోవడానికి ఇవి భారత్‌లో రంగ ప్రవేశం చేస్తున్నాయని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ప్రదర్శన. అంతక్రితం. ఏడాదితో భారత్‌లో అడుగుపెట్టిన బ్రాండ్ల సంఖ్య 2024లో రెట్టింపు అయిందని, పట్టణీకరణ, ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరగడం, షాపింగ్ ప్రాధాన్యతల్లో మార్పు లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతోందని వివరించింది. భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా చురుకైన రిటైల్ మార్కెట్లలో ఒకటిగా మార్చిందని, 2023లో 14 బ్రాండ్లు ఇక్కడికి ప్రవేశించాయి. నాలుగేళ్లలో 60 విదేశీ బ్రాండ్లు భారతకు వచ్చాయి. దేశీయ రిటైల్ బ్యూటీ, సాధనాలు, ఆరోగ్య సంరక్షణ పాదరక్షలు, బ్యాగ్స్, యాక్సెసరీస్, ప్యాషన్, దుస్తుల విభాగాల్లో టాప్3లో నిలిచాయి. భారత రిటైల్ రంగం అంతర్జాతీయ కంపెనీల దృష్టిని ఆకర్షించింది. నాలుగేళ్లుగా ఇక్కడి విపణిలో ఉనికిని నెలకొల్పడానికి ప్రయత్నాలను క్రమంగా పెంచుతుంది. గత సంవత్సరం ప్రవేశించిన కంపెనీలలో 56 శాతం యూరప్, మధ్యప్రాచ్య, ఆఫ్రికా స్థాపించబడినవి. ఫ్రెంచ్ ఇటాలియన్ సంస్థలు కూడా ఉన్నాయి.



# వాణిజ్యం

## ఆధార్‌పై కేంద్రం కీలక అప్‌డేట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారతీయ పౌరులకు ఆధార్ అత్యంత ముఖ్యమైన గుర్తింపు కార్డులలో ఒకటి. ఆధార్ కార్డులో కాలానుగుణంగా కొన్ని మార్పులు చేస్తోంది కేంద్రం. ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డుకు సంబంధించి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే ప్రైవేట్ కంపెనీలు ఆధార్ కార్డు వివరాలను ఉపయోగించుకోవడానికి అనుమతించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ కొత్త ప్రకటన ఏంటో చూద్దాం. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ భారతదేశంలోని ప్రతి పౌరుడికి 12 అంకెల ఆధార్ కార్డును జారీ చేస్తుంది. 12 అంకెల సంఖ్యతో పాటు, ఆధార్ కార్డులో పేరు, వయస్సు, చిరునామా, మొబైల్ నంబర్, వేలిముద్రతో సహా కొన్ని ముఖ్యమైన వ్యక్తిగత సమాచారం కూడా ఉంటుంది. ఆధార్‌లో అంత ముఖ్యమైన వివరాలు ఉన్నందున, దానిని భారతపౌరులకు ముఖ్యమైన గుర్తింపు పత్రంగా పరిగణిస్తారు.ప్రభుత్వ మంత్రిత్వ శాఖ, విభాగం కాకుండా ఏదైనా సంస్థ ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించాలనుకుంటే తప్పనిసరిగా అందుకు కారణాలను కేంద్రానికి గానీ, యూఐడీఏకి గానీ వివరించాలని కేంద్రం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ప్రతిపాదన ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ప్రామాణీకరణ ఎందుకు అవసరమో, అది ప్రజలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో కూడా ప్రైవేట్ సంస్థలు వివరించాల్సి ఉంటుంది. దానిని సంబంధిత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ,విభాగానికి పంపాలి. ఏదైనా దుర్వినియోగానికి సంబంధించినవి ఉంటే అనుమతి ఉండదు. అయితే ఈ ప్రైవేట్ సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు పలు నిబంధనలు విధించింది కేంద్రం. సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు కారణాలు ఏమిటి? ఆధార్ వివరాలను పొందాలంటే అందుకు కారణాలు కేంద్ర ప్రభుత్వానికి గానీ, యూఐడీఏఐకి గానీ ప్రైవేట్ సంస్థలు వివరించాలి. అలాగే ఆ వివరాలన్ని కూడా ప్రజలకు సమ్మతమైనవిగా ఉండాలి. కేంద్రం విధించిన నిబంధనలకు సరిగ్గా ఉండాలి. అందులో ఏ ఒక్కటి కూడా వ్యతిరేకంగా ఉంటే కేంద్రం అనుమతి ఇవ్వదు. ఆధార్ కార్డులపై వేలిముద్రలు, ఐరిస్ వంటి సమాచారాన్ని ఉపయోగించి మోసానికి పాల్పడిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.




## ఐపిఒకు అజాక్స్ ఇంజినీరింగ్

**ముంబై, ఫిబ్రవరి 7:** ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేదారా కేపిటల్ మద్దతు కలిగిన కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీదారు అజాక్స్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ ఫిబ్రవరి 10న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. మొత్తం రూ.1269 కోట్లు సమీకరించనుంది. ఐపిఒలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.599-629గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి ఏడో తేదీన సబ్‌స్క్రిప్షన్ విండో తెరుచుకోనుంది. ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.01 కోట్ల షేర్లను ప్రమోటర్లు, షేర్ హోల్డర్లు విక్రయించనున్నారు. కేదారా కేపిటల్ మొత్తం 74.37 లక్షల షేర్లను విక్రయించనుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుండడంతో కంపెనీకి ఎలాంటి డబ్బులూ రాబోవు. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువరూ.7200 కోట్లుగా ఉండనుంది. ప్రముఖ కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీలో అజాక్స్ ఇంజినీరింగ్ ఒకటి. కర్ణాటకలో నాలుగు అసెంబ్లింగ్, తయారీ యూనిట్లుఉన్నాయి. కర్ణాటకలో మరో యూనిట్ ఈ యేడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి రానుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.17441 కోట్ల ఆదాయాన్ని, రూ.225 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. ఈ ఐపిఒకు ఐసిఐసిఐ సెక్యూరిటీస్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జెఎం ఫైనాన్షియల్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్స్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.




## పోస్టల్ శాఖలో పెను మార్పులు

**ముంబై, ఫిబ్రవరి 7:** 150 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన, ప్రపంచంలోనే అతి పెద్ద పోస్టల్ నెట్‌వర్క్ అయిన ఇండియాపోస్ట్‌ను 1.5లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలతో పెద్ద లాజిస్టిక్స్ సంస్థగా మార్చనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2025ను సమ ర్పిస్తూ గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఇండియా పోస్ట్‌కు సంబంధించిన పరివర్తన ఒక ఉత్ప్రేరకంగా పని చేస్తుందని సీతారామన్ హామీ ఇచ్చారు. గ్రామీణ రంగానికి సంబంధించిన ఇతర సంస్కరణ చర్యలలో రుణ కార్యకలాపాల కోసం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మద్దతు ఉందని చెప్పారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌తో 1.5 లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలు, 2.4 లక్షల మంది డాక్ సేవకుల విస్తృత నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని వివరించరు. ఇండియా పోస్ట్‌ను పెట్టుబడిగా పెట్టుకునే మార్చే ప్రణాళికలను టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గతేడాది సెప్టెంబర్‌లో మొదటిసారి ప్రకటించారు. దీన్ని లాజిస్టిక్స్ సంస్థగా మార్చడం వల్ల వచ్చే మూడు, నాలుగేళ్లలో శాఖ ఆదాయం 50నుంచి 60శాతం పెరుగుతుందనిఆయన చెప్పారు. దీని కోసం ఆక్న డిసెంబరులో ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి నిధులను కోరారు. తద్వారా 2029 నాటికి డిపార్ట్‌మెంట్‌ను లాభదాయకంగా మార్చడానికి, లాజిస్టిక్స్ కంపెనీగా మార్చడానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వస్తువుల డెలివరీ సేవలను పెంపొందించడానికి సహాయం చేస్తుందని వివరించారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో శాఖ పాత్ర దిశగా ముందుకు సాగింది. డిసెంబరులో డిపార్ట్‌మెంట్ కోసం కొత్త డెవలప్‌మెంట్ ప్లాన్ కోసం తన ప్రెజెంటేషన్‌ను ఇస్తూ త్వరలోనే పోస్టల్ సేవలను ప్రజల ఇంటి వద్దకు తీసుకెళ్తామని సింధియా చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆదాయాన్ని పెంచడానికి, ఖర్చులను హేతుబద్ధీకరించడం, మెజారిటీ ప్రక్రియలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో సహా అన్ని సంభావ్య సేవలను పరిశీలిస్తామన్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.